

కదలని హాస్టల్ భవన నిర్మాణ పనులు

అలూ లేదు.. చూలూ లేదు. అల్లుడు పేరు సోమలింగం అన్న చందంగా ఉంది మార్కాపురం మెడికల్ కాలేజీ వ్యవహారం. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అబ్బో అంతా పూర్తి.. ఇక క్లాసులు మొదలు, వైద్యసేవలూ అందుతాయ్ అంటూ హడావుడి. వాస్తవంగా అక్కడ పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది. ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాలేదు. మూడేళ్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి 2021 మే 21న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన సందర్భంగా ప్రకటించారు. అదే విషయాన్ని శంకుస్థాపనలో పాల్గొన్న జిల్లా మంత్రి సురేష్, ఇతర వైసీపీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. దాదాపు మూడేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. నిధుల సమస్య ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి.



పునాదుల్లోనే మార్కాపురం మెడికల్ కాలేజీ పనులు

గాలి మేడలు

నత్తనడకన మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం

ఒక్క భవనం పూర్తి కాలేదు.. ఇంతవరకు పరిశీలించని ఎన్ఎంసీ

పశ్చిమ ప్రకాశం ప్రజలకు అందని ద్రాక్షాలా వైద్యసేవలు

రూ.475 కోట్ల ప్రాజెక్టుకు రూ.50 కోట్లే వ్యయం

అందులో రూ.20 కోట్లు పెండింగ్

ఈ ఏడాది కాలేజీ అడ్మిషన్లకు అవకాశమే లేదు

ఒంగోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో రూ.475 కోట్ల వ్యయంతో 500 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ఆస్పత్రి, 100 మెడికల్ సీట్లు ఉండే కళాశాలను 2021 మార్చి 22న మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రాయవరం వద్ద 50.50 ఎకరాల్లో ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణంలో భాగంగా ఆస్పత్రి, బోధనాస్పత్రి, నర్సింగ్ కళాశాల, మెడికల్, నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు హాస్టళ్లు, క్వార్టర్లు, భారీ కిచెన్, డైనింగ్ హాలు, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్‌వంటి నిర్మాణాలు చేయాలి. ఇందుకు సంబంధించి 2021 మే 21న శంకుస్థాపన చేయగా, అనంతరం టెండర్లు పిలవడంతో మేఘా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. మొత్తం పనులు 30నెలల్లో పూర్తిచేసేలా అగ్రిమెంట్ జరిగింది. టెండర్ల అవార్డు ప్రకారం 2024 సెప్టెంబరు ఆఖరుకు పూర్తికావాలి. టెండర్ల ఖరారుకే పది నెలలు గడిచిపోగా ఆ తర్వాత ఇంచుమించు ఏడాది పాటు పనులు ప్రారంభమే కాలేదు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలను సదరు కంపెనీ పొందగా తొలిదశ చేపట్టిన వాటికి బిల్లులు సక్రమంగా రాక పనులు సత్వరం చేపట్టలేదు. ఇక ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి.



కాలేజీ బ్లాక్-3లో గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్‌కు సిద్ధం చేస్తున్న కార్మికులు

కౌన్సిల్ అనుమతి రావాలంటే..

మెడికల్ కాలేజీ అడ్మిషన్లు ప్రారంభించాలంటే జాతీయ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) అనుమతి ఇవ్వాలి. సదరు సంస్థ అనుమతి మంజూరు చేయాలంటే మొత్తం నిర్మాణాలు పూర్తిచేయడంతోపాటు రెండేళ్లపాటు అక్కడి వైద్యశాలలో రోగులకు వైద్య సేవలు అందించాలి. మొత్తం సిబ్బంది నియామకం పూర్తి చేయాలి. ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారం అంతా జరగాలి. అందుకోసం రెండు, మూడు విడతలుగా ఎన్ఎంసీ బృందం వచ్చి పరిశీలించి సంతృప్తి చెందితేనే అనుమతి ఇస్తుంది. 2024-25 నుంచే మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రారంభించనున్నట్లు వైసీపీ ప్రభుత్వం, నీలిమీడియా అబద్ధపు ప్రచారం చేస్తుండగా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మరో రెండేళ్లకు కూడా వైద్య సేవలు ప్రారంభించే అవకాశాలు కనిపించడం లేదు. ఏడాది క్రితం నిర్మాణాలు ప్రారంభించగా ప్రస్తుతం ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాలేదు. కీలకమైన మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు మూడు, నాలుగు అంతస్తులలో నిర్మించాల్సి ఉండగా, ప్రస్తుతం కొన్నింటిని అరకొరగా శ్లాబ్‌లు పూర్తిచేశారు. మరి కొన్నింటికి శ్లాబ్‌లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. విద్యార్థుల హాస్టల్ భవనాలపై ఇంతవరకు స్పష్టత లేకపోగా అంతర్గత రోడ్లు, ఇతర సౌకర్యాలు పనులు ప్రారంభమే కాలేదు. అడ్మిషన్లకు అనుమతి ఇవ్వాలంటే రెండేళ్లు వైద్య సేవలు సదరు కాలేజీలో అందించాల్సి ఉండగా కొత్తగా నిర్మిస్తున్న భవనాలు ఎప్పటికి పూర్తవుతాయి, వైద్యసేవలు అందించేది ఎప్పుడు అన్నది ప్రశ్నార్థకమే.

తాత్కాలిక షెడ్లతో మమ

వైద్యకళాశాలకు అనుమతులివ్వడంలో వైద్యసేవలు అందించే నిబంధనే చాలా కీలకం. మార్కాపురంలో నడుస్తున్న జిల్లా వైద్యశాలలో వైద్యకళాశాల ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నట్లు ఎన్ఎంసీ తనిఖీ సందర్భంగా చూపేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం ఆ ఆసుపత్రిలో తాత్కాలికంగా షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్ కాలేజీ బెడ్ల కెపాసిటి 500 కాగా, ప్రస్తుతం ఉన్న జిల్లా ఆస్పత్రికి 100 బెడ్ల కెపాసిటీ మాత్రమే ఉంది. తాత్కాలిక షెడ్లలో మరో 100 పడకలను ఏర్పాటు చేస్తున్నారు. సిబ్బంది నియామకం ఇంతవరకు జరగలేదు. మెడికల్‌కాలేజీకి కేటాయించిన మొత్తం రూ.475 కోట్లలో ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేసినా వాటి పూర్తికి మరో రెండేళ్లు పట్టడం ఖాయం. ఆ తర్వాత వైద్యసేవలు అందించి ఎన్ఎంసీ అనుమతి పొందగలిగితేనే అడ్మిషన్లకు అవకాశం కలిగించేది. మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేది. వాస్తవాలను పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వ పెద్దలు, నీలి మీడియా ఈ ఏడాదే మెడికల్ కాలేజీ ప్రారంభం అని ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆలా అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పోలీసులకు సహకరించండి

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరమేశ్వరరెడ్డి

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 12 : పోలీసులకు విధి నిర్వహణలో ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని నూతన ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ కోసం అన్నివర్గాలు సహకరించాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కృషి చేయాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతో సమావేశమై పరిస్థితులను అవగాహన చేసుకుని ముందుకు వెళతామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీసు అధికారులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు, ఏఎస్పీ ఏఆర్ అశోక్‌బాబు డీఎస్పీలు కిషోర్‌బాబు, అశోక్‌వర్ధన్, బాలసుందరరావు, విక్రం శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మలికగర్గ్‌కు ఘనంగా వీడ్కోలు

జిల్లాలో ఎస్పీగా పనిచేసి బదిలీపై తిరుపతి వెళ్లిన మలికగర్గ్‌కు పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. సోమవారం ఉదయం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్‌లో మలికగర్గ్‌ను ఊరేగించి ఘనంగా వీడ్కోలు పలికారు. మహిళా పోలీసు అధికారులు ఆమెను చేతులపై మోస్తు అభిమానాన్ని చాటుకున్నారు.



503 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్

111 ఎస్జీటీలు, 290 స్కూలు అసిస్టెంట్లతోపాటు

గురుకులలో 93 పోస్టుల భర్తీ

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 12: జిల్లాలో 503 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేసేందుకు ప్రభుత్వం సోమవారం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 111 ఖాళీలను ప్రకటించింది. ఈ మొత్తంలో పాఠశాల విద్యలో 98, గిరిజన పాఠశాలల్లో మూడు ఖాళీలను చూపించారు. అదేవిధంగా 299 స్కూలు అసిస్టెంట్ ఖాళీలను చూపించారు. వీటిల్లో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 290 ఖాళీలు చూపించగా గిరిజన పాఠశాలల్లో 8, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఒకటి ఖాళీని చూపించారు. గురుకుల పాఠశాలల్లో 93 టీజీటీ పోస్టులను ఖాళీలుగా చూపించారు. ఏపీ మోడల్ స్కూళ్లలో 12, బీసీ సంక్షేమ గురుకులాల్లో నాలుగు, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 21, ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో 47, ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో తొమ్మిది పోస్టులు చూపించారు. 2018 సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి ఈనెల 21 వరకు అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి. 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 5 నుంచి హాల్‌టికెట్లు, మార్చి 15 నుంచి 30వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో పరీక్షలు. డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు జనరల్ కేటగిరీ అభ్యర్థులు 44ఏళ్లు కాగా రిజర్వుడు కేటగిరిలకు మరో ఐదేళ్ల వయోపరిమితిని పెంచారు.

చివర్లో పేదలు గుర్తొచ్చారా?

అబద్ధాలతో మోసం చేయడం మానుకో

పేదల పట్టాలను టీడీపీ అడ్డుకోదు.. స్వాగతిస్తుంది

నా ఇల్లు.. ఆంధ్రజ్యోతిని ముట్టడిస్తామంటే. ఇక్కడెవరూ భయపడరు

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేనిపై దామచర్ల ఫైర్



జయహో బీసీ సదస్సులో జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 12 : 'నాలుగున్నరేళ్లుగా కానరాని పేదలు వారం పదిరోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి గుర్తుకొచ్చారు. మాయ చేసేందుకే ఇప్పటికిప్పుడు పట్టాలంటున్నారు. అది సాధ్యపడదని తెలిసి టీడీపీపై నిందలు వేస్తున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి అంటావు.. ఒకసారి రోజు నీళ్లు ఇవ్వకపోతే పోటీ చేయనంటావు. ఇంకోసారి పట్టాలు ఇవ్వకపోతే, మరోసారి మాగుంట లేకపోతే పోటీ చేయనంటావు. నీ చేతకానితనాన్ని తెలుగుదేశంపై నెడతావు. పేదలకు పట్టాలను టీడీపీ అడ్డుకోదు. మంచిపనిని ఎప్పుడు స్వాగతిస్తుంది. నిబంధనలు తెలియవా? నీ మాయ మాటలను ప్రజలు గుర్తిస్తున్నారని తెలిసి అదేమంటే నా ఇల్లు, ఆంధ్రజ్యోతి ఆఫీస్‌ను ముట్టడిస్తా అని బెదిరిస్తే ఎవరూ భయపడరు.. పిల్ల రాజకీయాలు మానుకో..' అంటూ ఎమ్మెల్యే బాలినేనిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ ఫైర్ అయ్యారు. సోమవారం స్థానిక పీఏజీ కన్వెన్షన్ హాలులో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఎన్నికలప్పుడు హామీ ఇవ్వడం.. చేయలేక టీడీపీపైకి నెట్టడం

ఎమ్మెల్యే బాలినేని ప్రతిసారి ఎన్నికల సమయంలో ఏదో ఒక హామీ ఇవ్వడం చేయలేక తన చేతగానితనాన్ని టీడీపీపైకి నెట్టడం అలవాటుగా మారిందని జనార్దన్ మండిపడ్డారు. టెండర్లు తెరవకుండా పనులు చేయడం వెనుక అంతర్యం ఏమిటన్నారు? నిబంధనల ప్రకారం పనులు జరిగితే కోర్టులు కూడా న్యాయమైన తీర్పు ఇస్తాయన్నారు. సొంత డబ్బుతో పెన్షన్‌లు, ఇళ్ల పట్టాలు అంటూ చెప్పడానికి నువ్వేమైనా రాజువా.. ఏం వ్యాపారాలు చేసి అంత డబ్బులు పెడుతున్నారు. అంత శ్రద్ధ ఉంటే నగరంలో అభివృద్ధి పనులు సొంతంగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పోతురాజు కాలువ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించావ్.. ప్రతీది ప్రజల కోసం అంటావుగా మరి సొంత డబ్బుతో బాగు చేయవచ్చు కదా అని ఎద్దేవా చేశారు.

మెప్మాలో స్కాంను మేయర్ ఒప్పుకున్నారు

ఇటీవల ఆంధ్రజ్యోతిలో మెప్మాలో కుంభకోణం వెలుగులోకి వచ్చిందని జనార్దన్ చెప్పారు. వాస్తవమేనని మేయర్ కూడా స్వయంగా ఒప్పుకున్నారు. దీనిపై తాము పూర్తిస్థాయి విచారణ కోరామని, బాధ్యులపై చర్యలుంటాయని తెలిపారు. కార్పొరేషన్‌లో అధికారులు, వైసీపీ కార్పొరేటర్లు దోచుకుంటున్నారన్నారు. తాము అధికారంలోకి రాగానే మొత్తం కక్కిస్తామన్నారు.

ఇల్లు ముట్టడిస్తే ఇక్కడెవరూ భయపడరు

ఎమ్మెల్యే చేతగానితనాన్ని ప్రశ్నిస్తే మైండ్ పోయి మాట్లాడుతున్నారని, ఇళ్లు, పత్రికల కార్యాలయాలు ముట్టడిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 75వేల మందితో ఇల్లు ముట్టడిస్తే తామేమైనా చేతకాని వారమా? మాకు లేరా లక్షల్లో జనం అంటూ ధ్వజమెత్తారు. చేతనైతే న్యాయంగా పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. పట్టాలు ఇస్తే తాము కూడా స్వాగతిస్తామని, ఎందుకు అడ్డుకుంటామన్నారు. ఈనెల 25లోపు పట్టాలు ఇచ్చి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.


స్థానికేతర ఓట్లు యథాతథం

తొలగించని బీఎల్‌వో, వీఆర్ఏ

వైసీపీకి కొమ్ముకాస్తున్న సిబ్బంది




హైదరాబాద్‌లో ఉంటున్న వీఆర్ఏ బంధువుల ఓట్లు



జాబితాలో గుంటూరులో నివాసం ఉంటున్న వారి ఓట్లు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 12 : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఓట్ల అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. గ్రామాల్లో తమ ప్రాధాన్యం, ప్రాతినిధ్యం, పెత్తనం కోసం అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకులు అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. మండలంలోని కొత్తఅన్నసముద్రం గ్రామమే దీనికి ఉదాహరణ. గ్రామంలో మొత్తం 1330 ఓట్లు ఉండగా, 116వ కేంద్రంలో గ్రామానికి చెందిన సుమారు 40 మందికి పైగా ఇతర ప్రాంతాలలో నివాసముంటున్నారు. వారి ఓట్లు తొలగించకుండా సంబంధిత బీఎల్‌వోను అధికార పార్టీ నాయకులు మేనేజ్ చేశారు. వీరిలో 5 నుంచి 30 ఏళ్ల క్రితం పెళ్లై ఇతర ప్రాంతాల్లో ఉంటున్న మహిళలు, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడినవారు కూడా ఉన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వారు గ్రామానికి వచ్చి ఓట్లు వేసి వెళుతుంటారు.



వినుకొండ, హైదరాబాద్‌లలో ఉంటున్నా ఇక్కడ ఓట్లు

గ్రామంలో బంధువులు మాత్రమే ఉంటారు కానీ, ఇళ్లు, పొలాలు, ఆధార్, రేషన్‌కార్డులు వంటివి కూడా ఏమీ ఉండవు. ఇలాంటి ఓట్లు తొలగించకుండా బీఎల్‌వోలు, అధికార పార్టీ నాయకులు ఒక్కటయ్యారు. పారదర్శకతకు పాతరేశారు. ఇలాంటి ఓట్లపై గ్రామంలోని కొందరు అభ్యంతరాలు చెప్పినా అంతా మాఇష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారు.

- పచ్చిగోళ్ల దానియేలు, సుమతమ్మ వినుకొండలో, పచ్చిగోళ్ల చినదావీదు, నడిపి దావీదులు హైదరాబాదులో సుమారు 25 ఏళ్ల నుంచి ఉంటున్నారు. ఈ ఓట్లను తొలగించకుండా 116 కేంద్రంలో వరుస సంఖ్య 425, 426, 427, 429లలో అలానే ఉంచారు.
- పల్లె వెంకటరావు, పల్లె కుమారి, పల్లె త్రిపురయ్య, పల్లె నాగమ్మ గుంటూరులో చాలా ఏళ్ల నుంచి ఉంటున్నారు. ఈ ఓట్లను కూడా తొలగించకుండా 116 కేంద్రంలో వరుస సంఖ్య 570, 572, 573, 574లలో కొనసాగిస్తున్నారు.
- మాలపాటి జ్యోత్స్న, మాలపాటి జయ, మాలపాటి విజయరావు, మాలపాటి జశ్వంత్, మాలపాటి జయమ్మ, మాలపాటి చిన్నబాలస్వామి, మాలపాటి కమలమ్మలు 15 ఏళ్ల నుంచి విజయవాడలో ఉంటున్నారు. ఓట్లను తొలగించకుండా వరుస సంఖ్య 297, 298, 299, 300, 338, 339, 340లలో ఉంచారు.
- ఇదే కేంద్రంలోని కసుపర్తి వెంకటరమణ, కసుపర్తి మాణిక్యం, కసుపర్తి విజయలక్ష్మి, కసుపర్తి జోనా, కసుపర్తి జాన్‌శీలాలు 30 ఏళ్లకు పైగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరి ఓట్లను కూడా తొలగించకుండా వరుస సంఖ్య 275, 276, 277, 278, 279లలో కొనసాగిస్తున్నారు. గ్రామంలోని ఓ వీఆర్ఏకు బంధువులు కావడంతో తొలగింపులు చేపట్టకుండా అలానే ఉంచినట్లు విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు అధికారపార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ ప్రత్యర్థుల ఓట్లు తొలగించేందుకు సహకరిస్తున్నట్లు వీఆర్ఏపై పలు ఆరోపణలు ఉన్నాయి.

అభ్యర్థులను మార్చినా అసమ్మతి

తగ్గేదేలే..!

గిద్దలూరు, మార్కాపురం పరిచయ కార్యక్రమాల్లో పునరావృతం

అసమ్మతి నాయకులు రాకపోవటంతో బయటపడ్డ రాంబాబు

బాలినేని కలయికలోనూ మారని అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ స్థానిక నేతల, పార్టీ శ్రేణుల అసమ్మతికి విరుగుడుగా అభ్యర్థులను మార్చినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించటం లేదు. మార్కాపురం నియోజకవర్గాల అభ్యర్థుల పరిచయ కార్యక్రమం ఆదివారం మార్కాపురంలోని ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించగా, సోమవారం గిద్దలూరు నాయకులకు నాగార్జునరెడ్డిని పరిచయం చేసే కార్యక్రమాన్ని మార్కాపురంలో ఎమ్మెల్యే రాంబాబుకు చెందిన కిట్స్ కాలేజీలో నిర్వహించారు. రెండు కార్యక్రమాలకు సాధారణ పార్టీ సభ్యులను తీసుకురావటంలో నాయకులు సఫలీకృతులైనా అసమ్మతి నాయకులను మాత్రం కదిలించలేకపోయారు. దీంతో జగన్ అభ్యర్థుల మార్పుతో కిందిస్థాయి నాయకుల్లో అసమ్మతిని పోగొట్టాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. మార్కాపురం సమావేశంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పార్టీశ్రేణులను రాంబాబుకు పరిచయం చేశారు. ఆయన మామ అయిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి హాజరైనా ఆయనను వ్యతిరేకిస్తున్న నాయకుల నుంచి హాజరు పెద్దగా కనిపించలేదు. జగన్ తనను మోసం చేశాడని భావిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఆయనతోపాటు రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జడ్పీటీసీగా ఉన్న ఆయన సతీమణి ఇందిర, మార్కాపురం జడ్పీటీసీ నారు బాపనరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి లక్ష్మీదేవి, గజ్జలకొండ, చింతగుంట్ల ఎంపీటీసీలు తదితర గ్రామస్థాయిలో పట్టు ఉన్న నాయకులు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఇటు మార్కాపురం మున్సిపాలిటీతో పాటు ఇతర మండలాల వారు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పొదిలి, కొనకనమిట్ల మండలాల నుంచి ముఖ్య నాయకులను సమీకరించే విషయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులరెడ్డి సఫలీకృతమైనప్పటికీ పెద్దసంఖ్యలో గ్రామస్థాయి నాయకులు కదలకపోవటం విశేషం. ప్రత్యేకించి రెడ్డి సామాజికవర్గానికి చెందిన కొందరు దూరంగా ఉండగా మరికొందరు సమావేశానికి హాజరైనా అభ్యర్థి మార్పును జీర్ణించుకోలేకపోతున్నట్లు సహచరులతో మాట్లాడటం విశేషం. ఆయా ప్రాంతాల్లోని నాగార్జునరెడ్డి ముఖ్య అనుచరుల్లో ఆవేదన అసంతృప్తి కనిపిస్తోంది. ఇంతకాలం ఎమ్మెల్యేకి, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నవారిని కిందిస్థాయిలో తమతో కలిసిరాని వారిని తీసుకొచ్చి తమపై రుద్దుతారేమోనన్న ఆందోళనలో వారు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆ సమావేశానికి అత్యధికులు గైర్హాజరు

సోమవారం జరిగిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పరిచయ కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గం నుంచి అసమ్మతి నాయకులందరూ గైర్హాజరవటం భారీ షాక్‌గా భావిస్తున్నారు. అర్ధవీడు, కంభం, బీపేట, కొమరోలు, గిద్దలూరు ఎంపీపీలు వెంకటరావు, తులశమ్మ, ఓసూరారెడ్డి, అమూల్య, కడప లక్ష్మీలు గైర్హాజరయ్యారు. అర్ధవీడు జడ్పీటీసీ చెన్ను విజయ కూడా కార్యక్రమానికి హాజరుకాలేదు. గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ వెంకటసుబ్బయ్య, వైస్ చైర్మన్ రామకృష్ణ, వైసీపీకి చెందిన కౌన్సిలర్లు సుమారు పదిమంది హాజరుకాలేదని తెలుస్తోంది. వీరితో పాటు గిద్దలూరు వైసీపీ టికెట్ ఆశించిన ముఖ్యుల్లో లింగారెడ్డి, రమణారెడ్డిలు కూడా హాజరుకాలేదని సమాచారం. కిందిస్థాయిలో తనతో నడిచే వారిని ఎక్కువసంఖ్యలో సమీకరించటానికి ఎమ్మెల్యే రాంబాబు ప్రాధాన్యమిచ్చినప్పటికీ అసమ్మతినేతలంతా హాజరుకాకపోవటం చర్చనీయాంశమైంది. దీంతో ఈ సమావేశంలో మాట్లాడిన రాంబాబు వారి గైర్హాజరుపై ఆవేదన వ్యక్తం చేశారు. తనను వ్యతిరేకించినా జగన్ ప్రకటించిన అభ్యర్థిని కూడా వారు వ్యతిరేకించటం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. దీంతో రెండుచోట్ల అసమ్మతి నేతల అసంతృప్తి అభ్యర్థుల మార్పుతో చల్లారలేదని తేటతెల్లమైంది.



మార్కాపురంలో గిద్దలూరు నేతల పరిచయ కార్యక్రమం

ప్రణీత్‌రెడ్డికి నో!

సోమవారం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని జగన్‌ను కలిశారు. కుమారుడు ప్రణీత్‌రెడ్డి, భాస్కరరెడ్డిలతో కలిసి వెళ్లి ఆయన జగన్‌ను కలవటం గమనార్హం. గిద్దలూరులో స్థానికేతరుడికి కాకుండా స్థానిక అభ్యర్థికే అవకాశం ఇవ్వాలని నాయకులు అసంతృప్తితో ఉన్న విషయాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్తున్నారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల సీనియర్ నాయకులతోపాటు వారి కుమారులు లేక కుటుంబ సభ్యులకు పోటీచేసే అవకాశం ఇచ్చిన అంశాన్ని ప్రస్తావిస్తూ తన కుమారుడు విషయాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలుస్తోంది. 'ప్రణీత్ విషయం నేను చూసుకుంటా. వచ్చే ఎన్నికలనాటికి ఇలాంటి వారందరికీ అవకాశం ఇద్దాం. ప్రస్తుతానికి అభ్యర్థుల్లో ఎలాంటి మార్పులేదు' అని సీఎం చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డే ఉంటారని మరోసారి సీఎం జగన్ స్పష్టం చేసినట్లు తెలిసింది. ఒంగోలులో పేదలకు నివాసస్థల పంపిణీకి అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఈనెల 21 లేక ఆ తర్వాత నోటిఫికేషన్ రాకముందే ఒంగోలు వచ్చి పట్టాలను పంపిణీ చేస్తానని సీఎం బాలినేనికి హామీ ఇచ్చినట్లు సమాచారం.


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

గుండ్లకమ్మ ప్రాజెక్టు పనులను వెంటనే పూర్తిచేయాలి

● ధర్నాలో రైతుసంఘం ప్రధాన కార్యదర్శి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 :గుండ్లకమ్మ ప్రాజెక్టులో మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలని రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు సంఘం ఉపాధ్యక్షుడు టీవీ శేషు అధ్యక్షత వహించారు. ధర్నాలో హనుమారెడ్డి మాట్లాడుతూ రూ. 647 కోట్ల ప్రజాధనంతో 14 సంవత్సరాల క్రితం ప్రాజెక్టును పూర్తి చేసినా ఆయకట్టు పరిధిలోని భూములకు ఇప్పటికీ నీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో ప్రాజెక్టు సమస్యను తీసుకెళ్ళినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే వీరారెడ్డి మాట్లాడుతూ 18 నెలల క్రితం కొట్టుకుపోయిన మూడో నెంబరు గేటును బిగించాలని రైతు సంఘం కోరినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయాలని లేనిపక్షంలో తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు ఎన్. వెంకటేశ్వర్లు, కే వెంకట్రావు, పోకూరు వెంకటేశ్వర్లు, లింగ ఆంజనేయులు, స్వర్ణ కృష్ణయ్య, ఎస్డీ సర్దార్, వి కోటిరెడ్డి, వి. రమణమ్మ, కే వెంకమ్మ, సీహెచ్ ఆదినారాయణ ఉన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

16న జరిగే సమ్మెను విజయవంతం చేయండి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 :కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్‌బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సోమవారం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు బీజేపీ అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా, బ్యాంకింగ్, ఎల్ఐసీ వంటి సంస్థలన్నింటిని అదాని, అంబాని తదితర కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తోందని విమర్శించారు. ఈనెల 16న జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్డీ సర్దార్, బి. సబ్బారావు, హరికృష్ణ, కందుకూరి సుభాన్‌నాయుడు, సుబ్బారావు, లోకేష్ ఉన్నారు.



ఒంగోలు మండలపరిషత్ సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఏఈ శేషగిరిరావు

సచివాలయ భవనాలు పూర్తి చేయించాలి

● మండల సమావేశంలో ఎంపీటీసీలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 12 : గ్రామాలలో గ్రామసచివాలయ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. వాటిని వెంటనే పూర్తిచేయించాలని ఎంపీటీసీలు కోరారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండలపరిషత్ సర్వసభ్యసమావేశం ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మాట్లాడూతూ ఉలిచి, సర్వేరెడ్డిపాలెం గ్రామాలలో గ్రామసచివాలయాలు సగం పనులతో నిలిచి పోయాయి. అధికారులు తక్షణమే పూర్తిచేయించాలని కోరారు. అదే విధంగా సర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేవరంపాడు గ్రామపరిధిలో జగనన్నకాలనీ స్థలాలు వాగులో ఇవ్వటానికి స్థలం కేటాయించారని, ఇప్పుడు వాటిని పేదలకు ఇచ్చి రిజిస్ట్రేషన్‌లు చేస్తామంటున్నాని ఆరోపించారు. వాగులో ఇచ్చే ఆ స్థలాలను తక్షణమే రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాపా శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ ఎం. వెంకటరమణమ్మ, ఏవో కిషోర్ బాబు, మత్స్యశాఖ ఎఫ్‌డీవో ఆషా, పీఆర్ఏఈ శేషగిరిరావు , ఎంపీటీసీలు గుండపనేని శ్రీనివాసరావు, అయ్యల వాణి, దానం ఉషారాణి, ముప్పవరపు గీత, సర్పంచ్‌లు దేవరపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

● సీపీఎం, రైతు సంఘ నాయకుల ధర్నా

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 12 : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈకార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు జుజ్జూరి జయంత్‌బాబు మాట్లాడుతూ డిసెంబరు 3,4 తేదీలలో అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అయితే ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, బీమాను ఇప్పించాలని కోరారు. అనంతరం డీటీ విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మారెళ్ల వెంకట్రావు, జి. బసవపున్నయ్య, టి .శ్రీకాంత్ ,కొప్పర్తి శ్రీను, దాసరి ఆంజనేయులు, పి యోనా, బాబు ,సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్

ఒంగోలులో ఘనంగా జయహో బీసీ

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 12 : తెలుగు దేశం పార్టీతోనే బీసీల సంక్షేమం సాధ్యపడుతుందని, బడుగు, బలహీన వర్గాల కోసమే తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ తెలిపారు. సోమవారం ఒంగోలోని పీఏజీ కన్వెన్షన్ హాలులో జరిగిన టీడీపీ జయహో బీసీ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి అండగా ఉన్న బీసీలకు టీడీపీ భరోసాగా ఉంటుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అన్న క్యాంటీన్‌లు, రంజాన్‌తోఫా, సంక్రాంతి కానుక, ఆదరణ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించిందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ళుగా రాష్ట్రంలో సైకో పాలన సాగుతుందని, దానిని శాశ్వతంగా ఇంటికి సాగనంపాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పి తెలుగుదేశం పార్టీని గెలిపించి అభివృద్ధి సాధించుకోవాలన్నారు. మళ్ళీ బీసీలలో సంతోషం రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధిని ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. జగన్ వచ్చాక కక్ష సాధింపులు అధికం అయ్యాయని అన్నారు. ఉద్దేశ పూర్వకంగా పథకాలు తొలగించడం, కేసులు పెట్టడం, ఇబ్బందులుప పెడుతున్న వైసీపీని ఓడించాలన్నారు. బీసీలకు మంచి రోజులు త్వరలోనే రాబోతున్నాయని అన్నారు. ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి తెలుగుదేశం పార్టీ హాయాంలోనే జరిగిందన్నారు. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం గడిచిన నాలుగేళ్ళలో కుంటుపడిందన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అలాగే రుణాలు అందించి ఆదుకుంటామన్నారు.


జయహో బీసీ సభలో అభివాదం చేస్తున్న టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు

సైకో పాలనకు తగిన గుణపాఠం చెప్పడానికి బీసీలందరు ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, వైవీ.సుబ్బారావు, పెళ్ళూరు చిన వెంకటేశ్వర్లు, ఇనగంటి సుబ్రమణ్యంతోపాటు రాచగర్ల వెంకట్రావు, టి. అనంతమ్మ పలుటీడీపీ అనుబంధ బీసీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

కడలి పుత్రుల కడుపు కొట్టిన వైసీపీ ప్రభుత్వం

కడలూరు బోట్లు నియంత్రణలో వైఫల్యం చెందిందని ఎమ్మెల్యే స్వామి ధ్వజం

సింగరాయకొండ, ఫిబ్రవరి 12 : రాష్ట్రంలో మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక పార్టీ తెలుగుదేశమేనని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కడలిపుత్రుల కడుపు కొట్టారని విమర్శించారు. మండలంలోని పాకల పంచాయతీ పరిధి చెల్లెమ్మగారి పట్టపుపాలెంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో స్వామి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులు వేటకు వెళ్లిగాని, ప్రమాదవశాత్తు గాని మరణిస్తే రూ.5లక్షలు చంద్రన్న బీమా అందజేశామన్నారు. వైసీపీ వచ్చాక అ పథకానికి మంగళం పాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో చేపల వేట నిషేధ సమయంలో రూ.4 వేల భృతిని అందజేసి మత్స్యకారులకు భరోసా కల్పించారన్నారు. అలాగే 50 ఏళ్లకే పింఛన్ అందచేశామని గుర్తు చేశారు. గ్రామంలో ఉన్న మట్టి రోడ్లన్నింటినీ సీసీ రోడ్లుగా మార్చామన్నారు. వైసీపీ ప్రభుత్వం జీవో నెం.30ను తీసుకొచ్చి మత్స్యకారులకు వచ్చే సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారని స్వామి దుయ్యబట్టారు. చెన్నైకు చెందిన కడలూరు బోట్లు ఇక్కడ మత్స్య సంపదను అక్రమంగా కొల్లగొట్టుకు పోతుంటే వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గ సమస్యలపై అవగాహన ఉన్న స్థానికుడైన తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. తొలుత గ్రామంలోని యువత, మహిళలు పెద్దఎత్తున ఎదురేగి స్వాగతం పలికారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, నేతలు చీమకుర్తి కృష్ణ, సంధానిబాషా, కూనపురెడ్డి సుబ్బారావు, చంటి, బత్తుల రాజగోపాల్‌రెడ్డి, వేల్పుల వెంకట్రావు, మించల బ్రహ్మయ్య గుదే వెంకటేశ్వర్లు, సనాఉల్లా, జమ్ము శంకర్, వాయిల కొండలు, తిరుపతి, కృష్ణ, జాలయ్య శ్రీను, గ్రామ కాపులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే స్వామి


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టీడీపీలో 10 కుటుంబాలు చేరిక

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీ తీర్థం

సింగరాయకొండ, ఫిబ్రవరి 12 : మండలంలోని పాకల పంచాయతీ పరిధిలోని చెల్లమ్మగారి పట్టపుపాలెంలో వైసీపీ చెందిన 10 కుటుంబాల వారు ఆ పార్టీని వీడారు. ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కఠారి రాంబాబు, బాలరాజు, నాగరాజు, కోడూరి పోలురాజు, వాయిల కృష్ణ, కాటంగారి జాలయ్య తదితరులు ఉన్నారు.

ఏకేయూ ఫలితాల్లో శ్రీ సరస్వతి అగ్రస్థానం

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 12 : స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ సరస్వతి డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచినట్లు కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. బీజీఏ గ్రూపులో దేవూరి చంద్రమాధవ 7.77 పాయింట్లతో యూనివర్శిటీ మొదటి స్థానంలో నిలిచారు. టి. ప్రమోద 7.42 పాయింట్లు, షేక్ నాయబ్ రసూల్ 6.15 పాయింట్లు సాధించారు. బీసీఏ గ్రూపులో శెట్టిపల్లి సాయిశృతి 8.25 పాయింట్లు, ఎస్ రుషిత 7.78 పాయింట్లు, టి. సౌమ్య 7.77 పాయింట్లు సాధించగా ఎస్సీ హానర్స్‌లో కే దేవకనందన్ 8.72 పాయింట్లు, ఎన్. సౌజన్య 7.71 పాయింట్లు, కే నవ్యశ్రీ 7.42 పాయింట్లు, బీకాం ఆనర్స్‌లో పి. నవ్య 7.58 పాయింట్లు, అఖిల 7.08 పాయింట్లు, ఎస్ ఇందు 7.03 పాయింట్లు సాధించారు. అత్యధిక ఉత్తీర్ణత, మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్లు ఎ. గణేష్‌రెడ్డి, ఎ. గంగా శంకర్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ సురేష్, ప్రిన్సిపాల్ కే శ్రీనివాసరావులు అభినందించారు.

బీజేపీలో పలువురు వ్యాపారుల చేరిక

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : జిల్లాకు చెందిన వివిధ రంగాల్లోని వ్యాపారులు భారతీయ జనతా పార్టీలో చేరారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త కావూరి వాసు వ్యాపార రంగంలో మంచి గుర్తింపు పొందారు. బీజేపీలో చేరికతో ఆ పార్టీలో నూతన ఉత్సాహం నెలకొంది. పశ్చిమ ప్రాంతానికి చెందిన ప్రముఖ వ్యాపార వేత్త ఏలూరి రామచంద్రారెడ్డితో పాటు ఒంగోలుకు చెందిన న్యాయవాది బత్తిన సుబ్బారావు, గిద్దలూరుకు చెందిన ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, షఫీలు పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు మాట్లాడుతూ బీజేపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ పట్ల ఆకర్షితులయ్యే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌తోపాటు పలువురు ఆ పార్టీ నాయకులు ఉన్నారు.


కావూరి వాసుకు కండువ వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పురందేశ్వరి

క్యూరింగ్ కట్టెకు డిమాండ్

● టన్ను 4500కు పెరుగుదల

● పది రోజుల క్రితం వరకు టన్ను 3500

కొండపి, ఫిబ్రవరి12 : పొగాకు క్యూరింగ్ కర్రకు డిమాండ్ ఏర్పడింది. దాని ధర ఒక్కసారిగా టన్నుకు వెయ్యి రూపాయలు పెరిగింది. దీంతో పొగాకు రైతులు పెట్టుబడి వ్యయం పెరిగి అల్లాడిపోతున్నారు. గత ఏడాదే పొగాకు వేసే రైతులు బ్యారన్‌కు 20 టన్నుల వరకు క్యూరింగ్ కోసం కర్రను ముందుగానే తోలి పెట్టుకున్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాలలో క్యూరింగ్ జోరుగా సాగుతోంది. పది రోజుల క్రితం వరకు టన్ను క్యూరింగ్ కర్ర దాదాపు రూ.3500 వరకు పలికింది. ఇది కూడా అధిక ధరేనని రైతులు చెబుతున్నారు. అకస్మాత్తుగా కర్రకు డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం టన్ను 4500 రూపాయలకు పెరిగింది. టన్నుకు వెయ్యి రూపాయలు అమాంతంగా పెరగడంతో రైతులు అల్లాడుతున్నారు.


బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్‌కు వాడుతున్న కట్టె, మొద్దులు

హత్య కేసులో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి12:హత్య కేసులో నిందితుడు గౌడపేరు రాజేష్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఎనిమిదవ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మనరాజు సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం కోవూరుకు చెందిన గౌడపేరు పవిత్ర భర్తతో వచ్చిన విభేదాల కారణంగా పుట్టింటిలో ఉంటోంది. 2021 ఫిబ్రవరి 22 సాయంత్రం ఇంటి పక్కనే నివాసం ఉండే గౌడపేరు రాజేష్ ,పవిత్ర ఇంటికి వచ్చి తన కామవాంఛ తీర్చమని వేధించి అమెపై దాడికి దిగాడు. ఈమేరకుపవిత్ర తండ్రి పాలేటి చిన్న ఏసు ,తల్లి మరియమ్మలు అడ్డువచ్చారు. ఆ సమయంలో రోకలి బండతో చిన్నఏసు తలపై రాజేష్ కొట్టాడు. తీవ్రంగా గాయపడిన చిన్న ఏసు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతుని కుమార్తె పవిత్ర ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎం.వి జయకుమార్ చార్జీషీట్ ధాఖలు చేశారు.కేసు విచారణ చేపట్టిన ఎనిమిదమ అదనపు జిల్లా జడ్జి అమ్మన రాజు నిందితుడు రాజేష్ పై నేరనిరుపణ కావడంతో యావజీవ కారాగారశిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చారు.ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ చావలి రమేష్ బాబు వాదనలు వినిపించారు.

16న సూర్యవందనం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : జిల్లా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో ఈనెల 16వతేదీన స్థానిక పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ప్రణవ సంకల్ప యోగా సమితి సహకారంతో మహా సూర్యవందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన మూడువేల మంది విద్యార్థులతో 108 పర్యాయాలు సూర్య నమస్కారాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూర్య నమస్కారాల ఆవశ్యకతను సమాజానికి తెలియజేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఆర్. శ్రీలత, స్టెప్ సీఈవో లోకేశ్వరరావు, డిప్యూటీ డీఈవో అనిత రోజ్‌రాణి, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ ఉన్నారు.

టంగుటూరు తహసీల్దార్‌గా కుటుంబరావు

టంగుటూరు, ఫిబ్రవరి 12 : టంగుటూరు నూతన తహసీల్దార్‌గా వీవీ కుటుంబరావును నియమించారు. ఆయన శనివారం టంగుటూరులో తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు. రానున్న ఎన్నికల సందర్భంగా జరుగుతున్న సాధారణ బదిలీల్లో టంగుటూరు తహసీల్దార్ సంజీవరావును నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తహసీల్దార్ కుటుంబరావును ఇక్కడ నియమించారు. అయితే విధుల్లో చేరిన తహసీల్దార్ కుటుంబరావు తండ్రి వయోభారంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలియగానే తహసీల్దార్ హడావుడిగా సెలవు పెట్టి వెళ్లారు.

ఏపీఎంగా రవికుమార్

టంగుటూరు మండల వైకేపీ ఏపీఎం హనుమంతురావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాటుకూరి రవికుమార్‌ను నియమించారు.

అప్రంటీస్ విధానమంటే రివర్స్ పాలనే

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 12 : డీఎస్సీ 2024లో తిరిగి అప్రంటిస్ షిప్ విధానాన్ని ప్రవేశపెట్టడం రివర్స్ పాలనకిందకే వస్తుందని ఎస్‌టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.రఘునాథరెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితంగా రద్దు అయిన అప్రంటిస్ షిప్ విధానాన్ని మళ్ళీ ప్రవేశపెట్టడం దారుణంగా ఉందని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఎస్‌టీయూ కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే ఎర్రయ్య, ప్రధాన కార్యదర్శిగా జి. నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా డి. నాగయ్య అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్. కోటేశ్వరరావు, వేమా శేషు, డి.తిరుపతిరెడ్డి, వై.రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా మరో తొమ్మిది మంది, అదనపు కార్యదర్శులుగా ఐదుగురు, సహాయ కార్యదర్శులుగా 9 మంది, ఆర్థిక కమిటీ, రాష్ట్ర కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.

అవీ..ఇవీ..

ఘనంగా జబరజంగి టైటిల్ విడుదల

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 12:సుహారి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తొలి సారిగా నిర్మించిన చిత్రం జబరజంగి టైటిల్ లాంచింగ్ ఘనంగా జరిగింది. స్థానిక సంస్థ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సినీ నటుడు అజయ్ ఘోష్ టైటిల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రతిష్టాత్మక లఘుచిత్రాలు నిర్మించిన సుహారి సంస్థ ఒక ఇండిపెండెంట్ చిత్రాన్ని నిర్మించటం అభినందనీయమని అన్నారు. నిర్మాత నున్న హరిప్రియ మాట్లాడుతూ నాయుడు పెన్నింటి దర్శకత్వం వహించగా, సాయిరాం కృష్ణ రచయితగా, సురేష్ సాధనాల, శ్రీనివాస రావు దాసరి, బొడ్డు సురేష్, సలీం బాష, ఫరూక్ రాజేష్, చిన్న తదితరులు నటించిన ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదల అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో కో డైరెక్టర్ బండారుపల్లి రవితేజ, శ్రీనివాస్, వెంకటేష్, రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.


టైటిల్ లాంఛ్ చేస్తున్న సినీనటుడు అజయ్‌ఘోష్

దక్షిణ కొరియా వర్శిటీతో క్విస్ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న విద్యాసంస్థల అధినేతలు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 12 : ప్రపంచ విద్యా ప్రమాణాల సహకార ఆవిష్కరణల నిబద్ధతను నొక్కి చెప్పే ఒక మైలురాయికి క్విస్ విద్యా సంస్థలు చేరాయి. దక్షిణ కొరియాలోని డేజీయోన్‌లోని వూసాంగ్ విశ్వవిద్యాలయంతో క్విస్ విద్యా సంస్థలు అధికారికంగా అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. దక్షిణ కొరియాలోని టాప్ ఫైవ్ ప్రైవేటు యూనివర్శిటీలలో ఒకటైన వూసాంగ్ యూనివర్శిటీ గ్లోబల్ ఔట్రిచ్ డెవలప్‌మెంట్ ప్రయత్నంలో గణనీయమైన పురోగతిని సూచిస్తోంది. ఈ సందర్భంగా క్విస్ విద్యాసంస్థల అధినేత, వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ఈ ఒప్పందం క్విస్ విద్యా ప్రమాణంలో ఒక పెద్ద మైలు రాయిగా అభివర్ణించారు. ఈ ఒప్పందం ఉత్తేజకరమైన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. దీని వల్ల విద్యార్థులు, అధ్యాపకులు భవిష్యత్ ఆశాజనకంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు.

విద్యుత్‌శాఖ స్పెషల్ పీపీగా నరసింహారెడ్డి



ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 :విద్యుత్ శాఖ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీవీ నరసింహారెడ్డిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరి హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలులోని ఆడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో విద్యుత్‌శాఖకు సంబంధించిన కేసులను వాదించనున్నారు. నరసింహారెడ్డి నియామకం పట్ల పలువురు న్యాయవాదులు అభినందించారు.

ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందనలు


ప్రతిభకనబరిచిన విద్యార్థులకు అందించిన ప్రశంసాపత్రాలతో ఉపాధ్యాయులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 12: ఒంగోలు పీవీఆర్ హైస్కూల్లో జరిగిన బాలోత్సవాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను త్రోవగుంట హైస్కూల్ హెచ్ఎం చల్లా బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. త్రోవగుంట హైస్కూల్లో సోమవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటస్వామి జీవితం ఆదర్శప్రాయం

మద్దిపాడు, ఫిబ్రవరి 12 : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వంకాయలపాటి శ్రీనివాసరావు తండ్రి వెంకటస్వామి జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని రాజ్యసభ మాజీ సభ్యుడు, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు పేర్కొన్నారు. వెంకటస్వామి దశదిన కర్మ సందర్భంగా సోమవారం కెల్లంపల్లిలో జరిగిన సంతాప సభలో ఆ పార్టీ నేతలు వై వెంకటేశ్వరరావు, పీ సుదర్శన్, టీ సాగర్, సీపీఐ ఎంఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, జిల్లా అధికార ప్రతినిధి రేగుల వీరనారాయణ, ప్రజాశక్తి సంపాదకులు వీ తులసీదాస్, సీపీఎం నాయకులు వై సిద్ధయ్య, సయ్యద్ హనీఫ్, కే సుబ్బరావమ్మ, పీ రోజా, ఎం రమేష్, జీవీ కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు


వెంకటస్వామి సంతాప సభలో పాల్గొన్న సీపీఎం అగ్రనేతలు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ డీఆర్‌పీలు

టంగుటూరు, ఫిబ్రవరి 12 : మండలంలో గత ఏడాది కాలంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. సామాజిక తనిఖీ బృందం అధికారులు సోమవారమే స్థానిక ఉపాధి హామీ కార్యాలయానికి చేరుకున్నారు. వీరికి గ్రామాల వారీగా జరిగిన పనుల తాలూకా రికార్డులను ఆయా గ్రామాల ఫీల్డ్ అసిసెంట్లు అప్పగిస్తున్నారు. మంగళవారం కూడా రికార్డుల పరిశీలనకు మరికొందరు రావచ్చని భావిస్తున్నారు. డీఆర్‌పీలకు రికార్డుల ప్రక్రియ ముగియగానే బుధ, గురువారాల్లో వారంతా గ్రామాలకు చేరుకొని ఫీల్డ్ అసిస్టెంట్ల సాయంతో నేరుగా జరిగిన పనుల వద్దకు వెళ్లి పరిశీలిస్తారు. ప్రధానంగా రికార్డుల ఆధారంగా జరిగిన పనుల కొలతలు మరొకసారి వేస్తారు. అలాగే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సర్వశిక్షా అభియాన్ ద్వారా జరిగిన మెటీరియల్ పనుల్లో నాణ్యత, కొలతలు వీరు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ ముగియగానే ఓపెన్ ఫారమ్ జరుగుతోంది.

బీజేపీ ప్రచార పత్రాలు పంపిణీ

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్),ఫిబ్రవరి 12 :ఉప్పుగుండూరులో బీజేపీ ప్రచార పత్రాలను సోమవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆపార్టీ రాష్ట్ర దళితమోర్చ కన్వీనర్ దారా సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో గృహనిర్మాణాలకు పూర్తిస్థాయిలో కేంద్రం నిధులు కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంట్యాల వెంకటసుబ్బారావు, శిష్టపాండు రంగారావు, వాసు, సాల్మన్‌రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్‌గా దానియేలు


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న సిబ్బంది

ఒంగోలు(రూరల్) ఫిబ్రవరి12: ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్‌గా ఎం. దానియేలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన్ను ఒంగోలు తహసీల్దార్ సుజన్‌కుమార్, డీటీ ఫిరోజ్, ఆర్ఐ చిరంజీవి, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.


రామనగర్‌లో జనచైతన్యయాత్రలో జనసేన నేతలు

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన పార్టీ నాయకులు ఆరోపించారు. జన చైతన్యయాత్రలో భాగంగా సోమవారం స్థానిక రామనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలను అడిగి సమస్యలను తెసుకున్నారు. ఈ సందర్భంగా జన సేన పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా మహిళలకు రక్షణ కరువైం దన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకు వచ్చే ఎన్నికల్లో జనసేనపార్టీ సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వా లని కోరారు. 15వ డివిజన్ అధ్యక్షుడు మర్రిపూడి ఉదయ్, ఉంగరాల సాయి ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముత్యాల కల్యాణ్, పల్ల ప్రమీల, ఆకుపాటి ఉష, గోవింద్ కోమలి, ఉంగరాల వాసు, కోటసుధీర్, నరేష్, తదితరులు ఉన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ధర్మకర్తల మండలి

16న రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 12: ఈ నెల 16వ తేదీన రథసప్తమిని అంగరంగ వైభవంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక కేశవస్వామి పేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థాన ఛైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వహణాధికారి డి.రజనికుమారిలు తెలిపారు. ఇందుకు సంబంధించిన కర పత్రాన్ని వారు ఇతర పాలకమండలి సభ్యులతో కలిసి సోమవారం దేవస్థాన ప్రాంగణ కల్యాణమండపంలో ఆవిష్కరించారు. దాదాపు 70 సంవత్సరాల తర్వాత ఒంగోలులో రథోత్సవం నిర్వహిస్తున్నందున భక్తులు రథసప్తమి కార్యక్రమాలు, సప్తవాహన నగరోత్సవంలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. కరపత్ర ఆవిష్క రణలో ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన రెడ్డి, కరేటి కిరణ్ బాబు, ఈమని మదన్ మోహన్, సూపర్ బజార్ డైరక్టర్ వల్లెపు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి12: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షాఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య మారెడ్డి అంజిరెడ్డి విడుదల చేశారు. విశ్వవిద్యాలయం పరిధిలోని మొత్తం 88డిగ్రీ కళాశా లలో 8,124 మంది విద్యార్థులు మొద టిసెమిస్టర్ పరీక్షలు రాసేందుకు పేర్లు నమోదు చేసుకోగా వీరిలో 7,201 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో కేవలం 3,309 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులు అయ్యారు. కేవలం 46 శాతం మంది మాత్రమే ఈపరీక్షలలో పాసయ్యారు. విశ్వవిద్యాలయం స్థాయిలో అధిక ఉత్తీర్ణత ,ర్యాంకల సాధనలో బాలి కలు పైచేయి సాధించారు. ఈపరీ క్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులు రీ వ్యాల్యూషన్‌కోసం ఈనెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని అంజిరెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో రిజి స్ట్రార్ బి.హరిబాబు, అధ్యాపక, అధ్యా పకేతరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

జరుగుమల్లి (కొండపి), ఫిబ్రవరి 12 : మండలంలోని దావగూడూరు గ్రామంలో కంచర్ల శ్రీను, నరసింహంలకు చెందిన ఉమ్మడి బ్యారన్ ప్రమాదవ శాత్తు సోమవారం రాత్రి దగ్ధమైంది. క్యూరింగ్‌లో ఉండగా ప్రమాదవశాత్తు బ్యార న్‌లో కర్ర జారి గొట్టంపై పడటంతో అగ్నిప్రమాదం సంభవించినట్లు భావిస్తు న్నారు. దాదాపు 5 లక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు తెలి పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వామి అగ్నిమాపక వాహనానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వాహనంతో ప్రమాద స్థలికి వచ్చే సరికే పూర్తిగా బ్యారన్‌లోని పొగాకు, సామాను దగ్ధమ య్యాయి.

చీమకుర్తి తహసీల్దార్‌గా సురేష్‌కుమార్

చీమకుర్తి,ఫిబ్రవరి12 : చీమకుర్తి నూతన తహసీల్దార్‌గా ఎస్.సురేష్ సోమ వారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు రెవెన్యూ ఉద్యోగులు ఘనస్వాగతం పలి కారు.బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్పందనలో వినతిపత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడుతున్న ఉప్పుగుండూరు నేతలు

నిధులు గోల్‌మాల్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- స్పందనలో గ్రామస్థుల ఫిర్యాదు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 12: నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామపంచాయతీలో నిధులు గోల్‌మాల్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని స్పందనలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సోమవారం ఉప్పుగుండూరు గ్రామ స్థులు, వార్డు సభ్యులు వినతిపత్రం అందజేశారు. నిధులు గోల్‌మాల్‌తో ప్రజలు పన్నులుకూడా కట్టడంలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అర్జీపై స్పందించిన కలెక్టర్ డీపీవో మాట్లాడారు. నాలుగు రోజుల్లో ఇందుకు సంబంధించిన ఫైల్‌ను తన టేబు ల్‌పై ఉంచాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు కనగాల శ్రీనివాసరావు, బెల్లం రంజిత్, గ్రామనాయకులు తెలగతోటి జాన్‌సన్, పొట్లూరి నాగమల్లేశ్వరరావు, జంజనం వెంకటసుబ్బయ్య జనసేన నాయకులు పెంట్యాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణకు నగర కమిషనరు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 12 : ఒంగోలు నగర కమిషనరు ఎం. జశ్వం త్‌రావు ఎన్నికల శిక్షణకు హాజరయ్యారు. ఈనెల 12వతేదీ నుంచి 16వ తేదీ వరకు విజయవాడలో జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్లు పాల్గొం టున్న నేపథ్యంలో జశ్వంత్‌రావు హాజరయ్యారు. దీంతో ఐదురోజులపాటు ఆయన శిక్షణలో ఉంటుండగా, ఇన్‌చార్జి కమిషనరుగా మునిసిపల్ ఇంజనీర్ జానీబాషాకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రజలను పదేపదే తిప్పుకోవద్దు

- స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం


స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : ఒకే సమస్యపై ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకో కుండా ఆయా అర్జీలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలె క్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డయల్ యువర్ కలెక్టర్ అనంతరం జరిగిన స్పందన కార్యక్ర మంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమ స్యలపై కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 250 అర్జీలు వచ్చాయన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక దృష్టితో పరిష్క రించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమ స్యలను ఉన్నత స్థాయి అధికారులకు పంపాలన్నారు. అర్జీలను పరిష్కరిం చడంలో ఉన్నత ప్రమాణాలను పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలపై అధికారుల వద్దకు వెళ్తే కచ్చితంగా పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఎస్డీసీలు లోకేశ్వరరావు, వరకు మార్, ఝాన్సీ లక్ష్మీ, మాధూరి పాల్గొన్నారు.

- చేయూత పథకానికి వలంటీర్, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసి స్టెంట్ నిర్ధిష్ట సమయంలో తన దరఖాస్తును నమోదు చేయలేదని సింగరా యకొండ మండలం సోమరాజుపల్లికి చెందిన బి.నాగేంద్రమ్మ ఫిర్యాదు చే శారు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌ను విన్నవించారు.
- పూర్వీకుల నుంచి సంక్రమించి స్థలాన్ని ఆక్రమించుకొని బెదిరిస్తున్నా రని కంభంకు చెందిన రహంతుల్లా ఫిర్యాదు చేశారు. అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నుంచి తనకు న్యాయం జరగకపోవడంతో ఆక్రమదారుల నుంచి రోజురోజుకు బెదిరింపులు ఎక్కువయ్యాయని, వారి బారి నుంచి తనను రక్షించాలని కలె క్టర్‌ను వేడుకున్నారు.
- జగనన్న ఇళ్లస్థలాల పంపిణీలో తనకు దూరంగా ఇవ్వడంతో ఇబ్బం దులు పడుతున్నానని, అందువల్ల తనకు దగ్గరలో ఇచ్చి ఆదుకోవాలని బీపేట మండలం పాపాయపల్లికి చెందిన వెంకటస్వామి కోరారు. తాను దివ్యాంగుడిని కావడంతో స్థలం దూరంగా ఇవ్వడంతో ఇబ్బందిపడాల్సి వస్తుందని, అనుకూలమైన ప్రాంతంలో స్థలం ఇప్పించాలని విన్నవించారు. ఇలా పలుప్రాంతాలకు చెందిన ప్రజానీకం సమస్యలను కలెక్టర్‌కు విన్నవిం చారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. నోటిఫికేషన్‌కు ముందు, తర్వాత చేపట్టాల్సిన విధుల నిర్వహణపై పూర్తి అవగా హన పెంచుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలు నుంచి సోమవారం డివిజనల్, మండలస్థాయి అధికారులు, మునిసిపల్ కమిష నర్లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని కల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతిఒ క్కరు తమకు అప్పగించిన బాధ్యతలను సక్ర మంగా నిర్వర్తించాలన్నారు. అందుకోసం అవస రమైన సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. గత నెల 22న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా సరిగా ఉందో లేదో ఒకసారి సరిచేసుకోవాల న్నారు.

ఆర్వో పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబం ధించిన అధికారులకు అవసరమైన శిక్షణను ఇవ్వాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దర ఖాస్తులను రెండు, మూడు రోజుల్లో డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకో వాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలు జరుగుతున్న గృహనిర్మాణాల లక్ష్యాలను అధిగ మించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో చేపట్టిన ఇళ్లస్థలాల రిజి స్ట్రేషన్లు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 22వేల మంది ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశామ న్నారు. మిగిలిన పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిపె ట్టాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో శ్రీలత, అధి కారులు జాలిరెడ్డి, పేరయ్య, వసుంధర పాల్గొ న్నారు.

ఎస్పీ గర్గ్‌కు ఘన వీడ్కోలు


ఎస్పీని ఎత్తుకొని తమ అభిమానాన్ని చాటుకుంటున్న మహిళా కానిస్టేబుళ్లు


ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉన్న ఎస్పీపై పూలజల్లు కురిపిస్తున్న సహచర సిబ్బంది

జంకెకు ఏపీఐఐసీ చైర్మన్ పదవి

అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నం



(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

అసంతృప్తితో రగలిపోతున్న మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి హడావుడిగా రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి అప్ప జెప్పారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా జంకెను నియమించారు. ఆ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగుతారు. మార్కాపు రంలో 2014లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు 2019లో ఆయ నకు టికెట్‌ను నిరాకరించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీని గత ఐదేళ్లుగా నిలుపుకోలేదు. సుమారు ఏడాది క్రితం ఆయ నకు ఒంగోలు లోక్‌సభ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఆయనకు మార్కాపురం టికెట్ ఇస్తామని ఆశచూపి చివర్లో ఇవ్వలేదు. దీంతో అసంతృప్తికి గురైన జంకె ఆదివారం జరిగిన మార్కాపురం, కొత్త ఇన్‌చార్జి ఎమ్మెల్యే రాంబాబు పరిచయ కార్యక్రమానికి కూడా గైర్హాజర య్యారు. వేరే పార్టీ వైపు దృష్టిసారిం చారన్న అనుమానాలు కూడా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం సీఎంను కలిసిన బాలినేని కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఆయనకు హడావుడిగా ఏపీఐఐసీ కార్పొరే షన్ చైర్మన్‌ను కట్టబెట్టారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీ అధికారంలోకి రాక పోతే ఈ పదవి మూన్నాళ్ల ముచ్చటే కానుంది. హడావుడి నియామకం నియోజకవర్గంలోని జంకె అనుచరులు పెదవి విరుస్తున్నారు.

అవినీతి పాలకులను గద్దె దించేందుకు సిద్ధం

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో బాలాజీ, డాక్టర్ ఉగ్ర


టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ, ఉగ్ర

పీసీపల్లి, ఫిబ్రవరి 12 : అవినీతి, అరాచక వైసీపీ పాలకులను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నా రని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర అన్నారు. సోమ వారం పీసీపల్లి టీడీపీ కా ర్యా లయంలో మండల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలాజీ మాట్లాడుతూ రా ష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే దూరదృష్టి ఉన్న నా యకుడు చంద్రబాబు అయితే, రాష్ట్ర ప్రగతి వినాశ కారి జగన్‌రెడ్డి అన్నారు. అధికారం లేక పోయినా స్థానికుడిగా నియోజకవర్గ అభివృద్ధి కోసం 10 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్ర మాలతో ప్రజలకు చేరువైన నాయకుడు డాక్టర్ ఉగ్ర అన్నారు. ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఓటర్లను కలిసి చంద్రబాబు సూపర్ సిక్స్ పథ కాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన ఉగ్ర నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు.మరో రెండు నెలల్లో జరిగే ఎన్ని కల్లో కనిగిరిలో ఉగ్ర భారీ మెజారిటీతో గెలు పొందుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవంతులు కట్టి ప్రజ లు సుఖవంతమైన జీవితం అనుభవిస్తున్నారంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 20202 విజన్‌తో తీసుకువచ్చిన సాఫ్ట్‌వేర్ రంగమే కార ణమని బాలాజీ గుర్తు చేశారు.

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి, ప్రజలకు జరిగిన అన్యాయం, జగన్‌రెడ్డి అవినీతి, అరాచక, దౌర్జన్య పాలనపై నిల దీసిన చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారన్నారు. అభివృద్ధి చేసేవారినే ప్రజలు ఆదరించి గెలిపించాలన్నారు. ప్రతిఒ క్కరూ ఓటరు జాబితాలో తమ ఓటు ఉందా లేదా చూసుకోవాలన్నారు. 60 రోజులు ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేసి రాక్షస వైసీపీని తరిమికొట్టాలని ఉగ్ర పిలుపునిచ్చారు. అనం తరం తలకొండపాడు పం చాయతీలోని చిరు కూరివారిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠకు ఉగ్ర, పార్టీ శ్రేణులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షు డు గడ్డం బాలసుబ్బయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎన్.బ్రహ్మయ్య, బీసీసెల్ కార్య దర్శి కోమటిగుంట్ల వీరయ్య, మండలపార్టీ అధ్య క్షుడు వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, కొప్పల్లి సురేష్, టీడీపీ మండల బీసీసెల్ సీని యర్ నాయకుడు చెన్నుబోయిన మాలకొండ య్యయాదవ్, టీడీపీ సర్పంచ్‌లు వెంగళాయ పల్లి కరణం తిరుపతయ్య, నేరేడుపల్లి సర్పంచ్ పల్లా మల్లికార్జున్, గుదేవారిపాలెం సర్పంచ్ కనపర్తి శాంసన్, తలకొండపాడు సర్పంచ్ ముప్పూరి తిరుపతమ్మలు, టీడీపీ నాయకులు కరణం శ్రీను, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, హనుమా రెడ్డి, ఉప్పుగుండ్ల శివరామయ్య, బోయపాటి సుబ్బారావు, వడ్డెంపూడి వెంకట్ ,ఎనుగంటి శ్రీను, ఏనుగంటి వెంకయ్యపువ్వాడి నాగరాజు, తెలుగుయువత అధ్యక్షుడు ఎనుగంటి నాగేంద్ర బాబు, చాగంరెడ్డి మాలకొండారెడ్డి(మాజీ),చా గంరెడ్డి మాలకొండారెడ్డి(బంగా రు), దేవరపు కొండపనాయుడు, బద్దిపూడి ఎబినేజరు, ముప్పూరి మాల్యాద్రి, భట్టుపల్లి సర్పంచ్ డ బ్బుగొట్టు రవీంద్ర, కొల్లా శ్రీరాములు, పరిమి మాలకొండయ్య, గుంటగాని జోసెఫ్, మూలె బుజ్జిరెడ్డి, నా గోతు శ్రీను, మూలె సత్తిరెడ్డి, మూలె మహేంద్రరెడ్డి, ఉండేల పిచ్చిరెడ్డి, ఉండేల మ్లలకార్జునరెడ్డి, వడ్డెంపూడి వెంకటసు బ్బయ్య, నెలకుర్తి మాల్యాద్రి, నెలకుర్తి అంకయ్య, గోనుగుంట్ల పేరయ్య, గోనుగుంట్ల చెన్న య్య, చిరుకూరి మాలకొండయ్య, నెలకుర్తి మాలకొండయ్య, కరణం గంగయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు డీజే ట్రస్ట్ వితరణ

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 12 : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ (డీజే ట్రస్ట్) ఆధ్వర్యంలో చిరువ్యాపారులకు వేసవి తాపం నుంచి తట్టుకునే గొడుగులు పంపిణీ చేశారు. సోమవారం నగరంలో సుమారు 200 మందికి దామచర్ల కుటుంబ సభ్యులు అందించారు. అదేవిధంగా చిరు వ్యాపా రుల జీవనోపాధికి అండగా డీజేఆర్ ట్రస్ట్ నిలుస్తుందన్నారు. అదేవిధంగా స్థానిక 29వ డివిజన్ కొణిజేడు బస్టాండ్ వద్ద దామచర్ల సతీమణి నాగసత్య లత నారీ కోసం నాగసత్యలత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇద్దరు పాపల దత్తత

ఓ పాపను దత్త తీసుకున్న అమెరికా వాసులు

ఒంగోలు(నగరం), ఫిబ్రవరి12: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇరువురు పాపల దత్తత స్వీకారం సోమవారం జరిగింది. ఇద్దరు పాప లను కలెక్టర్ దినేష్‌కుమార్ దత్తత తీసుకున్న దంపతులకు అందజే శారు. అమెరికాకు చెందిన షైఖేల్‌లల్లి ,అంబర్‌లల్లి అనేదంపతులు ఒకపాపను దత్త తీసుకున్నారు. దత్తత తీసుకున్న పాప కొత్తతల్లిదం డ్రులతో ఖండాంతరాలకు తరలిపోయింది. మరో పాపను కర్నాటక రాష్ట్రానికి చెందిన అశోక్ ,సుమిత్ర దంపతులు దత్తత తీసుకున్నారు.


జయహో బీసీ ర్యాలీలో వాహనంపై నుంచి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే స్వామి

బీసీల అభ్యున్నతికి టీడీపీ పెద్దపీట

- కొండపి ఎమ్మెల్యే స్వామి

జరుగుమల్లి (కొండపి), ఫిబ్రవరి 12 : టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు వెన్నుము కగా నిలిచారని, వారి అభ్యున్నతి కోసం పార్టీ పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే డోలా శ్రీబా లవీరాంజనేయస్వామి చెప్పారు. జరుగుమల్లిలో సోమవారం రాత్రి జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలో పార్టీ నాయకులు, కార్య కర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ బస్టాండ్ సెంటర్‌లో ప్రత్యేక వాహ నంపై నుంచి స్వామి మాట్లాడారు. బీసీలను రాజకీయంగా పదవులిచ్చి వారిని నాయ కులుగా తీర్చిదిద్దిన ఘనత ఎన్టీఆర్‌దేనని చెప్పారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబు బీసీల ఆర్థికాభివృద్ధికి ఆదరణ పేరుతో పనిముట్లు, ఆర్థిక సాయం, రుణ సహాయం అందించారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం పార్టీ తేనుందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీల కుడు అడకా స్వాములు, పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పార్టీ సీని యర్ నాయకులు పోటు శ్రీనివాసమురళి, సుబ్బారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ నాయ కుడు మిచ్చల బ్రహ్మయ్య, బీసీసెల్ ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు, పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు నరాల సోమయ్య, నాయకులు రమే ష‌రెడ్డి పాల్గొన్నారు.


తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎంతో బాలినేని

సీఎంను కలిసిన బాలినేని

- 21 లేదా 27న జిల్లాకు రాక
- 25వేల మందికి పేదలకు పట్టాల పంపిణీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 21 లేదా 27వతేదీన ఒంగోలుకు రానున్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాల యంలో సోమవారం సాయంత్రం మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివా సరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎంను కలిశారు. ఒంగోలులో పట్టాలు పంపిణీ చేసేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఒంగోలు సమీపంలో మూడు గ్రామాల పరిధిలో పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సేకరించిన భూముల్లో లే అవుట్లు వేసేందుకు పనులు జరుగుతున్నాయని బాలినేని వివరించారు. ఈనెల 20వతేదీ నాటికి ఆ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని చెప్ప డంతో పాటు పట్టాలు పంపిణీ చేసేందుకు ఒంగోలుకు రావాలని సీఎంను కోరారు. దీంతో ఈనెల 21లేదా 27వతేదీల్లో ఒంగోలు వస్తానని బాలినేనికి చెప్పినట్లు సమా చారం. అనంతరం ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం. ఒంగోలులోని తాగునీటి సమస్యను పరిష్కరించేం దుకు మంజూరు చేసిన నిధులను త్వరగా విడుదల చేయాలని సీఎంను కోరినట్లు తెలిసింది. బాలినేని వెంట ఆయన కుమారుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, వియ్యకుండు కే భాస్కరరెడ్డి తో పాటు పార్టీ జిల్లా ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా ఉన్నారు. అనంతరం సీఎం పేషీలో కూడా బాలినేని పలు అంశాలపై చర్చించారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 12 :కారు ఢీకొని మహిళకు త్రీవ గాయాలయ్యాయి. ఈ సంఘటన స్థానిక పాత బైపాస్‌రోడ్డులో బులెట్ షోరూం వద్ద సోమవారం జరిగింది. వివరాలలోకి వెళితే- కొండపి మండలం కట్టుబడివారిపాలెంనకు చెందిన రాయిపాటి పవన్‌కల్యాణ్ తన అత్త ధనలక్ష్మీని బులెట్‌పై ఎక్కించుకొని ఒంగోలు నుంచి కట్టుబ డివారిపాలెం వెళుతున్నారు. పాత బైపాస్ రోడ్డులో బులెట్ షోరూం వద్ద వెనుక నుంచి వచ్చిన కారు బులెట్‌ను ఢీకొట్టింది. దీంతో బులె ట్‌పై ఉన్న ఇరువురూ కింద పడిపో యారు. ధనలక్ష్మీకి తలపై తీవ్ర గాయం కావడంతో రక్తస్రావ మైంది. పవన్ కల్యాణ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన ధనలక్ష్మిని ఆసుపత్రికి తరలిం చారు. ఈమేరకు ఒంగోలు తాలుకా పోలీసులు విచారణ చేపట్టారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడుగా జావెద్ అన్వర్

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 12: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడుగా జావెద్ అన్వ ర్‌ను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరి గిన కార్యక్రమంలో జావెద్ అన్వ ర్‌కు నియామకపత్రం అందజే శారు. మైనార్టీ విభాగం అధ్యక్షు డుగా ఎంపికైన జావేద్ అన్వర్ ను పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు.

అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలు

- ప్రభుత్వ భవనాలకు వెంటాడిన నిధుల గండం
- పట్టించుకోని పాలకపక్షం
- చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు


నిరుపయోగంగా ఉన్న మహిళా శిశుసంక్షేమశాఖ భవనం

పొదిలి, ఫిబ్రవరి 9 : మండలంలో పలు ప్రభుత్వ భవనాలు నిధులగడంతో మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ఆయా అసంపూర్తి భవ నాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. గత ప్రభుత్వం హయాంలో మహిళా శిశుసంక్షేమ శాఖ భవనం, మండల సమాఖ్య భవనం నిర్మా ణం కోసం రూ.92లక్షల మంజూరు చేశారు. వీటి నిర్మాణానికి కొంత ఖర్చు కూడా చేశారు. అనంత రం వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నిధులు విడుదలలో జాప్యం జరిగింది. దీంతో ఎక్కడి భవనాలు అక్కడే నిలిచిపోయాయి.

సీడీపీవో కార్యాలయంలో అరకొర వసతులు

సీడీపీవో నూతన భవనం గత ఐదేళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. కంట్రాక్టర్ భవనాన్ని శ్లాబు వరకు నిర్మించినప్పటికి నిధులు విడుదల కాక పోవడంతో కాంట్రాక్టర్ నిర్మాణలు మధ్యలోనే వదిలేసి వెళ్లారు. అలా ఐదేళ్ల గడిచినా వాటి నిర్మాణల ఊసేలేదు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలలో కనీసం 5 నుండి 10 మీటింగ్‌లైన జరుగు తుంటాయి. వాటిని నిర్వహించుకునే వెసులు బాటు లేకపోవడంతో అసంపూర్తిగా నిలిచిన భవనం లోనే ఏర్పాటు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. పొదిలి ప్రాజెక్ట్ పరిధిలో సుమారుగా 149 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గతంలో 32 కొత్త భవనాలు నిర్మాలు ప్రారంభించారు. వాటిలో కొన్ని పూర్తయ్యాయి. మిగిలినవి పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్ట్ పరిధిలో సుమారుగా 50 నుండి 60 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలకు అవస్థలు తప్పడం లేదు.


అద్దెభవనంలో ఉన్న మండల సమాఖ్య కార్యాలయం

అద్దెభవనంలోనే కార్యకలాపాలు

మండలసమాఖ్య భవనం కొన్నేళ్లుగా ప్రైవేటు భవనంలోనే కొనసాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారుగా రూ.60లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభించారు. రెండు అంతస్తులు నిర్మించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ భవనం గురించి పట్టించుకోలేదు. దీంతో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

పట్టించుకోని అధికారులు, నాయకులు

అధికారులు, నాయకులు తమ స్వలాభాల కోసమైతే ఆఘమేఘాల మీద ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మరీ పనులు చేసుకుంటారు. కానీ రెండు ప్రధానశాఖల భవనాల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగినా సంబంధిత అధికారులు, కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోక పోవడం గమనార్హం. దీంతో ఆ భవనాలు రాత్రి వేళలో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఇప్పటికైనా మండల సమాఖ్య భవనం, సీడీపీవో భవనం నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


అర్ధంతరంగా నిలిచిన మండల మహిళా సమాఖ్య భవనం

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- 75 మందికి రూ.4.13 లక్షల జరిమానా

కంభం, ఫిబ్రవరి 12 : కంభం మండల పరిధిలో పలుచోట్ల విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అక్రమ విద్యుత్ వాడుతున్న 75 మంది పై కేసులు నమోదు చేశారు. రూ.4,13,500 జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఎస్ఈ ఆల్‌ఫాన్స్ తెలిపారు. విద్యుత్ అధికారులు 42 బృందాలు ఏర్పడి ఈ తనిఖీలు చేశారు. మీటరు ఉండి అక్రమంగా విద్యుత్ వాడుతున్న ఏడుగురికి రూ.1.65లక్షలు, మీటరు లేకుండా అక్రమ విద్యుత్ వాడుతున్న 22 మందికి రూ.82500 అపరాధ రుసుము విధించారు. లోడు తక్కువగా ఉండి ఎక్కువ లోడు వాడుతున్న 56 మందికి రూ.1.66లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. అక్రమ విద్యుత్ వాడితే నేరమని, సమాచారం 1912 నంబరుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈలు కె.వెంకటేశ్వర్లు, బీపీఈ పి.వి.నాగేశ్వరరావు, ఈఈల నేతృత్వంలో ఈ దాడులు జరిగినట్లు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ అధికారులు

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి

- రైతు నిర్లక్ష్యమే కారణం

రాచర్ల, ఫిబ్రవరి 12 : మండలంలోని చోళ్లవీడు పంచాయతీ పరిధిలోని అక్కపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై ఓ మహిళ కూలి మృతిచెందింది. అక్కపల్లె గ్రామంలోని రామిరెడ్డికి చెందిన పొలంలో మొక్కజొన్న పంట వేశారు. మొక్కజొన్న కండెలను కోయడానికి తురిమెళ్ల గ్రామం నుంచి 11 మంది మహిళ కూలీలు ఆటోలో సోమవారం వచ్చారు. అప్పటికే పొలం చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేసి రాత్రిపూట పందులు రాకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. ఉదయం పొలంలోకి కూలీలు దిగారు. అప్పటికే కంచె వేసిన తీగలపై పక్కన ఉన్న స్తంభం నుంచి ఎల్‌టీ తీగ తెగి పడింది. దీని గమనించకపోవడంతో పొలానికి కాపలాగా ఉన్న ఒక వ్యక్తి కంచెను పట్టుకున్నాడు. గట్టిగా కేకలు వేయడంతో మహిళ కూలీలు తమ దగ్గర ఉన్న దుస్తులతో అతడిని లాగి రక్షించారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు తురిమెళ్ల గ్రామానికి చెందిన మహిళ కూలి వేదమ్మ (60)కు విద్యుత్ తీగ తగిలింది. దీంతో ఆమె అక్కడిక్కడే మృతిచెందింది. మరో ఇద్దరికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అదృష్టవశాత్తు మిగతా కూలీలు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఘటన స్థలానికి ఏఎస్సై ఆదిశేషయ్య పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు.


మృతిచెందిన మహిళ

సాధన కళాశాల విద్యార్థిని ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12: పట్టణంలోని శ్రీ సాధన డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థిని ఈపూరి ధనలక్ష్మీ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం మొదటి ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం విద్యార్థినిని ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూధన్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. బీకాం కంప్యూటర్స్ విభాగం నుంచి ఈపూరి ధనలక్ష్మీ విశ్వవిద్యాలయం మొదటి ర్యాంకు కైవసం చేసుకుందన్నారు. ధనలక్ష్మీ 8.93-10, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్స్ సైన్స్ విభాగంలో షేక్ షాజిదా 8.63-10, జంతుశాస్త్ర విభాగం నుంచి సమీరా 8.58-10, కెమిస్ట్రీ నుంచి ఐవీ రమణ 8.24-10, జువాలజీ నుంచి షేక్ గంటా కరిస్మా 8.13-10ఎస్ జీపీఏలు సాధించారని తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

సోలార్ బ్యాటరీల దొంగతనంపై స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 12 : మండలంలోని పాలుట్ల గిరిజనగూడెంలో సోలార్ సిస్టమ్ బ్యాటరీల దొంగతనంపై సోమవారం ఒంగోలు ప్రకాశంభవన్‌లో కలెక్టరుకు పాలుట్ల చెంచుగిరిజన నాయకులు చెవులు అంజయ్య, వీటీడీఏ అధ్యక్షులు నిమ ఈదన్నలు ఫిర్యాదు చేశారు. పాలుట్ల గిరిజనగూడెంలో సోలార్ సిస్టమ్‌కు సంబంధించిన 550 బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తి దొంగతనం చేశాడని, ఈ నెల 5న ఎర్రగొండపాలెం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పాలుట గిరిజన గూడెం నాయకులు చెవుల అంజయ్య తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేయలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. బ్యాటరీల దొంగతనంపై విద్యుత్తు కన్‌స్ట్రక్షన్ ఏడీఈ ఫిర్యాదు ఇవ్వలేదని ఎస్ఐ తెలిపారన్నారు. లక్షల విలువచేసే బ్యాటరీలు చోరీ జరగ్గా, దొంగలు తీసుకెళ్లినా, అధికారులు చూచిచూడనట్లు వ్యవహరిస్తున్నారని వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు ఎస్పీ కార్యాలయానికి పంపించినట్లు వారు తెలిపారు. సోలార్ సిస్టమ్ మర్మత్తులకు గురికావడంతో గూడెం ప్రజలు అంధకారంలో ఉంటున్నారన్నారు.


స్పందనలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అందాల కోడిపుంజులు

గిద్దలూరు, ఫిబ్రవరి 12 : కేరళలోని పలక్కాడలో జరిగిన చిలకముక్కు కోడిపుంజుల పోటీలో గిద్దలూరుకు చెందిన రెండు కోడిపుంజులు బహుమతులు గెలుచుకున్నాయి. గిద్దలూరు పట్టణంలోని తరుణ్ అనే యువకుడు పక్షి ప్రేమికుడు కాగా చాలాకాలం నుంచి వివిధ రకాల కోడిపుంజులను పెంచుతూ పలు పర్యా యాలు వివిధ విభాగాల్లో బహుమతులు కూడా గెలుచుకున్నాడు. తాజాగా కేరళలో జరిగిన ఆల్ ఇండియా స్థాయి కాంపిటేషన్‌లో సైతం తరుణ్‌కు చెందిన 2 కోడి పుంజులు పలు విభాగాలలో బహుమతులు తెచ్చిపెట్టాయి.


అవార్డు తెచ్చిపెట్టిన పుంజులు

జగన్‌రెడ్డి మాయమాటలు నమ్మకండి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి
- వైసీపీని వీడి టీడీపీలోనికి చేరికలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 12 : మాయ మాటలు, కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్‌మోహన్‌రెడ్డి మాటలను నమ్మవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి రాచర్ల ఎస్సీపాలెంకు చెందిన 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమవరం ఆరోగ్యం ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. వీరిని అశోక్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గడిచిన నాలుగున్నర సంవత్సరంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలకు తీవ్రంగా అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీల సంక్షేమం కోసం టీడీపీ పార్టీ విశేషంగా కృషి చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని అన్నారు. టీడీపీ హయాంలో మీరందరికీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఉందన్నారు. పార్టీలో చేరిన వారిలో చిట్టెం భాస్కర్, చిట్టెం సుబ్బయ్య, తలపాటి సుధాకర్, చిట్టెం పోలయ్య, చిట్టెం ప్రభాకర్, చిట్టెం కిరణ్, పుల్లయ్య ఏసోబు, ప్రవీన్, చిట్టెం వెంకటయ్య, గుర్రం చంద్రశేఖర్, చిట్టెం చిన్న, చిట్టెం పిచ్చయ్య తదితరులు మాట్లాడుతూ అశోక్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన ఎస్సీ నాయకులకు కండువాలు కప్పుతున్న అశోక్‌రెడ్డి

వైసీపీ సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారం

టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ షేక్ అజహర్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 12 : డబ్బులు తీసుకొని అసత్యాలను సోషల్‌మీడియాలో ప్రచారంచేసేది వైసీపీ సోషల్ మీడియానే అని ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా కో- ఆర్డినేటరు షేక్ అజహర్ తెలిపారు. వైసీపీ సోషల్ మీడియాపై సోమవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. టీడీపీలోని వైసీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా వస్తోందన్నారు. అయితే వారు టీడీపీ చేరిన మరుసటి రోజు అదే ఊరికి వెళ్లి మరికొంతమందికి వైసీపీ కండువాలు వేసి టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరారని వైసీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి అయ్యిందని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారన్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై చర్చించేందుకు టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుతో బహిరంగ చర్చకు వస్తారా..? అని వైసీపీ సోషల్‌మీడియాను ప్రశ్నించారు. 2014 నుంచి 2019లో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్ప, ఈ నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వం ఎక్కడైన అభివృద్ధి పనులు చేశారా..? అని వైసీపీ సోషల్‌మీడియాను ప్రశ్నించారు. టీడీపీ సోషల్ మీడియా పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. డబ్బులు తీసుకొని అసత్యాలను ప్రచా రం చేసేది వైసీపీ సోషల్ మీడియా అన్నారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ సోషల్‌మీడియా సమన్వయకర్తలు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న అజహర్

ప్రజాస్వామ్యం, శాస్త్రీయ దృక్పథంతోనే దేశప్రగతి

జేవీవీ రాష్ట్ర నాయకులు మురళధర్

పొదిలి, ఫిబ్రవరి12: దేశప్రగతికి ప్రజాస్వామ్యం, శాస్త్రీయదృక్పథం కీలకమని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి.మురళీధర్ అన్నారు. సోమవారం పొదిలిలోని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు దాసరి గురుస్వామి అధ్యక్షతన జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ కళాజాత ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నేడు ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్యం మనుగడలో ఉంటేనే సమాజ పురోగతి సాధ్యమని అన్నారు. ప్రశ్నించే వాతావరణం ప్రజాస్వామ్యంలోనే ఉంటుందనీ ప్రశ్న లేకపోతే సైన్స్ లేదన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 40 సైన్స్ సంస్థలతో ఎర్పడిన ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్(ఎ.ఐ.పి.ఎస్.ఎన్)ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా శాస్త్రీయదృక్పధ ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జేవీవీ రాష్ట్రకమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5 నుండి 18 వరకు రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన దాసరి గురుస్వామి మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు నిరోధించాలని, సైన్స్ జీవన విధానంగా ఉండాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న కళాయాత్ర పొదిలికి రావడం హర్షనీయమని ఆయన అన్నారు. ప్రారంభ సభ అనంతరం రాష్ట్రస్థాయి కళాయాత్ర బృందం ఆధ్వర్యంలో సైన్స్ నృత్యరూపకాలు, నాటికలు, పాటలు, సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్ ప్రదర్శనలు నిర్వహించారు. మూఢనమ్మకాలపైన, బాలిక విద్యపైన, దేశభక్తిపైన, సామాజిక సమస్యలపైన, సైన్స్-శాస్త్రీయదృక్పధం వంటి అంశాలపైన ఈ ప్రదర్శనలు సాగాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమానికి పొదిలి ఎంఈవో ఎం.శ్రీనివాసులు, జెవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. జయప్రకాశ్, రాష్ట్రకమిటీ సభ్యులు వి.మాలకొండారెడ్డి, బషీరన్నీసాబేగం, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.ఖాజాహుస్సేన్, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ జడ్డు రమణయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేశ్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ హై, పి.బాల వెంకటేశ్వర్లు తదితర విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో వైసీపీ నేతల పరిచయ కార్యక్రమం

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 12: రానున్న ఎన్నికల నేపథ్యంలో గిద్దలూరు, మార్కాపురం వైసీపీ ఇన్‌చార్జ్‌లు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు సోమవారం కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు కుటుంబ సభ్యుడిలాగా అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ 2019 ఎన్నికలలో పార్టీకి వచ్చిన మెజారిటీ ఏ మాత్రం తగ్గకుండా ఈ సారి గిద్దలూరులో నాగార్జునరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యకర్తల కోసం తాము ఇద్దరం ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం మండలాల పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దూరంగా పలువురు ప్రజాప్రతినిధులు

గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల పరిచయ కార్యక్రమానికి నియోజకవర్గంలోని కొన్ని మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో గిద్దలూరు ఎంపీపీ కడప లక్ష్మీదేవి భర్త వంశీధర్ రెడ్డి, అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య, రమణారెడ్డి, బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, కంభం ఎంపీపీ చేరెడ్డి తులసమ్మ, అలాగే గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం జడ్పీటీసీ సభ్యులు సారే వెంకటనాయుడు, పగడాల శ్రీదేవి, చెన్ను విజయ, వెంకటరాజులు కూడా కార్యక్రమానికి హాజరు కాలేదని తెలిసింది.

గజ్జలకొండలో భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం

- బాండ్లు పంపిణీ చేసిన కందుల విఘ్నేష్‌రెడ్డి


అభివాదం చేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

మార్కాపురం రూరల్ ఫిబ్రవరి 12: మండలంలోని గజ్జలకొండ గ్రామంలో సోమవారం సాయంత్రం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కుమారుడు విఘ్నేష్ రెడ్డి కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్నా టిడిపి జనసేన ప్రభుత్వం రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి, టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంకెకు ఏపీఐఐసీ చైర్మన్ పదవి

అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నం

(ఒంగోలు, ఆంధ్రజ్యోతి)

అసంతృప్తితో రగలిపోతున్న మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి హడావుడిగా రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి అప్పజెప్పారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా జంకెను నియమించారు. ఆ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగుతారు. మార్కాపురంలో 2014లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు 2019లో ఆయనకు టికెట్‌ను నిరాకరించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఇచ్చిన హామీని గత ఐదేళ్లుగా నిలుపుకోలేదు. సుమారు ఏడాది క్రితం ఆయనకు ఒంగోలు లోక్‌సభ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఆయనకు మార్కాపురం టికెట్ ఇస్తామని ఆశచూపి చివర్లో ఇవ్వలేదు. దీంతో అసంతృప్తికి గురైన జంకె ఆదివారం జరిగిన మార్కాపురం, కొత్త ఇన్‌చార్జి ఎమ్మెల్యే రాంబాబు పరిచయ కార్యక్రమానికి కూడా గైర్హాజరయ్యారు. వేరే పార్టీ వైపు దృష్టిసారించారన్న అనుమానాలు కూడా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం సీఎంను కలిసిన బాలినేని కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఆయనకు హడావుడిగా ఏపీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్‌ను కట్టబెట్టారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీ అధికారంలోకి రాకపోతే ఈ పదవి మూన్నాళ్ల ముచ్చటే కానుంది. హడావుడి నియామకం నియోజకవర్గంలోని జంకె అనుచరులు పెదవి విరుస్తున్నారు.



అవీ..ఇవీ..

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కంభం, ఫిబ్రవరి 12 : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పోస్టల్‌శాఖలోని వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ అన్నారు. కంభంలో సోమవారం గ్రామీణ ప్రాంత తపాలా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంక్‌లకు దీటుగా తపాలాసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలకు తెలియచేసే బాధ్యత సిబ్బందిదేనన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఉత్తమ ప్రదర్శన కనపరచిన ఉద్యోగులకు అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ షేక్ మహమ్మద్‌అలీ, పోస్టుమాస్టర్ వెంకటసుబ్బయ్య, అబీబుల్లాభాషా, గ్రామీణ పోస్టుమాస్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

గిద్దలూరు తహసీల్దార్‌గా సిద్ధార్థ

గిద్దలూరు, ఫిబ్రవరి 12 : గిద్దలూరు తహసీల్దార్‌గా జి.సిద్ధార్థ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గుంటూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. స్థానికంగా పనిచేస్తున్న సీతారామయ్య బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ సిద్ధార్థను రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, జిల్లా వీఆర్‌వోల సంఘం ఉపాధ్యక్షులు వై.పీ.రంగయ్య, వీఆర్‌ఏల జిల్లా అధ్యక్షులు ఓ.అంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పార్కులను శుభ్రంగా ఉంచాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 12 : పట్టణంలోని మున్సిపల్ పార్కులను కమిషనర్ వి.శ్రీనివాసరావు సోమవారం ఉదయం తనిఖీ చేశారు. పార్కులలో అక్కడక్కడా చెత్తాచెదారం ఉండడం చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఖచ్చితంగా శుభ్రం చేయాలని, సిబ్బందిని ఆదేశించారు. వ్యాయామ పరికరాలు పాడైతే ఎప్పటికప్పుడు బాగు చేయించేలా చూడాలని పేర్కొన్నారు.

పరీక్ష వాయిదా

గిద్దలూరు, ఫిబ్రవరి 12 : పట్టణంలోని సెయింట్‌పాల్స్ విద్యాసంస్థలో వివిధ కేటగిరిలలో కోర్సుల నియామకం కోసం నిర్వహించాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయి. పోస్టల్ డిలే కారణంగా తమకు ఆలస్యంగా హాల్‌టికెట్లు వచ్చాయని కొందరు నిరుద్యోగ అభ్యర్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఉపవిద్యాశాఖాధికారి ఎ.చంద్రమౌలీశ్వర్, సెయింట్‌పాల్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గోన ఆశీర్వాదం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ సోమవారం ఒక విభాగానికి సంబంధించి పరీక్ష పూర్తికాగా 13వ తేదీ మరో పరీక్ష జరగాల్సి ఉంది. అయితే ఉపవిద్యాశాఖాధికారి ఆ మేరకు పరీక్ష కేంద్రానికి వచ్చి విచారించి 12వ తేది సోమవారం నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తూ ఈ పరీక్ష 26వ తేదీన, 13వతేదీన జరగాల్సిన పరీక్ష 27వ తేదిన నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లను, టెట్ అర్హత సర్టిఫికేట్లను వెంట తీసుకుని రావాలని పేర్కొన్నారు.

మహాసంకల్ప సభను జయప్రదం చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12: అణగారిన వర్గాలపై ప్రభుత్వం అణిచివేత ఆధిపత్యానికి వ్యతిరేకంగా గుంటూరులో ఈ నెల 14న జరిగే అధిక జన మహాసంకల్ప సభను జయప్రదం చేయాలని దళితహక్కుల పరిరక్షణ సమితి డివిజన్ అధ్యక్షుడు జనుమాల నాగయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మహాసభకు సంబంధించి కరపత్రాలు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో శాంతకుమార్, వీసీకే పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరీ, అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12: స్థానిక గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీ పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహరావు, కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణలు తెలిపారు. 16న అంకురార్పణ, 17న శేషవాహన సేవ, 18న హనుమంత వాహనం, 19న కళ్యాణం, గరుడ వాహనం, 20 రథోత్సవం, 21న అశ్వవాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12: టీడీపీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి అన్నారు. స్థానిక 25వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన గెలుపు ఎంతో అవసరమన్నారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మీ, టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, వక్కలగడ్డ మల్లికార్జున్, కౌన్సిలర్ నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కందుల రామిరెడ్డి

చెంచులకు నిత్యావసర సరుకుల పంపిణీ

రాచర్ల, ఫిబ్రవరి 12 : మండలంలోని జె.పుల్లలచెరువు గ్రామ సమీపంలో గిరిజనులకు సంగపేట పేద ప్రజలకు హైదరాబాద్‌లోని జూన్స్ సేవా సంస్థ, రీడ్స్ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి సుశీల్‌కుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కత్తి అన్నోజీరావు, ప్రేమ్‌కుమార్, వరకుమార్ పాల్గొన్నారు.


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బీసీఏలో విద్యార్థికి రెండోర్యాంకు

గిద్దలూరు, ఫిబ్రవరి 12 : పట్టణంలోని జీవనజ్యోతి డిగ్రీ కళాశాలలో బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న షేక్ అఫ్రోజ్‌సుల్తానా మొదటి సెమిస్టర్ పరీక్షలలో యూనివర్సిటీ స్థాయిలో 8.57 జీపీఏతో 2వ ర్యాంకు సాధించారు. ర్యాంకు సాధించిన సుల్తానను కరస్పాండెంట్ రెడ్డి వెంకటరెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ రవికుమార్ ఒక ప్రకటనలో అభినందించారు.



కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

కంభం, ఫిబ్రవరి 12 : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓవ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం కంభం పట్టణంలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ మహబూబ్‌వలి(38) గతంలో డ్రైవర్ పని చేసేవాడు. కొద్దిరోజులు మద్యం సేవించి కుటుంబాన్ని పట్టించుకోక పోవడంతో భార్య ముగ్గురు పిల్లలను తీసుకుని హైదరాబాద్‌లోని పుట్టింటికి వెళ్లింది. మహబూబ్‌వలి భార్యకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరగా తాగుడు మానివేస్తే వస్తానని చెప్పింది. దీంతో మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పులి రాజేష్ తెలిపారు.


అవినీతి పాలకులను గద్దె దించేందుకు సిద్ధం

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో బాలాజీ, డాక్టర్ ఉగ్ర


టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ, ఉగ్ర

పీసీపల్లి, ఫిబ్రవరి 12 : అవినీతి, అరాచక వైసీపీ పాలకులను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర అన్నారు. సోమవారం పీసీపల్లి టీడీపీ కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే దూరదృష్టి ఉన్న నాయకుడు చంద్రబాబు అయితే, రాష్ట్ర ప్రగతి వినాశకారి జగన్‌రెడ్డి అన్నారు. అధికారం లేకపోయినా స్థానికుడిగా నియోజకవర్గ అభివృద్ధి కోసం 10 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన నాయకుడు డాక్టర్ ఉగ్ర అన్నారు. ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఓటర్లను కలిసి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా పనిచేసిన ఉగ్ర నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు.మరో రెండు నెలల్లో జరిగే ఎన్నికల్లో కనిగిరిలో ఉగ్ర భారీ మెజారిటీతో గెలుపొందుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దపెద్ద భవంతులు కట్టి ప్రజలు సుఖవంతమైన జీవితం అనుభవిస్తున్నారంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 20202 విజన్‌తో తీసుకువచ్చిన సాఫ్ట్‌వేర్ రంగమే కారణమని బాలాజీ గుర్తు చేశారు.

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి, ప్రజలకు జరిగిన అన్యాయం, జగన్‌రెడ్డి అవినీతి, అరాచక, దౌర్జన్య పాలనపై నిల దీసిన చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టారన్నారు. అభివృద్ధి చేసేవారినే ప్రజలు ఆదరించి గెలిపించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ ఓటు ఉందా లేదా చూసుకోవాలన్నారు. 60 రోజులు ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేసి రాక్షస వైసీపీని తరిమికొట్టాలని ఉగ్ర పిలుపునిచ్చారు. అనంతరం తలకొండపాడు పంచాయతీలోని చిరుకూరివారిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠకు ఉగ్ర, పార్టీ శ్రేణులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు ఎన్.బ్రహ్మయ్య బీసీసెల్ కార్యదర్శి కోమటిగుంట్ల వీరయ్య, మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, కొప్పల్లి సురేష్, టీడీపీ మండల బీసీసెల్ సీనియర్ నాయకుడు చెన్నుబోయిన మాల కొండయ్యయాదవ్, టీడీపీ సర్పంచ్‌లు వెంగళాయపల్లి కరణం తిరుపతయ్య, నేరేడుపల్లి సర్పంచ్ పల్లా మల్లికార్జున్, గుదేవారిపాలెం సర్పంచ్ కనపర్తి శాంసన్, తలకొండపాడు సర్పంచ్ ముప్పూరి తిరుపతమ్మలు, టీడీపీ నాయకులు కరణం శ్రీను, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, హనుమారెడ్డి, ఉప్పుగుండ్ల శివరామయ్య, బోయపాటి సుబ్బారావు, వడ్డెంపూడి వెంకట్ ,ఎనుగంటి శ్రీను, ఏనుగంటి వెంకయ్య,పువ్వాడి నాగరాజు, తెలుగుయువత అధ్యక్షుడు ఎనుగంటి నాగేంద్రబాబు, చాగంరెడ్డి మాలకొండారెడ్డి(మాజీ),చాగంరెడ్డి మాలకొండారెడ్డి(బంగారు), దేవరపు కొండపనాయుడు, బద్దిపూడి ఎబినేజరు, ముప్పూరి మాల్యాద్రి, భట్టుపల్లి సర్పంచ్ డబ్బుగొట్టు రవీంంద్ర, కొల్లా శ్రీరాములు, పరిమి మాలకొండయ్య, గుంటగాని జోసెఫ్, మూలె బుజ్జిరెడ్డి, నాగేతు శ్రీను, మూలె సత్తిరెడ్డి, మూలె మహేంద్రరెడ్డి, ఉండేల పిచ్చిరెడ్డి, ఉండేల మల్లికార్జునరెడ్డి, వడ్డెంపూడి వెంకటసుబ్బయ్య, నెలకుర్తి మాల్యాద్రి, నెలకుర్తి అంకయ్య, గోనుగుంట్ల పేరయ్య, గోనుగుంట్ల చెన్నయ్య, చిరుకూరి మాలకొండయ్య, నెలకుర్తి మాలకొండయ్య, కరణం గంగయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కోట మెట్లపై కూర్చున్న విద్యార్థులు

విహారయాత్రలతో లోకజ్ఞానం

పామూరు, ఫిబ్రవరి 12 : విద్యార్థులు చదువుతో పాటు విహార యాత్రలు చేయడం ద్వారా చరిత్రపై అవగాహన, లోకజ్ఞానం తెలుస్తుందని సెయింట్ మార్క్స్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.జయకుమార్ అన్నారు. కడప జిల్లాలోని సిద్ధవటంలో పురాతన రాజుల కోటకు 300 మంది విద్యార్థులు సోమవారం విహారయాత్రకు తరలివెళ్లారు. కోట నిర్మాణం గురించి వివరించారు. క్రీస్తు శకం 1300 సంవత్సరాల క్రితం రాళ్లు, మట్టితో నిర్మితమైన కోటను విజయనగర రాజుల కాలంలో శ్రీకృష్ణ దేవరాయులు అల్లుడు వరదరాజులు దీనిని నిర్మించారని వివరించారు, ఉదయగిరి రాజ్యంలో ఉన్న కోటను మట్లి ఎల్లమ్మరాజుకు బహుమతిగా ఈ కోటను ఇచ్చారని, ఆతర్వాత ఆర్కోట్ నవాబుల వంశం అయిందని తెలిపారు. శత్రువుల నుంచి తప్పించుకునేందుకు ఏర్పాటు చేసిఉన్న సొరంగమార్గాలను చూపించి ఆనాటి నిర్మాణ శైలిని వివరించారు.


ఆర్థిక సాయం అందిస్తున్న వెంకట్

బాధిత కుటుంబాలకు వెంకట్ పరామర్శ

దొనకొండ, ఫిబ్రవరి 12 : మండలంలోని పలు గ్రామాల్లోని బాధిత కుటుంబాలను దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ సోమవారం వారి గృహాలకు వెళ్లి బాధిత కుటుంబాలను కలుసుకొని పరామర్శించారు. ఇటీవల పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న దొనకొండలోని గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన రైతు గోరంట్ల వెంకటరావు, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బేతేల్‌పురానికి చెందిన కొదమల ప్రవీణ్, ఆదివారం హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యర్రబాలెంకు చెందిన సగినాల భూతప్ప, రామాపురం గ్రామానికి చెందిన చిన్నకాశయ్య గృహాలకు వెళ్లి వారి కుటుంబాలను సందర్శించి వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకొని కుటుంబ ఖర్చుల నిమిత్తం కొంతమేర ఆర్థిక సాయం అందించారు. కుటుంబాల్లో చదువుకునే పిల్లలు ఉంటే చదివిస్తామని, నిరుద్యోగులుంటే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారికి భరోసా ఇచ్చారు. ముందుగా దొనకొండ టీడీపీ కార్యాలయంలో, రామాపురం గ్రామంలో వెంకట్‌కు జనసేన, టీడీపీ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ అభిమానులను వెంకట్ కలుసుకొని గ్రామాల్లో సమస్యలను చర్చించగా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ పాలనలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోని విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, మాజీ జడ్పీ కోప్షన్ సభ్యుడు షేక్ మగ్బూల్ అహమ్మద్, జనసేన పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు గుండాల నాగేంద్రప్రసాద్, ఎం షఫీఉల్లాఖాన్ (బాజీ), టీడీపీ నాయకులు కామేపల్లి చెంచయ్య, షేక్ ముసామియా, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, తోటా కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, పణిదపు వీరాంజనేయులు, నూనె యోహన్, బోయపాటి వెంకటేశ్వర్లు, పణిదపు అనంతరాములు, పురుషోత్తం సత్యానందం, పులిమి శివ, సింగమనేని హనుమంతరావు, జనసేన నాయకులు బండారు వెంకట్, హనుమంతరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎంఎన్‌ఎం విద్యార్థుల సత్తా


నేహదాస్


ఎం.స్వాతి

కనిగిరి, ఫిబ్రవరి 11 : గత ఏడాది డిసెంబరులో ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ఎంఎన్‌ఎం విద్యార్థులు హవా చాటారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఫస్ట్ సెమిస్టర్ అగ్రికల్చ ర్‌లో బద్దెపూడి స్నేహదాసు 8.14 శాతం మార్కులు సా ధించి వర్సిటీ టాప్1గా నిలిచాడు. మీరంపల్లి స్వాతి 7.97 శాతం మార్కులతో టాప్2గా, ఫస్ట్ బీసీఏలో మాసిపోగు ప్రవీణ్‌కుమార్ 165/200, ఫస్ట్ బీకాం హానర్స్‌లో బండారు వైష్ణవి 158/200, బీబీఏలో షేక్ సలీమా 158/200 ఫస్ట్ బీకాం కంప్యూటర్స్‌లో కిన్నెర స్వాతి 194/200, షేక్ నస్రీన్ 186/200, గానుగపెంట కావేరి 186/200, ఫస్ట్ బీఏలో వంగేపురం ప్రేరణఫీబా 147/200, వేశపోగు మరియదాసు 142/200 మార్కులు సాధించి టౌన్ టాప్‌గా నిలిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీవిద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, అధ్యాపక బృందం అభినందించారు.

గౌతమి విద్యార్థుల ప్రతిభ

దొనకొండ, ఫిబ్రవరి 12 : ఆంధ్రకేసరి యూనివర్సిటీ సోమవారం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాల్లో దొనకొండ గౌతమి డిగ్రీ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉత్తీర్ణత సాధించారని ప్రిన్స్‌పాల్ గోపి తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో షేక్ షమీమా 550/432 మార్కులు, నరసింహరాజు 550/353 మార్కులు, బీఏలో ఆఫ్రిన్ ఖాన్ 550/383, ఉదయ్ కిరణ్ 550/362 మార్కులు సాధించినట్లు తెలిపారు.

వైవీని కలిసిన స్థానిక ప్రజాప్రతినిధులు

తాళ్లూరు, ఫిబ్రవరి 12 : టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని తాడేపల్లిలో జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంకొండవారిపాలెం, బొట్లపాలెం నాయకులు పోశం శ్రీకాంత్‌రెడ్డి, గంగిరెడ్డిపాలెం యల్లమందారెడ్డి పాల్గొన్నారు.


పాలేటిపల్లివాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉగ్ర

వైసీపీని వీడి టీడీపీలోకి వలసలు

పాలేటిపల్లి, తలకొండపాడులో 30 కుటుంబాలు
మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర సమక్షంలో చేరిక

పీసీపల్లి, ఫిబ్రవరి 12 : పీసీపల్లిలో వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. రోజురోజుకూ వలసలు కొనసాగుతున్నాయి. మొన్న భట్టుపల్లి, ముద్దపాడు నేడు పాలేటిపల్లి, తలకొండపాడులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఉగ్ర కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జన్మభూమిపై మమకారంతోటే స్థానికుడిగా నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిటీష్ కాలంనాటి మొండి కట్టలకే పరిమితమైన పాలేటిపల్లి ప్రాజెక్టును నిర్మించి ఈ ప్రాంతవాసులకు అంకితమిచ్చానన్నారు. అభివృద్ధి చేసేవారిని ఆదరించి గెలిపిస్తే అన్ని రంగాలనూ అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే వెలిగొండ ఆయకట్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్పడంతో వెలిగొండను పూర్తి చేసి తాగు, సాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. నిమ్జ్, ట్రిపుల్ ఐటీ నిర్మాణాలు పూర్తి చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశలు కల్పిస్తామని ఉగ్ర చెప్పారు. వైసీపీని వీడి టీడీపీలో చేరినవారిలో పాలేటిపల్లికి చెందిన వార్డు మెంబరు మల్లికార్జున, బ్రహ్మయ్య, రవీంద్ర, శ్రీను, వీరనారాయణ, వెంకటరెడ్డి, పిచ్చయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, మీరావలి, తలకొండపాడుకు చెందిన మాజీ సర్పంచ్ చెన్నుపాటి పెదబ్రహ్మయ్య కుటుంబసభ్యులు, నెలకుర్తి నరసింహారావు, అనసూయ, చౌటగోగులపల్లిలో సుగుమంచి నాగభూషణం, శ్రీనివాసులు, మడక బ్రహ్మం, బి.శ్రీనివాసుతో సహా మొత్తం 30కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గడ్డం బాలసుబ్బయ్య, మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, గ్రామ అధ్యక్షుడు నెలకుర్తి మాల్యాద్రి, నెలకుర్తి వెంకట్రావు, ఓలేటి వీరాంజనేయులు, ముప్పూరి మాల్యాద్రి వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, వీరపనేని కేశవులు, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మూలె సత్తిరెడ్డి, పోలినేని మాలకొండయ్య, చెన్నుపాటి చినబ్రహ్మయ్య, వీరపనేని నాని, బద్దిపూడి ఎబినేజరు, గుంటగాని జోసెఫ్, గోపిశెట్టి శివప్రసాద్ ఉన్నారు.

ఓటర్ల జాబితాపై అప్రమత్తం



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెలిగండ్ల, ఫిబ్రవరి 12 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, దొంగ ఓట్లపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. వెలిగండ్ల టీడీపీ కార్యాలయంలో సోమవారం ఓటర్ల జాబితాలకు సంబంధించి 21 గ్రామ పంచాయతీలకు సంబంధించి బూత్ ఇన్‌చార్జిలు, నాయకులకు సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో ఓటర్ల జాబితాపై దృష్టి సారించి అవకతవకలు జరిగితే సమాచారం ఇవ్వాని వెంకటరెడ్డి సూచించారు. సమావేశంలో నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చిలకల వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మౌలాలీ, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, మం డల రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మె టాటి సుబ్బరెడ్డి, గంజి రాజశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, వెన్నా రమణారెడ్డి, గుంటక జయరామిరెడ్డి, గురుస్వామి, ముక్కు వెంటేశ్వరరెడ్డి, వెన్నా జగన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు బొద్దికూరపాడు విద్యార్థులు

తాళ్లూరు, ఫిబ్రవరి 12 : జాతీయ స్థాయి సబ్ జూనియర్ రగ్బీ పో టీల్లో బొద్దికూరపడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. వెన్నపూస ఓంకార్ మహేశ్వర రెడ్డి, వెదురూరి తులసి హర్షిణి గుజరాత్ రా ష్ట్రం గాంధీనగర్‌లో జరిగిన సబ్‌జూనియర్ రగ్బీ పోటీలకు ఎంపికయ్యా రు. ఎంపికైన విద్యార్థులను పీడీ సంగన్ రవిప్రసాద్‌రెడ్డి, పాఠశాల పీసీ చైర్మన్ వై.కృష్ణారెడ్డి, సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.అంజిరెడ్డి, ఎంపీటీసీ స భ్యుడు కె.బాలకోటయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

కనిగిరి, ఫిబ్రవరి 11 : ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆలూరి కోటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కార్మికు లు చేసిన సమ్మెలో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్ల ప్రకారం జీవోలు విడుదల చేయకుండా కాలయాపన చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు సమ్మెకు ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చే శారు. వెంటనే ఆయా జీవోలను విడుదల చేయకపోతే తిరిగి సమ్మెకు సిద్ధమవుతామన్నారు. నేటి నుంచి మున్సిపల్ కార్యాలయాల వద్ద నల్లబ్యాడ్జీలతో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చియాద్రి అశోక్, గంగవరం కిరణ్, షేక్ నాసర్‌వలి, పోలిచర్ల సుబ్రమణ్యం, మస్తాన్‌వలి, శేషయ్య హర్షద్ పాల్గొన్నారు.

మరువలేని మహానేత ఇరిగినేని


ఇరిగినేని ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

పామూరు, ఫిబ్రవరి 12 : సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎక్కడా అవినీతి, వారసత్వ రాజకీయాలకు తావివ్వని మరువలేని మహానేత స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు, ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత ఇరిగినేని తిరుపతినాయుడు వర్ధంతి కార్యక్రమాలు, మండలంలోని ఆయన స్వగ్రామం మోపాడు, బొట్లగూడూరు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉగ్ర ముందుగా బొట్లగూడూరు గ్రామంలో గల ఇరిగినేని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మోపాడు గ్రామంలో ఇరిగినేని సమాధి (ఘాట్) వద్ద ఇరిగినేని తనయుడు రవీంద్ర బాబుతో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నేటి తరం రాజకీయ నాయకులకు ఇరిగినేని జీవితం ఆదర్శం కావాలన్నారు. అనంతరం అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, కోటపాటి జనార్ధన్‌రావు, మాజీ ఎంపీపీలు, పోతు కొండారెడ్డి, జి.దశరథ రామయ్య, ఆవుల నాగేశ్వరరావు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, గుర్రం వెంకటేశ్వర్లు, పచ్చా పేరయ్య, గడ్డం బాలసుబ్బయ్య దారపనేని సుబ్బారావు, దేవరపు మాల్యాద్రి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, అడుసుమల్లి నరసింహులు, గద్దె గంగయ్యచౌదరి, జిల్లా కమిటీ నాయకులు, షేక్ ఖాజారహంతుల్లా, వై.ప్రసాద్‌రెడ్డి, షేక్ షరీఫ్, అమీర్ బాబు, పువ్వాడి వెంకట్‌చౌదరి, కొడవగంటి చిన్నయ్య, తెలజాల ప్రసాద్, గోళ్ల మాల్యాద్రి నాయుడు, మన్నం రమణయ్య, కోట చినవెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, డోలా శేషు, కమ్మబాలకృష్ణ, కౌలూరి రహంతుల్లా, తెలుగు మహిళలు దేవరపు రమణమ్మ, ఓరుగంటి సుబ్బమ్మ, ఈశ్వరమ్మ, తోపాటు టీడీపీ నాయకులు, ఇరిగినేని అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 20 ఎస్సీ కుటుంబాలు

పామూరు, ఫిబ్రవరి 12 : మండలంలోని మోపాడు గ్రామంలో ఇరిగినేని వర్ధంతి సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్సీ కాలనికు చెందిన 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు పచ్చా పేరయ్య, వై.ప్రసాద్‌రెడ్డి, దేవరపు మాల్యాద్రి ఆధ్వర్యంలో ఉగ్ర సమక్షంలో ఇరిగినేని ప్రధాన అనుచరుడు సీనియర్ నాయకుడు కొడవగంటి చిన్నయ్యకు, టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నాయకుల తప్పుడు విధానాలు నచ్చక పెద్ద ఎత్తున ఆ పార్టీ కార్యకర్తలు టీడీపీలోకి వస్తున్నారన్నారు. చంద్రబాబు భవిష్యత్‌కు గ్యారెంటీ, ఉగ్ర అభివృద్ధి ప్రణాళిక నచ్చి టీడీపీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. మీరంతా టీడీపీ విజయానికి కృషి చేయాలని ఉగ్ర కోరారు. చేరినవారిలో కొడవగంటి చిన్నయ్య, ముప్పరపు రత్తయ్య, కే.చిట్టిబాబు, ఎం.బెన్ని, జాషువా, నారాయణ, కే పురుషోత్తం, మోహన్, చంద్రయ్య, బిజాక్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు, పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, ఇరిగినేని రవీంద్ర బాబు, గుర్రం వెంకటేశ్వర్లు, దారపనేని సుబ్బారావు, వై.ప్రసాద్‌రెడ్డి, తెలజాల ప్రసాద్, ఎం.నరసింహారావు, బద్దిపూడి మార్క్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిని ఇస్తున్న గ్రామస్థులు

తూర్పుగంగవరం ఉమ్మడి భూమిని కాపాడండి

తాళ్లూరు, ఫిబ్రవరి 12 : తూర్పుగంగవరం గ్రామంలోని సర్వే నెంబర్-229లోని 190 ఎకరాల ఉమ్మడి భూమి పట్టా హక్కుదారులు కొందరు స్వాధీనం చేసే చర్యలు అడ్డుకుని గ్రామస్థులందరికీ పశువులమేతకు యథాప్రకారం ఉపయోగపడేలా చూడాలని గ్రామస్థులు సోమవారం స్పందనలో తహసీల్దార్ ఎస్‌కే మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన ఈ ఆస్తిని పూర్వం అన్యాక్రాంతం కా కుండా పశువుల మేతకు కేటాయించి 7గురు పెద్దలను పట్టాదారులు గా చేర్చారన్నారు. వారిలో నలుగురు ఆ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తహసీల్దార్‌కు తెలిపారు. ఈ విషయమై గతంలో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఆ భూములకు సంబంధించి వ్యక్తిగతంగా ఎవరికీ పాసు పుస్తకాలను ఇవ్వడం కుదరదని చెప్పానే ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ముడుపులు తీసుకొని ఉమ్మడి భూమికి హక్కుదారులు కానివారు మ్యూటేషన్‌కు పెట్టుకోగా హక్కుదారులను సంప్రదించకుండా ఏకపక్షంగా కొందరిపేర్లను ఎఫ్‌పీవోఎల్‌ఆర్‌లో నమోదు చేశారన్నారు. వెంటనే విచారించి భూమిని కాపాడాలని గ్రామపెద్దలు గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గుజ్జుల యోగిరెడ్డి, ఇమ్మానియేల్, సూర్యనారాయణ తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

5 తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు

కురిచేడు, ఫిబ్రవరి 12 : కురిచేడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో 5వ తరగతిలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆరోన్‌బాబు తెలిపారు. ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉంటుందని, 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు.


కల్యాణ తంతును నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా శ్రీ రంగనాయకస్వామి కల్యాణం

దొనకొండ, ఫిబ్రవరి 12 : నాల్గురోడ్ల కూడలిలోని ఆనందాశ్రమంలో శ్రీగోదాదేవి, శ్రీ రంగనాయకస్వామి వార్ల కల్యాణోత్సవంధర్మకర్త కాకర్ల బైరవానందస్వామి నేతృత్వంలో సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి పురోహితులు మణిబాబు శర్మ, చందవరం వెంకటరమణశర్మ గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, సర్వదేవతా హోమాలు, 11 గంటలకు శ్రీదోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. వేడుకలు సందర్భంగా వచ్చిన ప్రజలకు పెద్దన్నపాలెం గ్రామానికి చెందిన చెన్నబోయిన పాపయ్య, సుజాతలక్ష్మి దంపతులు అన్నదానం ఏర్పాటు చేయగా ధర్మకర్త బైరవానందస్వామి తీర్థప్రసాదాలను అందజేశారు.

కృష్ణా జిల్లా ఇన్‌చార్జిగా కొండారెడ్డి

దర్శి, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ కొండారెడ్డి కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ అ ధ్యక్షులు వైఎస్ షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. దర్శికి చెందిన కొండారెడ్డి గత ఎన్నికల్లో ఇక్కడ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నారు. ఆయన సేవలను గుర్తించి కొద్ది నెలల క్రితం రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా అతడిని నియమించింది. తాజాగా కృష్ణా జిల్లా ఇన్‌చార్జిగా కూడా నియమించడంపై స్థానిక నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అధిష్ఠాన నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

పామూరు, ఫిబ్రవరి 12 : పార్టీ అధిష్ఠానం తీసుకొన్న నిర్ణయానికి కట్టుబడి దద్దాలకు అండగా ఉంటామని పామూరు వైసీపీ నాయకులు అన్నారు. వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ మండలంలోని వైసీపీ నాయకుల మద్దతు కూడగట్టేందుకు పామూరు ఉప సర్పంచ్ వైవీ సాయికిరణ్ ఇంటికి సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా నాయకులు రామిరెడ్డి, జీ హుసేన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సుబ్బయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషా, సా యితో కలిసి మీడియాతో మాట్లాడారు. సమావేశంలో గట్ల భాస్కరరెడ్డి, సుబ్బారావు, గురవయ్య కొండారెడ్డి, గోవిందయ్య, శ్రీను, రవికుమార్, హుహబూబ్‌బాషా పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారి సత్యనారాయణ

దొనకొండ, ఫిబ్రవరి 12 : దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలకు మంజూరైన ఎన్‌సీసీ యూనిట్‌ను ఒంగోలు 34 ఆంధ్ర బెటాలిన్ కమాండింగ్ ఆఫీసర్ కే సత్యనారాయణ సోమవారం పాఠశాలలో ప్రారంభించారు. ముందుగా జాతీయ, ఎన్‌సీసీ జెండాలను ఆవిష్కరించి సెల్యూట్ చేసి జాతీయ గీతం ఆలపిస్తుండగా ఎన్‌సీసీ విద్యార్థులు డ్రమ్ బీట్ మోగిస్తూ నిర్వహించిన పెరేడ్ ఎంతో అబ్బురపరచింది. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలోని ఎన్‌సీసీ 34 బెటాలిన్‌లో నాలుగు డివిజన్ల పరిధిలో 28 పాఠశాలలు, 12 కాలేజీల్లో ఎన్‌సీసీ నడుపుతున్నట్లు తెలిపారు. ఇందులో 2740 మంది విద్యార్థులు ఉండగా, ఏడాదికి రెండు నుంచి మూడు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే సమ్మర్‌లో ఎన్‌సీసీ క్యాంపు దొనకొండలో ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్యాంపుల్లో డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్‌లో అదించే శిక్షణ జీవితకాలం ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు సోషల్ సర్వీస్, ట్రాఫిక్ కంట్రోల్, విపత్తులు జరిగిన సమయాల్లో సహాయక చర్యలకు ఉపయోగిస్తామన్నారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి మాట్లాడుతూ దొనకొండకు ఎన్‌సీసీ మంజూరు కావడం ఆనందకరమన్నారు. హెచ్‌ఎం రామాంజనేయులు, పీడీ నరసింహారావు కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, అమీర్, ప్రధానోపాధ్యాయులు వీవీ రామాంజనేయులు, ఎం.సు ధాకర్, సీహెచ్ చలమయ్యానాయుడు, ఫిజిక ల్ డైరెక్టర్ కే నరసింహారావు, విద్యా కమిటీ చైర్మన్ ఎన్.సుధీర్, ఉపాధ్యాయులు, వి ద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ డ్రెస్‌లో హెచ్‌ఎం

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభంలో ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజ ఎన్‌సీసీ అధికారి డ్రెస్‌లో కన్పించారు. ఈయన గతంలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా నాగ్‌పూర్‌లో మూడు నెలలు శిక్షణ పొంది దర్శి ప్రభుత్వ పాఠశాలలో ఏఎన్‌వోగా పనిచేసినట్లు గుర్తుచేశారు.



వయో.. వేదన



ఏటా జనవరి 1 ఏపీపీఎస్సీ క్యాలండర్ ప్రకటిస్తాం.. ఉద్యోగాలను భర్తీ చేస్తాం.. మెగా డీఎస్సీ నిర్వహించి పెద్దసంఖ్యలో డీఎస్సీ నియామకాలు చేస్తాం.. అని అధికారంలోకి వచ్చిన జగన్ నాలుగు ఏళ్ల తొమ్మిది నెలలుగా ఆ విషయం మరిచిపోయారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ ప్రకటించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.. వయో పరిమితి పెంచి పోస్టులను భర్తీ చేయాలన్న నిరుద్యోగుల ఆవేదన అరణ్యరోదనగా మారింది. నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం వయో పరిమితిని పెంచింది. ఈ క్రమంలో పక్క రాష్ట్రంలో పుట్టి ఉంటే, కనీసం అక్కడ చదువుకుని ఉంటే తమ ఆశలు నెరవేరేవనే భావనలో ఏపీలోని సీనియర్ నిరుద్యోగులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగా తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా వయోపరిమితి బాధితుల జాబితాలో చేరారు.

- నిరుద్యోగుల ఆవేదన అరణ్యరోదన
- వయోపరిమితి సడలింపు మంకుపట్టు
- 42 ఏళ్లకే పరిమితంపై కన్నీరు మున్నీరు
- కాళ్లా వేళ్లా పడినా కనికరించని ప్రభుత్వం
- హైకోర్టు సూచనలను పెడచెవిన పెట్టిన వైనం
- తెలంగాణలో 46 ఏళ్లకు పెంచిన రేవంత్ ప్రభుత్వం
- డీఎస్సీ అభ్యర్థుల నుంచీ వయో పరిమితిపై వినతులు
- పోటీ పరీక్షలకు అర్హత కోల్పోయిన వేల మంది నిరుద్యోగులు



గుంటూరు, ఫిబ్రవరి 12: ఒక్క ఛాన్స్. ఒక్కఛాన్స్ అంటూ వేడుకుని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. నిరు ద్యోగులకు మాత్రం ఒక్క ఛాన్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. వయోపరమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచమని నిరుద్యోగులు నెలల తరబడి కాళ్లా, వేళ్లా పడి వేడుకన్నా కనికరించేది లేదు దీంతో ఆరేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాలోని వేలాదిమంది నిరుద్యోగులు అర్హత కోల్పోయారు. పరీక్షలు రాయకుండానే ఉద్యోగాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయారు. తమకు ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్కరాష్ట్రం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని అడిగిందే తడవుగా వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచారు. కానీ జగన్ మాత్రం ససేమిరా లేదు పొమ్మన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్రంలో కాళీగా వున్న 2లక్షల 38వేల పోస్టుల భర్తీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఐదేళ్లుగా జాబ్ క్యాలెండర్ మాటేమోగానీ, కనీసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగులు పోటీ పరీక్షల అర్హత వయసు దాటిపోయారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోనే దాదాపు 50 వేల మంది అనర్హతబారిన పడ్డారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వకుండా చేసిన జాప్యానికి వయసుపెరిగి సీనియర్ నిరుద్యోగులు బలైపోయారు. కానీ ఇవేవీ పట్టించుకోని ముఖ్యమంత్రి ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగులకు వయో పరిమితి సడలించేందుకు నిరాకరించారు. ఇదిలా ఉండగా తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమ వయో పరిమితిని 44 నుంచి 47కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోటీ పరీక్షల్లో ఉద్యోగం పొందేందుకు సీనియర్ నిరుద్యోగులకు ఇదే చివరి అవకాశం అవుతుంది. వయోపరిమితి దాటిపోయిన వారికి ఈసారి ఉద్యోగం పొందలేకపోతే ఇక ఉద్యోగం వచ్చే అవకాశం ఎంతమాత్రం ఉండదు. మిగిలిన వారందరికీ ఈ నోటిఫికేషన్ కాకపోతే మరో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. కానీ సీనియర్లకు అలా కాదు. కానీ ప్రభుత్వం ఈ అంశాన్ని మానవీయ కోణంలో కూడా ఆలోచించడానికి నిరాకరించడం నిరుద్యోగుల పాలిట పెను విషాదంగా పరిణమిస్తోంది. ఇప్పటికే నిరుద్యోగ సమస్య కారణంగా రాష్ట్రంలో 1745 మంది చనిపోయారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా అర్హత కోల్పోయిన సీనియర్ నిరుద్యోగులపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వం ఇంత మొండిగా వ్యవహరించడం వారిని కలచివేస్తోంది.

టీడీపీ హయాంలో పలుమార్లు సడలింపు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు వయో పరిమితిని సడలించి నిరుద్యోగులకు ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పించారు. గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ నోటిఫికేషన్లు రెండుసార్లకుపైగా ఇచ్చారు. వీటితోపాటు పలు శాఖల ఇంజనీరింగ్, డిగ్రీ లెక్చరర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర పోస్టులకు టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని అన్ని పరీక్షలకు వయోపరిమితిని సడలించింది. కానీ ప్రస్తుత సీఎం జగన్ నిరుద్యోగుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవడంలేదు.

వెంటవెంటనే టెట్, డీఎస్సీ

- మార్చి 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల మండిపాటు

టెట్.. ఆ వెంటనే డీఎస్సీ. నిర్వహణపై నిరుద్యోగ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఒకే సారి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియడం లేదని వాపోతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే డీఎస్సీకి అర్హత. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ అభ్యర్థులకు టెట్ కీలకం. కాని టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వాహణ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. టెట్‌కు ఈ నెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా 18తో గడువు ముగుస్తుంది. 27 నుంచి మార్చి 9 వరకు రాత పరీక్షలు, మార్చి 14న ఫలితాలను విడుదల చేస్తారు. ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకుంటే 20 నుంచి మార్చి 9వ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తర్వాత డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కాని మార్చి 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే 15 నుంచి డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27న టెట్, వచ్చే నెల 15 నుంచి డీఎస్సీ నిర్వహించ నున్నారు. వేర్వేరు సిలబస్‌లు అయినందున రెండు పరీక్షల మధ్య కొంత సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వయోపరిమితి సడలించేలా సూచనలు జారీ చేసింది. వాటిని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైపెచ్చు గత ప్రభుత్వాలు 36 నుంచి 42 ఏళ్లకు పెంచిన వయో పరిమితిని తాను పెంచినట్లుగా నిరుద్యోగులను వంచించేందుకు పూనుకున్నారు.

ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి

తెలంగాణ రాష్ట్రంలో వయో పరిమితి 46 ఏళ్లు ఉండగా, తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లో కూడా వయో పరిమితి 44 ఏళ్లుగా ఉంది. ఈ రెండు అంశాలు చూసిన తరువాత నిరుద్యోగుల ఆవేదనకు అంతూపొంతూ లేకుండా ఉంది. అత్యధిక సంఖ్యలో ఉండే సాధారణ నిరుద్యోగులకు అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం ఇంత పట్టుదలగా ఎందుకు ఉందో కూడా వారికి అంతు చిక్కడం లేదు. పక్క రాష్ట్రాన్ని చూసైనా ఏపీ ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని, తమకు ఒక్క అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. నోటిఫికేషన్ గడువు పూర్తయినా అనుబంధ నోటిఫికేషన్‌తో తమకు మరో అవకాశం కల్పించాలని కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమకు వయో పరిమితిని పెంచాలని విన్నవించుకుంటున్నారు.

మేమేం నేరం చేశాం?

ఏపీలో పుట్టడమే మేం చేసిన నేరమా? లేక ఒక్క ఛాన్స్ అన్నందుకు గంపగుత్తగా ఓట్లేసి గెలిపించడమా మేం చేసిన నేరమా? ఏం చేశామని మమ్మల్ని ఇంతగా వేధిస్తున్నారు? ఏం నేరం చేశామని ఇంత అన్యాయం చేస్తున్నారు. తెలంగాణలో పుట్టి ఉంటే, అక్కడ చదువుకుని ఉంటే కనీసం తమ గోడు వినిపించుకునే అవకాశమన్నా ఉండేది. ఇక్కడ మా ఆవేదనను పట్టించుకునే నాథుడే లేడు. మాలాంటి వారి ఆవేదనను అర్థం చేసుకుని తెలంగాణలో వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచారు. ఇక్కడ కాళ్లా వేళ్లా పడినా పాలకులు కనికరించలేదు. హైకోర్టు సూచనలను పాలకులు పెడచెవిన పెట్టారు.

- సీనియర్ నిరుద్యోగులు ఆవేదన

ఎదురు తిరిగితే.. వేధింపులే!



సహజవనరుల దోపిడీకి అడ్డొచ్చిన అధికారులకు బదిలీని బహుమానంగా ఇచ్చారు.. ప్రశ్నించిన ప్రజలపై అక్రమ కేసులు బనాయించి భయబ్రాంతులకు గురిచేశారు.. తమకు ఎదురు తిరిగితే సంక్షేమ పథకాలు అందవంటూ లబ్ధిదారులను తమ అధీనంలో ఉంచుకున్నారు.. నాలుగున్నరేళ్లుగా వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వ్యవహరించిన తీరు ఇది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వారి ఆగడాలు పరాకాష్టకు చేరి ఇన్ని రోజులు వైసీపీ కోసం పనిచేసిన నేతలపైనే కక్షసాధింపులకు దిగుతున్నారు. పూర్తి అభద్రతాభావంలోకి వెళ్లిపోయి ద్వితీయశ్రేణి నేతాగణాన్ని అనుమానంగా చూస్తూ వారిపైనే అధికార దండం ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలో చేరినవారి ఆర్థిక మూలాలతో పాటు తెలుగుదేశం పార్టీలోని ద్వితీయశ్రేణి నేతలే లక్ష్యంగా బెదిరింపులకు పాల్పడుతూ వికృత ధోరణిని ప్రదర్శిస్తున్నారు.

- పార్టీ వీడేవారిపై పాలకపార్టీ వికృత క్రీడ
- ఓటమి భయంలో వైసీపీ నాయకులు
- స్వపక్ష నేతలపైనా అధికార ప్రయోగం
- టీడీపీ నాయకుల ఆర్థిక మూలాలపైనా కన్ను
- ఇప్పటికే టీడీపీలో చేరిన వారిపై కక్ష సాధింపులు

బాపట్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల వైసీపీ... నియోజకవర్గాల ఇన్‌చార్జిల మార్పు విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో పార్టీ అధిష్ఠానం వైఖరిని తప్పుబడుతూ కొంతమంది వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇదే వారుచేసిన నేరంగా వైసీపీ పెద్దలకు కనబడింది. వారిపై అధికార దండాన్ని ప్రయోగించే కార్యక్రమానికి పూనుకున్నారు. విస్తుగొలిపే విషయమేమిటంటే వారు ఇంకా వైసీపీలోనే కొనసాగుతున్నా అనుమానంతో వారిని వేధించడం మొదలుపెట్టారు. రేపల్లె నియోజకవర్గ పరిధిలోని ఓ మండల నాయకుడికి ఇటీలే ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది.

నేతలపైనా అదే ధోరణి....

అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా హనిమిరెడ్డి నియామకాన్ని వ్యతిరేకిస్తూ శాప్ నెట్ చైర్మన్ కృష్ణచైతన్య తన కార్యక్రమాలు తాను విడిగా చేసుకుంటున్నారు. ఇవన్నీ కూడా వైసీపీ గొడుగుకిందే ఆయన చేస్తున్నారు. అయినప్పటికీ ఆ చర్యలపై అధిష్ఠానం కన్నెర్ర చేసి చైతన్యకు సంబంధించిన గ్రానైట్ క్వారీపై సోదాల పేరిట అధికారులను వైసీపీ పెద్దలు ఉసిగొల్పి ఆయనకు షాకిచ్చారు. ఇక్కడ కూడా ఆయన చేసిన నేరం అద్దంకిలో నూతన ఇన్‌చార్జిగా నియమించిన హనిమిరెడ్డిని వ్యతిరేకించడమే. ఇలా స్వపక్షంలో ఉంటూ కేవలం అభిప్రాయం చెప్పిన పాపానికి అధికారపార్టీ వేధింపులకు గురవుతున్నారు.

టీడీపీ వారిపైనా పలురకాలుగా..

జిల్లావ్యాప్తంగా వైసీపీని వీడి పచ్చకండువా కప్పుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పరిణామాలు మింగుడుపడని పాలకపార్టీ టీడీపీ ద్వితీయశ్రేణి నేతాగణంపై కన్నేసి వారిని ఎలాగైనా వైసీపీలో చేరాలని లేకుంటే దాడులు తప్పవనే హెచ్చరికలు జారీ చేస్తున్నారని సమాచారం. అద్దంకి మండలంలో ఓ గ్రామంలో చిరు దుకాణం నిర్వహిస్తూ పొట్టపోసుకుంటున్న టీడీపీ సానుభూతిపరుల కుటుంబాన్ని వైసీపీలో చేరాలని తీవ్రఒత్తిడి తేవడమే కాకుండా ఆ దుకాణాన్ని కూలదోస్తామనే బెదిరింపులకు సైతం పాలకపార్టీ నేతలు దిగినట్లు సమాచారం. గతంలో వైసీపీలో ఉండి ఇటీవలే టీడీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడికి సంబంధించి బిల్లులు ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్నాయి. పార్టీ మారడంతో ఆయనకు చెల్లించాల్సిన బిల్లులపై ఆశలు వదిలేసుకోవాల్సిందే అనే సంకేతాలను వైసీపీ నేతలు పంపారు. వీళ్లనే కాకుండా ఆయా గ్రామాల్లో క్రియాశీలకంగా పనిచేసే టీడీపీ ద్వితీయశ్రేణి నేతల ఆనుపానులను విచారణ చేసి వాటి ఆధారంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని వారిపై ఒత్తిడి చేసి పబ్బం గడుపుకోవాలనే రాక్షస క్రీడకు వైసీపీ నాయకులు తెరతీశారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.

వివరాలు కావాలి...

వేమూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికల పర్వం మొదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఓ మండలస్థాయి టీడీపీ నేత ఈ చేరికల్లో కీలక భూమిక పోషించారు. సదరు టీడీపీ నేత ఆస్తిపాస్తుల వివరాలను ఆరా తీసి రెవెన్యూ రికార్డులను జల్లెడ పట్టాలనే అనధికారిక ఆదేశాలు సిబ్బందికి వెళ్లినట్లు సమాచారం. ఇలా అనేక చోట్ల టీడీపీ ద్వితీయశ్రేణి నేతలే లక్ష్యంగా బెదిరింపులకు దిగుతున్నారు. అయినప్పటికీ వీటికి లొంగకుండా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఉండడంతో అసహనంతో వైసీపీ నేతలు రగిలిపోతున్నారు.

ఓటమి భయమే...

రోజురోజుకూ ఆయా నియోజకవర్గాల్లో పాలకపార్టీపై పెరుగుతున్న వ్యతిరేకతతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నేతలు స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా కక్ష సాధింపులకు దిగుతూ జనంలో మరింత పలచనవుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మరోవైపు నూతన ఇన్‌చార్జిలు వచ్చినచోట వైసీపీ శ్రేణుల నుంచే వారికి సహకారం అందకపోవడం వారిని మరింత అయామయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలోనే టీడీపీలోకి చేరికలు ఊపందుకోవడం, స్వపక్షంలోనే అసమ్మతి స్వరాలు పెరగడంతో పిడుగుకి బియ్యానికి ఒకటే మంత్రం అన్నట్లు వైసీపీ నేతలు వ్యవహరిస్తూ అందరిపైనా అధికార దండం ప్రయోగించే వికృతక్రీడకు తెరతీశారనే విమర్శలు అన్ని వైపుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

- 313 పరిశ్రమలకు రూ.11.08 కోట్ల రాయితీ విడుదల
- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, ఫిబ్రవరి 12: పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో తాజాగా స్థాపించిన 313 పరిశ్రమలకు రూ.11.08 కోట్ల రాయితీ నగదును విడుదల చేశామన్నారు. జిల్లాలో ఉత్పత్తులు పెరిగితే ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని చెప్పారు. నూతనంగా 329 దరఖాస్తులు సింగిల్ డెస్క్ విధానంలో రాగా 306 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి అర్హులను గుర్తించామన్నారు. 21 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు. సీఎంఈజీపీ కింద 814 దరఖాస్తుల్లో 302 అర్హత ఉన్నట్లు గుర్తించి మంజూరు చేశామన్నారు. విశ్వకర్మయోజన కింద 422 దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. బాపట్ల, చీరాల, అద్దంకి ప్రాంతాల్లోని ఏపీఐఐసీ భూములలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వడానికి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖాధికారి వై.రామకృష్ణ, ఎల్‌డీఎమ్ శివకృష్ణ, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, డిక్కి జిల్లా అధ్యక్షుడు భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను అరికట్టాలి

భ్రూణ హత్యలను అరికట్టడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవానలి కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం జరిగింది. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణితో కలిసి స్కానింగ్‌సెంటర్ల పనితీరుపై కలెక్టర్ చర్చించారు. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. 69 స్కానింగ్ సెంటర్ల పునరుద్ధరణ ప్రక్రియపై చర్చించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే మాతృ, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. సమావేశంలో ఏఎస్పీ పి.మహేష్, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, వైద్యవిధానపరిషత్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ శేషుకుమార్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా



చినకొత్తపల్లి వద్ద కోళ్ళ ఫారం షెడ్‌లు




అద్దంకిలో చికెన్ దుకాణం వద్ద ధరల బోర్డు

ఫౌల్ట్రీపై కార్పొరేట్ పాగా

- ధర పెరగాల్సిన సమయంలో తగ్గిన చికెన్
- గ్రామీణ కోళ్ళఫారం నిర్వాహకులను దెబ్బతీసేందుకు పన్నాగం

అద్దంకి, ఫిబ్రవరి 12: కార్పొరేట్ సంస్థల కన్ను ఫౌల్ట్రీ పరిశ్రమపై పడింది. గ్రామీణ ప్రాంతంలోని కోళ్ళ ఫారాల నిర్వాహకులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు పన్నాగాలు పన్నుతున్నాయి. ఈ క్రమంలో కార్పొరేట్ సంస్థలు కూడబలుక్కొని రంగప్రవేశం చేశాయి. ఈక్రమంలోనే కార్పొరేట్ సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కోళ్ల ఫారాలను ఏర్పాటు చేసుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో లీజుకు తీసుకున్నాయి. మరింత విస్తరించేందుకు పలుచోట్ల భూములు కొనుగోలు, షెడ్ల నిర్మాణాలను ప్రారంభించాయి. కార్తీక మాసం పూర్తయిన తర్వాత నుంచి చికెన్ ధరలకు రెక్కలు వస్తాయన్న ఆశతో గ్రామీణ ప్రాంతాల కోళ్ల ఫారంల నిర్వాహకులు పెంపకం చేపట్టారు. ఈనేపథ్యంలో ధరలు పెరగాల్సిన సమయంలో తగ్గడంతో పారాల నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా ముడికోడి ధర ఫారం వద్ద రూ.120 ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90కి మించటం లేదు. ఇందులో రవాణా ఖర్చులు, బ్రోకరేజ్‌ల కింద మరో రూ.20 తగ్గించటంతో చేతికి వచ్చేది 70 రూపాయలే ఉంటుందని, దీంతో కనీసం ఖర్చులు కూడా రాక నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. లక్షల రూపాయలు నష్టం వాటిల్లుతుండటంతో పలువురు ఫౌల్ట్రీ ఫారంల నిర్వాహకులు ఇంతటితో విరమించుకునేం దుకు సిద్ధం అవుతున్నారు. మరికొందరైతే కార్పొరేట్ సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు.

రూ.12 లక్షల నష్టం



గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్పొరేట్ సంస్థలు ఫౌల్ట్రీ పరిశ్రమలోకి రంగప్రవేశం చేసి ధరలు తగ్గించటంతో నష్టాలు వస్తున్నాయి. ఇప్పటికే రూ.12 లక్షల నష్టం వచ్చింది. దీంతో ఫౌల్ట్రీ పరిశ్రమ నిర్వహించటం కంటే మిన్నకుండటమే మేలుగా ఉంది.

- వెలనాటి శ్రీనివాసరావు, అద్దంకి

లీజుకు ఇవ్వడం మినహా గత్యంతరం లేదు



కోళ్ళ ధరలు ఈ నెలలో ఫారం వద్ద కిలో రూ.120 ఉంటుంది. ఈ ఏడాది రూ.80 నుంచి రూ.90కి మించి లేదు. దీంతో నష్టానికి అమ్ముకోక తప్పడం లేదు. ఇందులో రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల కింద మరో రూ.20 తగ్గిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఫౌల్ట్రీ పరి శ్రమలు నిర్వహించే కంటే విరమించుకోవటమో లేక కార్పొరేట్ సంస్థలకు లీజు కు ఇ వ్వటం మినహా వేరే ప్రత్యామ్నాయం లేదు.

-రవి, గోవాడ, అద్దంకి మండలం

17న పర్చూరుకు చంద్రబాబు

బాపట్ల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): దుర్మార్గ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో రా...కదలిరా పేరిట బహిరంగసభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా ఈనెల 17న పర్చూరు నియోజకవర్గానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్నారు. సభను పర్చూరు లేదా ఇంకొల్లు మండలంలో నిర్వహించేలా టీడీపీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి సోమవారం పలు ప్రదేశాలను పార్టీ నాయకులు పరిశీలించారు. మంగళవారానికి సభ నిర్వహించే ప్రదేశంపై స్పష్టత వస్తుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి..

ఇటీవల కాలంలో పర్చూరు నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లక్ష్యంగా పాలకపార్టీ అక్రమ కేసులను బనాయించడం ఒక ఎత్తయితే గ్రానైట్ ఫ్యాక్టరీల తనిఖీల పేరిట వైసీపీ ప్రైవేటు సైన్యాన్ని వెంటేసుకుని అధికారులు చేసిన హడావిడి విమర్శలకు తావిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం జరిగిపోయింది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే రా.. కదలిరా బహిరంగసభను పర్చూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించేలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

» కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. నోటిఫికేషన్‌కు ముందు, తర్వాత చేపట్టాల్సిన విధుల నిర్వహణపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలు నుంచి సోమవారం డివిజనల్, మండలస్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతిఒక్కరు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అందుకోసం అవసరమైన సామగ్రిని సమకూర్చుకోవాలన్నారు. గతనెల 22న ప్రకటించిన తుది ఓటర్ల జాబితా సరిగా ఉందో లేదో ఒకసారి సరిచేసుకోవాలన్నారు. ఆర్వో పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులకు అవసరమైన శిక్షణను ఇవ్వాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లో డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అమలు జరుగుతున్న గృహనిర్మాణాల లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో చేపట్టిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో 22వేల మంది ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశామన్నారు. మిగిలిన పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్వో శ్రీలత, అధికారులు జాలిరెడ్డి, పేరయ్య, వసుంధర పాల్గొన్నారు.

503 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 12: జిల్లాలో 503 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీచేసేందుకు ప్రభుత్వం సోమవారం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించింది. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 111 ఖాళీలను ప్రకటించింది. ఈ మొత్తంలో పాఠశాల విద్యలో 98, గిరిజన పాఠశాలల్లో మూడు ఖాళీలను చూపించారు. అదేవిధంగా 299 స్కూలు అసిస్టెంట్ ఖాళీలను చూపించారు. వీటిల్లో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 290 ఖాళీలు చూపించగా గిరిజన పాఠశాలల్లో 8, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఒకటి ఖాళీని చూపించారు. గురుకుల పాఠశాలల్లో 93 టీజీటీ పోస్టులను ఖాళీలుగా చూపించారు. ఏపీ మోడల్ స్కూళ్లలో 12, బీసీ సంక్షేమ గురుకులాల్లో నాలుగు, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 21, ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో 47, ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో తొమ్మిది పోస్టులు చూపించారు. 2018 సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. సోమవారం నుంచి ఈనెల 21 వరకు అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి. 22 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 5 నుంచి హాల్‌టికెట్లు, మార్చి 15 నుంచి 30వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో పరీక్షలు. డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు జనరల్ కేటగిరి అభ్యర్థులు 44ఏళ్లు కాగా రిజర్వుడు కేటగిరిలకు మరో ఐదేళ్ల వయోపరిమితిని పెంచారు.

పోలీసులకు సహకరించండి

» శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

» ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పరమేశ్వరరెడ్డి



బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 12 : పోలీసులకు విధి నిర్వహణలో ప్రజలు, రాజకీయ నాయకులు సహకరించాలని నూతన ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణ కోసం అన్నివర్గాలు సహకరించాలన్నారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కృషి చేయాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న పోలీసు అధికారులతో సమావేశమై పరిస్థితులను అవగాహన చేసుకుని ముందుకు వెళతామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలోని పోలీసు అధికారులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఏ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు, ఏఎస్పీ ఏఆర్ అశోక్‌బాబు డీఎస్పీలు కిషోర్‌బాబు, అశోక్‌వర్ధన్, బాలసుందరరావు, విక్రం శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మలికగర్గ్‌కు ఘనంగా వీడ్కోలు



వీడ్కోలు సందర్భంగా ఎస్పీ గర్గ్‌ను ఎత్తుకొని తీసుకొస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది

జిల్లాలో ఎస్పీగా పనిచేసి బదిలీపై తిరుపతి వెళ్లిన మలికగర్గ్‌కు పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. సోమవారం ఉదయం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ జీపులో మలికగర్గ్‌ను ఊరేగించి ఘనంగా వీడ్కోలు పలికారు. మహిళా పోలీసు అధికారులు ఆమెను చేతులపై మోస్తు అభిమానాన్ని చాటుకున్నారు.

ప్రజలను పదేపదే తిప్పుకోవద్దు

» స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

» అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 12 : ఒకే సమస్యపై ప్రజలను కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోకుండా ఆయా అర్జీలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డయల్ యువర్ కలెక్టర్ అనంతరం జరిగిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో 250 అర్జీలు వచ్చాయన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నత స్థాయి అధికారులకు పంపాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో ఉన్నత ప్రమాణాలను పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలపై అధికారుల వద్దకు వెళ్తే కచ్చితంగా పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత, ఎస్డీసీలు లోకేశ్వరరావు, వరకుమార్, ఝాన్సీలక్ష్మి, మాధురి పాల్గొన్నారు.



పునాదుల్లోనే మార్కాపురం మెడికల్ కాలేజీ

ఆలు లేదు.. చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా ఉంది మార్కాపురం మెడికల్ కాలేజీ వ్యవహారం. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అబ్బో అంతా పూర్తి.. ఇక క్లాసులు మొదలు, వైద్యసేవలూ అందుతాయ్ అంటూ హడావుడి. వాస్తవంగా అక్కడ పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది. ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాలేదు. మూడేళ్లలో మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తెస్తామని సీఎం జగన్మోహన్‌రెడ్డి 2021 మే 21న వర్చువల్ విధానంలో శంకుస్థాపన సందర్భంగా ప్రకటించారు. అదే విషయాన్ని శంకుస్థాపనలో స్థానికంగా పాల్గొన్న జిల్లా మంత్రి సురేష్, ఇతర వైసీపీ ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. దాదాపు మూడేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు నత్తకు నడక నేర్పుతున్నాయి. నిధుల సమస్య ఇందుకు కారణమనే ఆరోపణలున్నాయి.

ఒక్క భవనం పూర్తి కాలేదు..!

» నత్తనడకన మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం

» ఇంతవరకు పరిశీలించని ఎన్ఎంసీ

» పశ్చిమ ప్రకాశం ప్రజలకు అందని ద్రాక్షలానే వైద్య సేవలు

» రూ.475 కోట్ల ప్రాజెక్టుకు రూ.50 కోట్లే వ్యయం

» అందులో రూ.20 కోట్లు పెండింగ్

» ఈ ఏడాది కాలేజీ అడ్మిషన్లకు అవకాశమే లేదు

ఒంగోలు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కళాశాల విషయంలో వైసీపీ సర్కారు సరికొత్త నాటకానికి తెరతీసింది. అక్కడ ఎటువంటి నిర్మాణాలు పూర్తికాకుండానే, అనుమతులు రాకుండానే త్వరలో అంతా సిద్ధం.. ఈ ఏడాదే ప్రారంభం అంటూ మాయాజాలం చేస్తోంది. వివరాల్లోకి వెళితే.. మార్కాపురంలో రూ.475 కోట్ల వ్యయంతో 500 పడకల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించే ఆస్పత్రి, 100 మెడికల్ సీట్లు ఉండే కళాశాలను 2021 మార్చి 22న మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మార్కాపురం మండలం రాయవరం వద్ద 50.50 ఎకరాల్లో ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణంలో భాగంగా ఆస్పత్రి, బోధనాస్పత్రి, నర్సింగ్ కళాశాల, మెడికల్, నర్సింగ్ కాలేజీ విద్యార్థులకు హాస్టళ్లు, క్వార్టర్లు భారీ కిచెన్, డైనింగ్ హాలు, బయో మెడికల్ వేస్ట్ ప్లాంట్ వంటి నిర్మాణాలు చేయాలి. ఇందుకు సంబంధించి 2021 మే 21న శంకుస్థాపన చేయగా అనంతరం టెండర్లు పిలవడంతో మేఘా ఇంజనీరింగ్ కంపెనీ దక్కించుకుంది. మొత్తం పనులు 30నెలల్లో పూర్తిచేసేలా అగ్రిమెంట్ జరిగింది. టెండర్ల అవార్డు ప్రకారం 2024 సెప్టెంబరు ఆఖరుకు పూర్తికావాలి. అయితే టెండర్ల ఖరారుకే పది నెలలు గడిచిపోగా ఆ తర్వాత ఇంచుమించు ఏడాది పాటు పనులు ప్రారంభమే కాలేదు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలను సదరు కంపెనీ పొందగా తొలిదశ చేపట్టిన వాటికి బిల్లులు సక్రమంగా రాక పనులు సత్వరం చేపట్టలేదు. ఇక ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభమైనా నత్తనడకన సాగుతున్నాయి.



అసంపూర్తిగా హాస్టల్ భవన నిర్మాణ పనులు

కౌన్సిల్ అనుమతి రావాలంటే..

కాగా మెడికల్ కాలేజీ అడ్మిషన్లు ప్రారంభించాలంటే జాతీయ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) అనుమతి ఇవ్వాలి. సదరు సంస్థ అనుమతి మంజూరు చేయాలంటే మొత్తం నిర్మాణాలు పూర్తిచేయడంతోపాటు రెండేళ్లపాటు అక్కడి వైద్యశాలలో రోగులకు వైద్యసేవలు అందించాలి. మొత్తం సిబ్బంది నియామకం పూర్తి చేయాలి. ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారం అంతా జరగాలి. అందుకోసం రెండు, మూడు విడతలుగా ఎన్ఎంసీ బృందం వచ్చి పరిశీలించి సంతృప్తి చెందితేనే అనుమతి ఇస్తుంది. అయితే 2024-25 నుంచే మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రారంభించనున్నట్లు వైసీపీ ప్రభుత్వం, నీలిమీడియా అబద్ధపు ప్రచారం చేస్తుండగా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మరో రెండేళ్లకు కూడా వైద్యసేవలు ప్రారంభించే అవకాశాలు కనిపించడం లేదు. ఏడాది క్రితం నిర్మాణాలు ప్రారంభించగా ప్రస్తుతం ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తికాలేదు. కీలకమైన మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలు మూడు, నాలుగు అంతస్తులలో నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం కొన్నింటిని అరకొరగా శ్లాబ్‌లు పూర్తిచేశారు. మరికొన్నింటికి శ్లాబ్‌లు వేసేందుకు సిద్ధం చేస్తున్నారు. విద్యార్థుల హాస్టల్ భవనాలది ఇంతవరకు స్పష్టత లేక పోగా అంతర్గత రోడ్లు, ఇతర సౌకర్యాలు పనులు ప్రారంభమే కాలేదు. అడ్మిషన్లకు అనుమతి ఇవ్వాలంటే రెండేళ్ల వైద్య సేవలు సదరు కాలేజీలో అందించాల్సి ఉండగా కొత్తగా నిర్మిస్తున్న భవనాలు ఎప్పటికి పూర్తవుతాయి, వైద్యసేవలు అందించేది ఎప్పుడు అన్నది ప్రశ్నార్థకమే.

తాత్కాలిక షెడ్లతో మమ

అయితే వైద్యసేవల నిబంధన చాలా కీలకమైనది కావడంతో మార్కాపురంలో ప్రస్తుతం ఉన్న జిల్లా వైద్యశాలలో ఆ సేవలు అందిస్తున్నట్లు ఎన్ఎంసీ తనిఖీ సందర్భంగా చూపేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం ఆ ఆసుపత్రిలో తాత్కాలికంగా షెడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే మెడికల్ కాలేజీ బెడ్ల కెపాసిటి 500 కాగా, ప్రస్తుతం ఉన్న మార్కాపురం జిల్లా ఆస్పత్రికి 100 బెడ్ల కెపాసిటీ మాత్రమే ఉంది. దీంతో సదరు ఆస్పత్రిలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న షెడ్లలో మరో 100 పడకలకు ఏర్పాటు చేస్తున్నారు. అయితే సిబ్బంది నియామకం ఇంతవరకు జరగలేదు. ఇక రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీలో అందుతున్న సమాచారం ప్రకారం ఇప్పటివరకు కేవలం రూ.50 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేసినా వాటి పూర్తికి మరో రెండేళ్లు పట్టడం ఖాయం. ఆ తర్వాత వైద్యసేవలు అందించి ఎన్ఎంసీ అనుమతి పొందగలిగితేనే అడ్మిషన్లకు అవకాశం కలిగించేది. పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, ఎర్రగొండపాలెం ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేది. అయితే వాస్తవాలను పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వ పెద్దలు, నీలి మీడియా ఈ ఏడాదే మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రారంభమవుతుందన్న ప్రచారం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే అలా అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

చివర్లో పేదలు గుర్తొచ్చారా..?

» తప్పులను ఎత్తిచూపుతుంటే తడబాటు ఎందుకు..

» మాయమాటలు చెప్పి మోసం చేయడం మానుకో

» పేదలకు పట్టాలను టీడీపీ అడ్డుకోదు, స్వాగతిస్తుంది

» నా ఇల్లు.. ఆంధ్రజ్యోతిని ముట్టడిస్తామంటే... ఇక్కడెవరూ భయపడరు

» ఒంగోలు ఎమ్మెల్యే బాలినేనిపై దామచర్ల ఫైర్



మాట్లాడుతున్న జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 12 : 'నాలుగున్నరేళ్లుగా కనరాని పేదలు మరో వారం పదిరోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి గుర్తుకొచ్చారు. మాయ చేసేందుకే ఇప్పటికిపుడు పట్టాలంటున్నారు. అది కూడా సాధ్యపడదని తెలిసి టీడీపీపై నిందలు వేస్తున్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యే రెండు సార్లు మంత్రి అంటావు.. ఒకసారి రోజు నీళ్ల ఇవ్వకపోతే పోటీ చేయనంటావు. ఇంకోసారి పట్టాలు ఇవ్వకపోతే, మరోసారి మాగుంట లేకపోతే పోటీ చేయనంటావు. నీ చేతకానితనాన్ని తెలుగుదేశంపై నెడతావు. పేదలకు పట్టాలను టీడీపీ అడ్డుకోదు. మంచిపనిని ఎప్పుడు స్వాగతిస్తుంది. నిబంధనలు తెలియవా? నీ మాయ మాటలను ప్రజలు గుర్తిస్తున్నారని తెలిసి ఆదేమంటే నా ఇల్లు, ఆంధ్రజ్యోతి ఆఫీస్‌ను ముట్టడిస్తాం అంటావు. నీ బెదిరింపులకు ఎవరు భయపడరు.. పిల్ల రాజకీయాలు మానుకో..' అంటూ ఎమ్మెల్యే బాలినేనిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ ఫైర్ అయ్యారు. సోమవారం స్థానిక పీవీజీ కన్వెన్షన్ హాలులో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలినేని ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు.

ఎన్నికలపుడు హామీ ఇవ్వడం..

చేయలేక టీడీపీపైకి నెట్టడం

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ప్రతిసారి ఎన్నికల సమయంలో ఏదో ఒక హామీ ఇవ్వడం చేయలేక తన చేతగానితనాన్ని టీడీపీపైకి నెటడం అలవాటుగా మారిందని మండిపడ్డారు. టెండర్లు కూడా తెరవకుండా పనులు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటన్నారు? నిబంధనల ప్రకారం పనులు జరిగితే కోర్టులు కూడా న్యాయమైన తీర్పు ఇస్తాయన్నారు. అయితే సొంత డబ్బులతో పెన్షన్‌లు, ఇళ్ళ పట్టాలు అంటూ చెప్పడానికి నువ్వేమైనా రాజువా.. ఏం వ్యాపారాలు చేసి అంత డబ్బులు పెడుతున్నారు. అంత శ్రద్ధ ఉంటే నగరంలో అభివృద్ధి పనులు సొంతంగా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. పోతురాజు కాలువ ఎందుకు పూర్తిచేయలేదని, ప్రజల కోసం అంటున్నావుగా మరి సొంత డబ్బులతో బాగు చేయవచ్చు కదా అని ఎద్దేవా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తే అధికారులు కూడా ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

మెప్మాలో స్కాంను

మేయర్ ఒప్పుకున్నారు

వైసీపీ పాలన అంతా అవినీతిమయంగా ఉంది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో మెప్మాలో జరిగిన కుంభకోణం వెలుగులోకి వచ్చిందన్నారు. వాస్తవమేనని మేయర్ కూడా స్వయంగా ఒప్పుకున్నారు. దీనిపై తాము పూర్తిస్థాయి విచారణ కోరుతున్నామని, బాధ్యులైన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్పొరేషన్‌లో అటు అధికారులు, వైసీపీ కార్పొరేటర్లు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారన్నారు. తాము అధికారంలోకి రాగానే మొత్తం కక్కిస్తామన్నారు.

ఇల్లు ముట్టడిస్తే

ఇక్కడెవరూ భయపడరు

ఎమ్మెల్యే చేతగానితనాన్ని ప్రశ్నిస్తే మైండ్ పోయి మాట్లాడుతున్నారని, ఇళ్లు, పత్రికల కార్యాలయాలు ముట్టడిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 75వేల మందితో ఇల్లు ముట్టడిస్తే తామేమైనా చేతకాని వారమా? మాకు లేరా లక్షల్లో జనం అంటూ ధ్వజమెత్తారు. చేతనైతే న్యాయంగా పేదలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. పట్టాలు ఇస్తే తాము కూడా స్వాగతిస్తామని, ఎందుకు అడ్డుకుంటామన్నారు. ఇది సాధ్యపడదని తెలిసి ముందే టీడీపీపై నిందలు వేస్తున్నాడని, ఈనెల 25లోపు పట్టాలు ఇచ్చి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

అభ్యర్థులు మారినా మారని అసమ్మతి

» గిద్దలూరు, మార్కాపురం పరిచయ కార్యక్రమాల్లో పునరావృతం

» అసమ్మతి నాయకులు రాకపోవటంతో బయటపడ్డ రాంబాబు


» బాలినేని కలయికలోనూ మారని అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీ స్థానిక నేతల, పార్టీ శ్రేణుల అసమ్మతికి విరుగుడుగా అభ్యర్థులను మార్చినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించటం లేదు. మంచిరోజులు చూసుకుని గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల అభ్యర్థుల పరిచయ కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించింది. ఆదివారం మార్కాపురం నియోజకవర్గంలోని పార్టీశ్రేణులను మండలాలవారీ పరిచయం చేసే కార్యక్రమం మార్కాపురంలోని ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించారు. సోమవారం గిద్దలూరు నాయకులకు నాగార్జునరెడ్డిని పరిచయం చేసే కార్యక్రమాన్ని మార్కాపురంలో ఎమ్మెల్యే రాంబాబుకు చెందిన కిట్స్ కాలేజీలో నిర్వహించారు. రెండు కార్యక్రమాలకు సాధారణ పార్టీ సభ్యులను తీసుకురావటంలో నాయకులు సఫలీకృతులైనా అసమ్మతి నాయకులను మాత్రం కదిలించలేకపోయారు. దీంతో జగన్ అభ్యర్థుల మార్పుతో కిందిస్థాయి నాయకుల్లో అసమ్మతిని పోగొట్టాలని చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. మార్కాపురం సమావేశంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి పార్టీశ్రేణులను రాంబాబుకు పరిచయం చేశారు. ఆయన మామ అయిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి హాజరైనా ఆయనను వ్యతిరేకిస్తున్న నాయకుల నుంచి హాజరు పెద్దగా కనిపించలేదు. జగన్ తనను మోసం చేశాడని భావిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఆయనతో పాటు రాష్ట్ర పార్టీ కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జడ్పీటీసీగా ఉన్న ఆయన సతీమణి ఇందిర, మార్కాపురం జడ్పీటీసీ నారు బాపనరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి లక్ష్మీదేవి, గజ్జలకొండ, చింతగుంట్ల ఎంపీటీసీలు తదితర గ్రామస్థాయిలో పట్టు ఉన్న నాయకులు సమావేశానికి డుమ్మా కొట్టారు. ఇటు మార్కాపురం మున్సిపాలిటీతో పాటు ఇతర మండలాల వారు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పొదిలి, కొనకనమిట్ల మండలాల నుంచి ముఖ్య నాయకులను సమీకరించే విషయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులరెడ్డి సఫలీకృతమైనప్పటికీ పెద్దసంఖ్యలో గ్రామస్థాయి నాయకులు కదలకపోవటం విశేషం. ప్రత్యేకించి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరు దూరంగా ఉండగా మరికొందరు సమావేశానికి హాజరైనా అభ్యర్థి మార్పును జీర్ణించుకోలేక పోతున్నట్లు సహచరులతో మాట్లాడటం విశేషం.

తొలగించని స్థానికేతర ఓట్లు

అధికారపార్టీకి కొమ్ముకాస్తున్న బీఎల్‌వో, వీఆర్‌ఏ



త్రిపురాంతకం, ఫిబ్రవరి 12: మండలంలోని పలు పోలింగ్ బూత్‌లలో ఓట్ల అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. గ్రామాల్లో తమ ప్రాధాన్యం, ప్రాతినిధ్యం, పెత్తనం కోసం అధికార పార్టీకి చెందిన గ్రామస్థాయి నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. మండలంలోని కొత్తఅన్నసముద్రం గ్రామం దీనికి మంచి ఉదాహరణగా ఉంది. గ్రామంలో మొత్తం 1330 ఓట్లు ఉండగా, 116వ బూత్‌లో గ్రామానికి చెందిన సుమారు 40 మందికి పైగా ఇతర ప్రాంతాలో నివాసముంటున్నారు. వారి ఓట్లు తొలగించకుండా సంబంధిత బీఎల్‌వోను అధికార పార్టీ నాయకులు మేనేజ్ చేశారు. వీరిలో 5 నుండి 30 ఏళ్ల క్రితం పెళ్లై ఇతర ప్రాంతాల్లో ఉంటున్న మహిళలు, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి స్థిరపడినవారు ఉన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే వారు గ్రామానికి వచ్చి ఓట్లు వేసి వెళుతుంటారు. గ్రామంలో బంధువులు మాత్రమే ఉంటారు కానీ, ఇళ్లు, పొలాలు, ఆధార్‌లు, రేషన్‌కార్డులు వంటివికూడా ఏమీ ఉండవు. ఇలాంటి ఓట్లు తొలగింకుండా బీఎల్‌వోలు, అధికార పార్టీ నాయకులు ఒక్కటయ్యారు. పారదర్శకతకు పాతరేశారు. ఇలాంటి ఓట్లపై గ్రామంలోని కొందరు అభ్యంతరాలు చెప్పినా మేం తొలగించం, అంతా మాఇష్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

- పచ్చిగోళ్ళ దానియేలు, సుమతమ్మ వినుకొండలో, పచ్చిగోళ్ల చినదావీదు, నడిపి దావీదులు హైదరాబాదులో సుమారు 25 ఏళ్ల నుంచి ఉంటున్నారు. కానీ ఈ ఓట్లను తొలగించకుండా 116 బూత్‌లో వరుస సంఖ్య 425, 426, 427, 429లలో అలానే ఉంచారు.
- పల్లె వెంకటరావు, పల్లె కుమారి, పల్లె త్రిపురయ్య, పల్లె నాగమ్మలు గుంటూరులో చాలా ఏళ్ల నుంచి ఉంటున్నారు. ఈ ఓట్లను కూడా తొలగించకుండా 116 బూత్‌లో వరుస సంఖ్య 570, 572, 573, 574లలో కొనసాగిస్తున్నారు.
- మాలపాటి జ్యోత్స్న, మాలపాటి జయ, మాలపాటి విజయరావు, మాలపాటి జస్వంత్, మాలపాటి జయమ్మ, మాలపాటి చిన్నబాలస్వామి, మాలపాటి కమలమ్మలు 15 సంవత్సరాల నుంచి విజయవాడలో ఉంటున్నారు. కాగా ఓట్లను తొలగించకుండా వరుస సంఖ్య 297, 298, 299, 300, 338, 339, 340 లలో ఉంచారు.
- ఇదే బూత్‌లోని కసుపర్తి వెంకటరమణ, కసుపర్తి మాణిక్యం, కసుపర్తి విజయలక్ష్మి, కసుపర్తి జోనా, కసుపర్తి జాన్‌శీలాలు 30 ఏళ్లకు పైగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరి ఓట్లనూ తొలగించకుండా వరుస సంఖ్య 275, 276, 277, 278, 279 లలో కొనసాగిస్తున్నారు. గ్రామంలోని ఓ వీఆర్‌ఏకు బంధువులు కావడంతో తొలగింపులు చేపట్టకుండా అలానే ఉంచినట్లు విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ ప్రత్యర్థుల ఓట్లు తొలగించేందుకు సహకరిస్తున్నట్లు వీఆర్‌ఏపై పలు ఆరోపణలు ఉన్నాయి.



చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

- రెండు నెలల్లో జగన్ ఇంటికే!
- టీడీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 12: రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రావల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు టీడీపీలో చేరారు. బల్లికురవ మండలం గొర్రెపాడు గ్రామానికి చెందిన 60 కుటుంబాలు వైసీపీని వీడి రవికుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రోజునుంచే ఏపీ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ప్రజావేదిక కూల్చివేత నుంచి పన్నుల బాదుడుతో నిరుపేదలను నమ్మించేలా మాయమాటలు చెప్పి అన్నివర్గాల ప్రజలకు విసుగు కలిగించేలా జగన్ పాలన సాగిందన్నారు. మరో రెండు నెలల్లో జగన్ రెడ్డి ఇంటికి పోవటం తథ్యమని చెప్పారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. దళితులకు గత టీడీపీ ప్రభుత్వం అందించిన వంద పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల కుప్పగా మార్చి ప్రతి ఒక్కరిపై లక్షల్లో అప్పులు చేశారని రవికుమార్ ఆరోపించారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి మాట తప్పి మహిళలను మోసం చేశారని అన్నారు. టీడీపీ కార్యకర్తలు రెండు నెలల పాటు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలందరికి లబ్ధి చేకురేలా టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో పార్టీలో చేరిన గొర్రెపాడు నేతలు మక్కెన స్వాములు, రాయల అంకమ్మరావు, గుంటూరు వెంకట్రామయ్య, మక్కెన సత్యనారాయణ, గొల్లపూడి చిన్న, జంద్రాజుపల్లి పూర్ణయ్య, గుమ్మడెల చిన్నఅంజయ్య, మెట్ల దానారావు, గుంటూరు గిరిబాబు, ఏలూరి నారాయణ, మక్కెన వెంకటేశ్వర్లు, కల్లూరి ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.


బల్లికురవ: ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ గొర్రెపాడు నేతలు, కార్యకర్తలు


అద్దంకి: ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వెంపరాల కాలనీ మహిళలు, వైసీపీ నేతలు

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

అద్దంకి, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పాలనను గాడిలో పెట్టాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమని చెప్పారు. మండలంలోని వెంపరాల ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ నేతలు, ఆయా కుటుంబాల సభ్యులు, మహిళలతో పుట్టావారిపాలెం వద్ద ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వెళ్లి టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించటంతో పలు పథకాలకు నిధులులేకుండా పోయాయన్నారు. దాచుకోవటం, దోచుకోవటం మినహా రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి చేసిందేమి లేదన్నారు. సీఎం పదవికి జగన్ అనర్హుడన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారన్నారు. రాబోయే ఎన్నికలలో వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు చం ద్రబాబు నాయుడుని గెలిపించి రాష్ట్ర భవిష్యత్ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

టీడీపీలో చేరిన వారిలో మున్నంగి బాబూరావు, మున్నంగి నాగేష్, గరిగల అంకయ్య, డేవిడ్, అబ్రహం, ఆనందరావు, ఎడ్లపల్లి నగేష్‌బాబు, మందా దేవసహాయం తదితరులతో పాటు ఆయా కుటుంబసభ్యులు, మహిళలు ఉన్నారు.


బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ప్రచారంలో టీడీపీ శ్రేణులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

చీరాల, ఫిబ్రవరి 12: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరిఅమర్‌నాథ్ అన్నారు. స్థానిక 25వ వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే రాష్ట్రం అంధకారంలోకి పోతుందన్నారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లోకేష్ శంఖారావానికి ప్రజల నుంచి అశేష స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 12: సెయింట్‌ఆన్స్ కళాశాలలో ఇటీవల (24బై7)ఏఐ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు చెప్పారు. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు జరిగిన ఎంపిక ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నాగేశ్వరరావు సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ పి.హరిణి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.జగదీష్‌బాబు, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ సి.హరికిషన్, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. ఇంద్రసేన్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, ఫిబ్రవరి 12: నియోజకవర్గంలో సమస్యలన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. స్థానిక 3వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్లను మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలసి ఎమ్మెల్యే బలరాం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కలవకూరి యానాదిరావు, షేక్ సలీమ్, ప్రతాప్, కంకణాల నాని, బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, ప్రసాద్‌రెడ్డి, డీఈ ఏసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

పంగులూరు, ఫిబ్రవరి 12:సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో వ్యాధ్యాబాబు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయితీల పరిధిలో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేంద్రాలలో 39,020 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రాలవద్ద ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, కిటికీలు, తలుపులకు తగిన మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

18న విజయానందతీర్థ అద్దంకి రాక

అద్దంకి, ఫిబ్రవరి 12: మైసూరు అవదూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామీజీ ఈనెల 18న అద్దంకి రానున్నట్లు దత్తపాదుకాక్షేత్రం ట్రస్టీ చైర్మన్ నాగసూరి హనుమత్ తెలిపారు. సోమవారం స్థానిక దత్తపాదుకాక్షేత్రంలో వివరాలు వెల్లడించారు. 18వ తేది ఉదయం 9 గంటలకు సౌరహోమం, తైలాభిషేకం, అనుగ్రహ బాషణం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీచక్రార్చన, దివ్యనామ సంకీర్తన జరుగుతుందన్నారు. ట్రస్టీ చైర్మన్ నాగసూరి హనుమత్ ప్రసాద్, కార్యదర్శి రామకృష్ణారావు, కురిచేటి సుబ్బారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఒబ్బినీడి సుబ్బారావు, మామిడి రాంబాబు, చామర్తి వెంకటరావు, మల్లికార్జునరావు, తమ్మన శ్రీనివాసరావు, ఆత్మకూరి పెదఆంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి

చీరాల, ఫిబ్రవరి 12: వేటపాలెం మండలం సిలోన్ కాలనీలో పలువురికి అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా రిటైర్డ్ తహసీల్దార్ ఇచ్చిన నివేశన స్థల పట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం బాధ్యుడు కొండయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సిలోన్ కాలనీకి చెందిన పలువురు నిరాహారదీక్ష చేపట్టారు ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి ఎలా పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు. ఈక్రమంలో కొందరు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఇదే విషయమై అర్జీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో సూర్యప్రకాష్‌రెడ్డి దీక్ష చేపట్టిన వారితో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో దీక్షను విరమించారు. కార్యక్రమంలో శివనాడియన్, సత్తివేలు, కర్ణ, వినోద్, సెల్వరాజ్, రాణి, సెల్వి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బల్లికురవకు కలెక్టర్ రాక

బల్లికురవ, ఫిబ్రవరి 12: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం బల్లికురవలో జరగనుంది. ఈకార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాషా రానున్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రజలు తమ సమస్యలు చెప్పుకొనేందుకు తరలిరావాలని గ్రామస్థాయి అధికారులకు సమాచారం అందిస్తున్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్


అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే బలరాం తదితరులు

చీరాల, ఫిబ్రవరి 12: డాక్టర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఆయన సిద్ధాంతాలతో మమేకమై నడుస్తున్న కోట్ల మంది ప్రజలు అందుకు నిదర్శనమని చెప్పారు స్థానిక ముక్కోణపు పార్కు సెంటర్లో రూ.30 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యున్నత గుర్తింపు పొందిన వ్యక్తుల్లో అంబేడ్కర్ మొదటి వరుసలో ఉంటారన్నారు. ఆయన ప్రతిఒక్కరి మదిలో గుర్తుంటారన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమిష్టి కృషి ఫలితంగా కాంస్యవిగ్రహం రూపుదిద్దుకుందన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించటం ప్రతిఒక్కరి ధర్మమన్నారు. ముందుగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే బలరాంను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, పలు సంఘాల ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విద్యాబోధనకు స్మార్ట్ డిజిటల్ దోహదం


బధిరుల పాఠశాలలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

పర్చూరు, ఫిబ్రవరి 12: చెవిటి, మూగ విద్యార్థులకు అధునిక విద్యాబోధన అందించేందుకు స్మార్ట్ డిజిటల్ ఎంతగానో దోహద పడుతుందని పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాలెం గ్రామ పంచాయతీ నాగుబడి రంగయ్య అచ్చమ్మ బధిరుల పాఠశాలలో హైదరాబాద్ డెక్కన్ అనుబంధ సంస్థ డేర్ ప్రాజెక్ట్ సహకారంతో రూ.2.15 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన స్మార్ట్ డిజిటల్ తరగతి గదిని రోటరీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలే లక్ష్యంగా పర్చూరు రోటరీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డెక్కన్ క్లబ్ గతంలో పబ్లిక్ టాయిలెట్స్‌కు రూ.లక్షా 15 వేలు అందించినట్లు చెప్పారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ వికాస్ కార్యక్రమంలో భాగంగా నాగులపాలెం ఆర్‌సీసీ సహకారంతో లక్షల విలువ చేసే రోడ్లతోపాటు, మంచినీటి చెరువుపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోశాధికారి కోమటి ఆంజనేయులు, రోటరీ సభ్యులు, పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగిఉండాలి


భద్రతా వారోత్సవాల సందర్భంగా దగ్గర ఉండి పనులు చేయిస్తున్న పీడీ శివకుమార్, అధికారులు

మేదరమెట్ల , ఫిబ్రవరి 12: జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, దుకాణదారులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సింహపూరి ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ శివకుమార్ అన్నారు. సోమవారం 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా తిమ్మనపాలెం, గ్రోత్ సెంటర్ వద్ద తమ సిబ్బందితో రోడ్డు మార్కింగ్, రోడ్డు బ్లింకింగ్ పాటు పరిస రాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో దుకాణాల ముందు వాహనాలు ఆపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై దుకాణదారులకు అవగాహన కల్పించారన్నారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ నెంబరు 8096999057, ఎమర్జెన్సీ నెంబర్ 1033, అంబులెన్స్ నెంబర్ 8086999039, 8096999059లకు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చునని చెప్పారు. ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మెయింటెన్స్ మేనేజర్ విజయభాస్కర్, ఇంజనీర్లు గాంధీ, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చినగంజాం, ఫిబ్రవరి 12: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కస్తుర్బాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి తెలిపారు. స్థానిక కేజీబీవీలో పీడీ ఎస్.వాణిశ్రీ అధ్యక్షతన సోమవారం జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు అభినంద సభ జరిగింది. ఇటీవల కడవకుదురు జడ్పీ పాఠశాలలో అండర్-14 విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో బి.ప్రజ్ఞ(8వ తరగతి) లాంగ్ జంప్, ఎం.జెస్సీ(8వ తరగతి) 200 మీటర్ల పరుగు పందెం, డి.సింధు(7వ తరగతి) 600 మీటర్ల పరుగుపందెంలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరిగే 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్, పీడీ., ఉపాధ్యాయినులు అభినందనలు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

అద్దంకి, ఫిబ్రవరి 12: గంజాయితో వెళ్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన నాదెండ్ల ఇమామ్ బాషా, ప్రొద్దుటూరుకు చెందిన గాదంశెట్టి జీవన్‌కుమార్ చెడు వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్‌లలో ఉంచి అమ్మకాలు చేస్తున్నారు. ఆ డబ్బులతో జల్సాలు చేయటానికి ప్రొద్దుటూరు నుంచి విజయవాడ వెళ్ళటానికి అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ఉన్నారు. పోలీసులకు సమాచారం రావటం తో ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

ఎస్‌ఐగా రత్నకుమారి.. అద్దంకి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రత్నకుమారి ఎస్సై గా సోమవారం చేరారు. చీరాల 2 టౌన్ నుండి బదిలీ పై అద్దంకి వచ్చారు. సిఐ కృష్ణయ్య ను కలిసి విధులలో చేరారు.

ఆగిఉన్న వాహనాన్ని బైకు ఢీకొని ఇద్దరికి గాయాలు

చినగంజాం, ఫిబ్రవరి 12: ఆగిఉన్న వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కడవకుదురు గ్రామ సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కలిదిండి మండలం తాడినాడ నుంచి వాహనం ఒంగోలుకు రొయ్యల పిల్లల కోసం వెళ్తుంది. వాహనం డ్రైవర్ పొలిమెట్ల మురళీరాజు కడవకుదురు సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిలిపాడు. ఈక్రమంలో చీరాల నుంచి చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామానికి ద్విచక్రవాహనంపై మాదాసు అవిన్, అతని తల్లి పార్వతి వెళ్తూ వాహనం వెనుక భాగాన్ని ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో అవిన్, పార్వతిలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సమయంలో చీరాల బందోబస్తుకు వెళ్తున్న చినగంజాం ఎస్‌ఐ ఎం. శ్రీనివాసరావు ప్రమాదంలో గాయబడిన ఇద్దరిని తన వాహనంలో ఎక్కించుకొని చికిత్స నిమిత్తం చీరాల ఏరియ వైద్యశాలలో చేర్పించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు.

రాతి మండపం నిర్మాణానికి విరాళం


శింగరకొండ దేవస్థానం రాతి మండపం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రామకృష్ణప్రసాద్, అపర్ణ దంపతులు

అద్దంకి, ఫిబ్రవరి 12: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి చిలకలూరిపేటకు చెందిన మచ్చా రామకృష్ణప్రసాద్, అపర్ణ దంపతులు 1,01,116 రూపాయలు ఈవో సుభద్రకు సోమవారం అందజేశారు. దేవాలయం వద్ద ఏటీఎం ఏర్పాటుకు అవసరమైన గదిని నిర్మించేందుకు నర్సరావుపేటకు చెందిన బొడ్డుపల్లి శ్రీనివాసరావు, అరుణ దంపతులు ముందుకువచ్చారు.

కాగా, 204-25 ఆర్థిక సంవత్సరంలో శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంకు సంబంధించి పలురకాల అంశాలకు టెండర్‌లు నిర్వహించారు. ప్రాంగణంలో ఫొటోలు తీసుకునే హక్కుకు 1,31,500 రూపాయలకు దక్కించుకున్నారు. గత ఏడాది 1,21,000 రూపాయలుగా ఉంది. మరికొన్ని అంశాలకు సంబంధించి సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు. కూరగాయలు సరఫరా చేయడానికి మారం మల్లికార్జునరావు, పూలు, పూల మాలలు సరఫరా చేయడానికి షేక్ మస్తాన్, మౌలాలి, పాలు సరఫరాకు శ్రీరామ రామలింగేశ్వరరావు, వీఐపీ వస్త్రాలు సరఫరాకు వసుంధర శిల్క్స్ , ప్రసాదం కవరు, ప్రింటింగ్ రసీదులు, ఇతర పుస్తకాలు సరఫరాకు ఎ. పూర్ణచంద్రరావు, లడ్డు, పులిహోర తయారీకి గుంజి రమణమ్మ, తిరుణాళ్ళకు షామియానా, వంట పాత్రలు సరఫరాకు మారుతి సప్లయర్స్ దక్కించుకున్నట్లు ఈవో సుభద్ర తెలిపారు.

ఓటర్ క్లయిమ్ విచారణను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలి

బల్లికురవ, ఫిబ్రవరి 12 : కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తులు వస్తే వెంటనే విచారణ పూర్తిచేసి కార్యాలయానికి పంపాలని తహసీల్దార్ సుభద్ర పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్నిగ్రామాల బూత్ లెవల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్వోలు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ లోపాలు లేకుండా అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, తొలగింపులకు ఎవరైన దరఖాస్తులు పెడితే వెంటనే వారికి నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు.. యువకుడికి గాయాలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 12: జాతీయ రహదారిలో వెంకటాపురం వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు గాయపడ్డాడు. సోమవారం ధైవాలరావూరుకు చెందిన వీరనారాయణ ద్విచక్రవాహనంపై రేణంగివరం వెళ్లడానికి పి.గుడిపాడు రోడ్డు నుంచి రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పీఎం కిసాన్ పథకంపై అవగాహన

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 12: వేటపాలెం మండలం దేశాయిపట 13 ఆర్బీకేలలో రైతులకు పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోవల్సిన ఆవశ్యకతపై ఏవో కాశీవిశ్వనాథ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 21లోగా రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ మనీషా, రైతులు పాల్గొన్నారు.

హైకోర్టులో మాజీ సర్పంచ్ అప్పీల్

చీరాల, ఫిబ్రవరి 12: చీరాల మండలం విజయనగర్‌కాలనీ సర్పంచ్ దుడ్డు రూపవతి 2014లో పెట్టిన కేసును ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేయటంతో ఆమె హైకోర్టులో అప్పీల్ చేశారు. రూపవతి, ఆమె భర్త మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తాము చేసిన అప్పీల్ పై సోమవారం హైకోర్టులో న్యాయమూర్తి సురేష్‌రెడ్డి సమక్షంలో విచారణ చేశారు. 2014లో విజయనగర్ కాలనీ సర్పంచ్‌గా ఉన్న రూపవతి, తమ గ్రామంలో నిర్వహించిన జన్మభూమి, మా ఊరు గ్రామసభ సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, అతని సోదరుడు ఆమంచి శ్రీనివాసరావు అలియాస్ స్వాములు, వారి అనుచరులు మరో 21 మంది తమపై దాడిచేసి దుర్భాషలాడారని, కులం పేరుతో దూషించారని కేసు పెట్టారు. అందుకు సంబంధించి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సదరు కేసు విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక స్థానంలో సాక్షులను విచారించిన మీదట న్యాయమూర్తి కొట్టివేశారు. ఈక్రమంలో రూపవతి హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లారు. సోమవారం హైకోర్టులో రూపవతి తరపున న్యాయవాది వైకే వాదనలు వినిపించారు. దీంతో నిందితులకు నోటీసులు జారీచేశారు. మరుసటి విచారణ వచ్చే నెల 11వ తేదికి వాయిదా వేసినట్లు రూపవతి, మధుబాబు తెలిపారు.

ప్రజావ్యతిరేక భూచట్టాన్ని రద్దుచేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కుల చట్టం 2022ను రద్దు చేయాలని పలువురు న్యాయవా దులు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలే దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం ద్వారా యజమానులకు, రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. న్యాయవ్యవస్థ ప్రమేయం లేకుండా న్యాయ, అన్యాయాల పరిశీలన రెవెన్యూ చేతుల్లోకి మారితే సామాన్యులకు భంగం వాటిల్లుతుందన్నారు. ఈక్రమం లో ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేయాలని, లేకుంటే అప్పటి వరకు పోరాటం తప్పదని తెలిపారు. దీక్షలో న్యాయవాదులు ఎంవీ చలపతిరావు, భానుప్రకాష్, చంద్రశేఖర్, నాగమణి శయన, పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

చినగంజాం, ఫిబ్రవరి 12: మూఢ నమ్మకాలపై ఉన్న నమ్మకాలను విడనాడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాష్ట్ర స్థాయి సైన్స్ కళాజాత కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి సైన్సు కళాజాత కార్యక్రమం ఈనెల 5 నుంచి 18 వరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు సైన్సు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామారావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి, చినగంజాం, కడవకుదురు జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు నాటుకోళ్ల యూనిట్లు పంపిణీ

మార్టూరు, ఫిబ్రవరి 12: మహిళలకు సుస్థిర జీవనోపాధి కలిగించేందుకు ఎఫర్ట్ సంస్థ కృషి చేస్తుందని డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు అన్నారు. మార్టూరులోని ఎఫర్ట్ కార్యాలయంలో సోమవారం పది మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా అసీల్ జాతి నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 11 నాటుకోళ్లు, వాటి రక్షణ కొరకు ఒక బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ జిల్లా మేనేజరు, ఎఫర్ట్ సంస్థ కార్యకర్తలు రామారావు, సురేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 12: యద్దనపూడిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో సోమవారం డ్వాక్రా గ్రూపులకు వైఎస్ఆర్ నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ఏపీఎం ఎస్.వెంకటరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శివ సుబ్రమణ్యం, జడ్పీటీసీ లక్ష్మీనారాయణమ్మ, యద్దనపూడి సర్పంచ్ వలేరు రేణుక, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మస్తాన్‌కు నివాళి

సంతమాగులూరు, ఫిబ్రవరి 12: మండలంలోని కొమ్మాలపాడు గ్రామానికి టీడీపీ సీనియర్ నాయకుడు వయ్యకంటి ఖాదర్ మస్తాన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మస్తాన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అయన వెంట స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దాడిపై కేసు నమోదు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 12: వ్యక్తిపై దాడికి సంబంధించి పలువురిపై కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు.. కారంచేడు మండలం జరుబులవారిపాలెంలో పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గురువయ్య అనే ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా కొడవలివారిపాలెం వెళుతున్నాడు. ఈక్రమంలో రోడ్డుపై నీటికోసం ఏర్పాటుచేసిన పైపులైను విషయంలో వివావాదం చోటుచేసుకుంది. పైపులైన్‌పై బైక్ వెళ్ళటంపై కొందరు వ్యక్తులు తమపై దాడిచేసినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులతోపాటు మరి కొంతమందిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

బంద్‌ను జయప్రదం చేయాలి


వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 12: దేశవ్యాప్తంగా ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ ప్రతినిధి పింజల భూషణం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకురాలు ఎస్. లలితకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12: చీరాల మండలం ఈపూరుపాలెం - బోయినవారిపాలెం మధ్యలో రైలు పట్టాలపై సోమవారం గుర్తుతెలియని సుమారు 50 ఏళ్ల వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడు తెలుపురంగు చొక్కా, నీలం తెలుపు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12: బాపట్ల జిల్లా స్థాయిలో జరిగిన ఇన్స్పైర్ ప్రదర్శన పోటీలలో శ్రీప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. పాఠశాలలో చదువుతున్న ఎల్లాల వైష్ణవి చేసిన ప్రాజెక్టు జిల్లాలో విజయం సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయురాళ్లు సుంకర శ్రీదేవి, లక్ష్మీలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



నేడు జడ్పీ బడ్జెట్ సమావేశం



నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 12 : జిల్లా పరిషత్ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం మంగళవారం నెల్లూరులో జరగనుంది. విధులు తప్ప పెద్దగా నిధులు లేని జడ్పీ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి సభ్యులు ఆమోదించనున్నారు. ఎజెం డాలో బడ్జెట్ మినహా ఏ ఇతర అంశాలను పొందుపరచలేదు.

● ఎంపీ, ఎమ్మెల్యేలకు చివరిది..

జడ్పీ సమావేశం జిల్లాలోని అన్ని గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రధాన వేదికగా ఉంటోంది. ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి హాజరై తమ నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తారు. అయితే కొంతకాలంగా జడ్పీకి నిధులు, ఆదాయ వనరులు లేకపోవడంతో జడ్పీ సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఎంపీ, ఎమ్మెల్యేల పదవీ కాలం మరో మూడు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుత జడ్పీ సమావేశం వారికి చివరిది కానుంది.

ముహూర్తం కుదిరింది!



● రేపే టిడ్కో ఇళ్ల పంపిణీకి రంగం సిద్ధం

● సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు ఆహ్వానాలు

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 12 : నెల్లూరులోని టిడ్కో గృహాల పంపిణీకి ఎట్టకేలకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 14వ తేదీన లబ్ధిదారులకు అందచేసేందుకు కార్పొరేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా లబ్ధిదారులకు ఆహ్వాన పత్రికలు అందచేసే పనిలోపడ్డారు. అల్లీపురంలోని టిడ్కో సముదాయం వద్ద 14న ఉదయం 10 గంటలకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అల్లీపురంతోపాటు వెంకటేశ్వరపురం ఫేజ్-2, అక్కచెరువుపాడు, కొండ్లపూడి, కల్లూరిపల్లి ప్రాంతాలలో 15,307 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఇందులో భాగంగా సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు కబురు పెడుతున్న కార్పొరేషన్ అధికారులు అల్లీపురం తరలిరావాలని కోరుతున్నారు. ఈ బాధ్యతలను ఇప్పటికే స్థానిక వలంటీర్లకు అప్పగించారు. సార్వత్రిక ఎన్నికల గడువు తరుముకొస్తున్న నేపథ్యంలో అరకొరగా సిద్ధం చేసిన ఇళ్లను లబ్ధిదారులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

వివరాలు అడిగితే ఇవ్వరేం!



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులకు నిధుల వివరాలు, సాధారణ, అత్యవసర సమావేశాల్లో కౌన్సిల్ తీర్మానం చేసిన అంశాలను ఇవ్వాలని పలుమార్లు అధికారులను కోరిన స్పందించడం లేదని వైసీపీ రెబల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆయన నేలపై పడుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ నిథులు దుర్వినియోగం అయ్యాయని, కౌన్సిలర్లకు తెలియకుండానే కొన్నా అంశాలను తీర్మానించినట్లు రికార్డుల్లో పొందుపరిచారని విమర్శించారు. సంబంధిత పత్రాలు ఇవ్వాలని తాను సమాచార హక్కు చట్టం కింద కోరి 70 రోజులు గడుస్తున్నా ఇప్పటిదాకా అతీగతీ లేదన్నారు. ఈ క్రమంలో కమిషనర్ షేక్ ఫజుల్లులా అక్కడకు చేరుకుని భాస్కర్‌రెడ్డిని సముదాయించారు. ఇటీవల తాను బాధ్యతలు తీసుకున్నానని, త్వరలో కోరిన సమాచారాన్ని ఇస్తానని హామీ ఇవ్వడంతో ఆయన శాంతించారు.


- ఆత్మకూరు

డబుల్ ఎంట్రీలు..

మృతులకూ స్థానం!

ఓటర్ల జాబితాలో వింతలు

- నెల్లూరు నగరంలో ఎన్నెన్ని సిత్రాలో!
- ఫారం-7 దరఖాస్తులు తిరస్కరించారు సరే..
- మరి ఓటర్లు ఎక్కడున్నారో!?
- సరైన సమాధానం ఇవ్వలేని బీఎల్వోలు



నెల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్ని విమర్శలు వచ్చినా.. మరెన్ని ఫిర్యాదులు అందినా.. ఆఖరుకు ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకున్నా ఓటర్ల జాబితా తప్పుల తడకగానే ఉంది. డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లను తొలగించకపోవడం, కొందరు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయినా వారి ఓట్లు ఇంకా స్థానికంగా ఉండటం.. వంటి అనేక విచిత్రాలు జాబితాలో దర్శనమిస్తున్నాయి. ఓటర్ల జాబితాలో అవకతవకలపై భారీగా ఫిర్యాదులు అందడంతో గతేడాది ఎన్నికల సంఘం డోర్ టు డోర్ సర్వే నిర్వహించింది. ఆ తర్వాత ప్రత్యేక సమ్మరీ రివిజన్ జరిగింది. జనవరి 5వ తేదీ నాటికి ఓటర్ల ముసాయిదాను ప్రచురించాల్సి ఉన్నా అభ్యంతరాలు భారీగా రావడంతో ఓటర్ల జాబితాను స్వచ్ఛంగా రూపొందించేందుకు జనవరి 22వ తేదీ వరకు అధికారులకు సమయమిచ్చింది. అయినా ఫలితం లేదు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పరిశీలిస్తే అనేక లోపాలు బయటపడుతున్నాయి. షేక్ కరీమున్నీసా అనే వ్యక్తికి జాకీర్ హుస్సేన్ నగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల 2వ తరగతి రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. అదే వ్యక్తికి పక్కనే 1వ తరగతి రూమ్‌లో ఉన్న మరో పోలింగ్ కేంద్రంలో కూడా ఓటు ఉంది. ఈ రెండు ఓట్లకు సంబంధించిన ఎపిక్ నంబర్లు కూడా వేర్వేరు కావడం గమనార్హం. షేక్ ఖాదర్ అనే మరో వ్యక్తికి నవాబుపేటలోని మున్సిపల్ హైస్కూల్ రెండవ తరగతి రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. ఇదే వ్యక్తికి ఎన్‌సీ బాలయ్య నగర్‌లోని మున్సిపల్ స్కూల్ పదో తరగతి ఏ సెక్షన్ రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో కూడా ఓటు ఉంది. ఈ రెండు ఎపిక్ కార్డులు కూడా వేర్వేరు. షేక్ కరీమున్నీసా అనే ఇంకో వ్యక్తికి మూలాపేట వేద సాంస్కృతిక కాలేజీ ఆఫీసు రూమ్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు ఉంది. అలానే అదే కాలేజీ ఆగమ భవన్‌లోని పోలింగ్ కేంద్రంలో కూడా మరో ఓటు ఉంది. ఈ రెండు ఓట్లకు సంబంధించి ఎపిక్ కార్డులు కూడా వేర్వేరుగా ఉన్నాయి. ఇటువంటి డబుల్ ఎంట్రీలు సిటీలో అనేకం కనిపిస్తున్నాయి.



ఆ ఓటర్లు ఎక్కడున్నారో..?

పలుచోట్ల మృతులు, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వ్యక్తులకు కూడా స్థానికంగా ఓట్లు ఇంకా ఉన్నాయి. వీటిపై ప్రతిపక్ష పార్టీలు ఫారం-7 దరఖాస్తులు అందజేసినా ఆ ఓట్లను తొలగించలేదు. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలంటే ఫారం-7 దరఖాస్తుతోపాటు డెత్ సర్టిఫికెట్ కూడా అడగడంతో చాలా మందికి ఆ సర్టిఫికెట్ దొరక్క దరఖాస్తు చేయలేదు. కొన్ని దరఖాస్తులు చేసినా వాటిని బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అలా జరగలేదు. 43వ డివిజన్‌లోని 67,68 పోలింగ్ కేంద్రాల్లో ఉన్న చనిపోయిన వారి ఓట్లే ఇందుకు ఉదాహరణ. అలానే కొందరు ఆ ప్రాంతం వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోగా అటువంటి ఓట్ల తొలగింపునకు కూడా ఫారం-7 దరఖాస్తులు అందాయి. కానీ వీటిలో చాలా వాటిని అధికారులు తిరస్కరించారు. అంటే వీరంతా స్థానికంగానే ఉన్నట్లు నిర్ధారించారు. మరి వారు ఎక్కడున్నారన్నది మాత్రం ప్రతిపక్ష పార్టీల నాయకులకు తెలియడం లేదు. మేము పెట్టిన ఫారం-7 దరఖాస్తులను తిరస్కరించారు సరే.. పోనీ ఆ ఓటర్లు ఎక్కడున్నారో చెబితే మేము ఓటు అభ్యర్థించుకుంటాం.. అంటూ ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నా బీఎల్‌వోల నుంచి సరైన సమాధానం ఉండటం లేదు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

● నేడు నెల్లూరులో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

● 154 నమూనాల ప్రదర్శన.. విస్తృత ఏర్పాట్లు



అధికారులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 12 : విద్యార్థుల మదిలో మెదిలే సమస్యలకు పరిష్కారం, సమాజానికి మేలు చేసే ఆలోచనలకు రూపమివ్వడం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నాలు చేయడమే లక్ష్యంగా ఇన్‌స్పైర్ మనక్ పని చేస్తుంది. కొత్తదనాన్ని ప్రోత్సహించి ఆవిష్కరణల దిశగా వారిని నడిపిస్తోంది. వీటిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో 2022-23 విద్యా సంవత్సరానికి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విస్తృత ఏర్పాట్లు చేశారు. మంగళవారం జరిగే ఈ ప్రదర్శనలో 154 నమూనాలను విద్యార్థులు ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు డీప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో 18 కమిటీలు ఏర్పాటు చేశారు. కమిటీల్లోని సభ్యులంతా సక్రమంగా విధులు నిర్వర్తించి విజయవంతం చేయాలని డీఈఓ రామారావు ఆదేశించారు. ఎంపికైన విద్యార్థులంతా నాణ్యమైన ప్రాజెక్ట్‌లతో హాజరు కావాలని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. స్టాల్స్, సభా ప్రాంగణం, సమావేశ మందిరం తదితర ఏర్పాట్లను సంబంధిత అధికారులు పరిశీలించారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. నెల్లూరు, కావలి డిప్యూటీ ఈఓలు ప్రసన్నలక్ష్మి, రఘురామయ్య, ఎంఈఓలు మురళీధర్, బిక్షాలు, అబ్దుల్ హమీద్, పాఠశాల హెచ్‌ఎం కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

'సోమశిల'లో 22.205 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 12 : సోమశిల జలాశయంలో 22.205 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, రోజురోజుకు నీటిమట్టం దిగజారుతుండటంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

● జిల్లాలో 346 పోస్టుల భర్తీకి ఆమోదం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 12 : ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ సోమవారం ఆరంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 6100 పోస్టులకుగాను జిల్లాలో 346 పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు ఫీజు చెల్లించి సీఎస్‌ఈ డాట్ ఏపీ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఈ నెల 27 నుంచి మార్చి 9వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో టెట్ నిర్వహించి మార్చి 14న ఫలితాలు విడుదల చేస్తారు. ఏపీ డీఎస్సీ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్‌లను మార్చి 5వతేదీన జారీ చేసి, అదే నెల 15 నుంచి 30వతేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో డీఎస్‌సీ పరీక్షలు ఉంటాయి. డీఎస్సీ ప్రాథమిక కీని మార్చి 31న విడుదల చేసి ఏప్రిల్ 1వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 2న తుది కీ విడుదల చేసి 7న ఫలితాలు వెల్లడిస్తారు ఈ పరీక్షలు 2018 డీఎస్సీ సిలబస్ ప్రకారమే నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు.

● జిల్లాలో 346 పోస్టులు

సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) విభాగంలో పాఠశాల విద్యకు 102, ట్రైబల్ వెల్ఫేర్‌కు 2 పోస్టులు కలిపి మొత్తం 104, స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)ల విభాగంలో పాఠశాల విద్యకు 137, ట్రైబల్ వెల్ఫేర్‌కు 2, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌కు 1 కలిపి మొత్తం 140, టీజీటీల విభాగంలో ఏపీ మోడల్‌స్కూల్స్‌కు 17, సోషల్ వెల్ఫేర్‌కు 18, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌కు 55, ఏపీ రెసిడెన్షియల్‌కు 12 కలిపి మొత్తం 102 పోస్టులు కేటాయించారు.

ఎండుతున్న పైరు..

రైతు కంట కన్నీరు!



ఎన్నో ఆశలతో అన్నదాత సాగు చేసిన వరికి నీరందడం లేదు. దీంతో పగుళ్లిచ్చిన భూమిలో పైరు ఎండుతుండటంతో కర్షకుడు కుమిలిపోతున్నాడు. చేజర్ల మండలంలోని కండాపురం, కాకివాయి, నాగులవెల్లటూరు తదితర గ్రామాల్లో దక్షిణ కాలువ కింద వరి సాగవుతోంది. ఎన్నడూ లేని విధంగా ఈ కాలువకు వచ్చే నీటిని వారంలో నాలుగు రోజులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో నీరందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. సోమశిల డ్యాం నుంచి వంద కి.మీ దూరం పైన ఉండే గ్రామాలకు సమృద్ధిగా నీరు అందుతూ రెండు కార్లు పంటలు పండిస్తున్నారని, కేవలం పట్టుమని 20 కి.మీ దూరం కూడా లేని తమ గ్రామాలకు ఒక కారు పంటకు కూడా నీరివ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క చేజర్ల మండలమే కాకుండా 10 కి.మీ కూడా దూరం లేని కలువాయి మండలంలోని కుల్లూరు, మాదన్నగారిపల్లి, పెన్నబద్వేల్, నూకనపల్లి, తెలుగ రాయపురం, తోపుగుంట, ఆగ్రహారం, కనుపూరుపల్లి, వెరుబొట్లపల్లి, వెదరపర్తి తదితర గ్రామాల్లోనే ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత యంత్రాంగం స్పందించి సాగుకు నీరందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

- చేజర్ల

మిర్చి రైతు దిగాలు

దిగుబడిపై తెగుళ్ల ప్రభావం ● మద్దతు ధర కూడా అంతంతే!

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 12 : మిర్చి పంట రైతు కంట్లో కారం కొట్టింది. పంటకు ఆకు ముడత తెగులు సోకడం, కాలం కలిసిరాక పోవడం అన్నిటికీ మించి వర్షాభావంతో దిగుబడులు తగ్గిపోయాయి. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులు లాభాలు ఆర్జించారు. దీంతో గతేడాది డిసెంబరు నుంచి కోటి ఆశలతో అధిక విస్తీర్ణంలో మిర్చి సాగు చేశారు. వలేటివారిపాలెం మండలంలో చుండి, అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, లింగసాలెం, అంకభూపాలపురం, జమీన్ ఉప్పలపాడు, పోలినేనిపాలెం, కూనిపాలెం పోకూరు కొండసముద్రం, బండివారిపాలెం తదితర గ్రామాలలో 9వేల ఎకరాల్లో మిర్చి సాగు అయ్యింది. ఎకరాకు రూ.2 లక్షలకుపైగానే పెట్టుబడులు పెట్టారు. అయితే, గత నెలలో కురిసిన వర్షాలకు ఆకు ముడత తెగులు సోకడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. ఆ తర్వాత కూడా వర్షాభావంతో మొక్కలు ఎండుముఖం పట్టాయి. గతేడాది ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఇప్పుడు 15 నుండి 20 క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. 20 రోజులుగా ముమ్మరంగా మిర్చి కోతలు కోసి కళ్లాల్లో ఆరబెట్టారు. దళారులకు విక్రయాలు కూడా జరుపుతున్నారు. కొంతమంది గుంటూరు మిర్చి యార్డుకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. గతేడాది క్వింటం గరిష్ఠంగా రూ.21వేల వరకు పలకగా, ఇప్పుడు రకాన్ని బట్టి రూ.15 వేల నుంచి 19 వేలకు కొనుగోలు చేస్తున్నారు. అసలే తెగుళ్లతో దిగుబడులు రాక అల్లాడుతుంటే దళారులు నిలువునా మోసం చేస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





అటవీ శాఖ భూముల్లో సాగు చేస్తున్న రొయ్యల గుంతలు

ఆంధ్రజ్యోతి పరిశీలన

ప్రభుత్వ భూమేగా

చేసేయ్ కబ్జా!

దక్షిణ కాశీగా పేరొందిన విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలోని తీరం ప్రాంతంలో కబ్జాల పరంపర కొనసాగుతోంది. వందల ఎకరాల ప్రభుత్వ, అటవీ శాఖ భూములు ఆక్రమణకు గురవుతుండగా వీటిని లీజుకు ఇచ్చి కబ్జారాయుళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారంపై రామలింగేశ్వర స్వామి భక్తుడు, ఇస్కపల్లికి చెందిన కొండూరు మాధవ్ గతేడాది 'స్పందన'లో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. అయితే, నెలలు గడుస్తున్నా తీరంలో భూ ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సోమవారం కూడా ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు.

- ఆక్రమణదారుల చెరలో రామతీర్థం తీరం
- రొయ్యల గుంతలుగా మారుతున్న భూములెన్నో!
- గతేడాది కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా బేఖాతర్
- ఇప్పుడు మళ్లీ అధికారులకు మొర

విడవలూరు, ఫిబ్రవరి 12 : విడవలూరు మండలంలో ఊటుకూరు పెద్దపాళెం నుంచి పొన్నపూడి కొత్తూరు వరకు సుమారు 500 ఎకరాల అటవీ శాఖ, సీలింగ్ భూములు ఉన్నాయి. ఎంతో విలువైన ఈ భూములను కొంతమంది ఆక్రమించి రొయ్యల గుంతలుగా మార్చేశారు. రామతీర్థం గ్రామం రామలింగాపురం సమీపంలో సర్వే నెం.910-3లో సుమారు 25 ఎకరాలు, మరో సర్వే నెం.184-బిలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ, అటవీ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. అధికార పార్టీ నేతల అండదండలతో కొంతమంది ఈ భూములను ఆక్రమించుకున్నారు. అటవీ శాఖ భూముల్లో ఉన్న సవక చెట్లను తెగనరికి రొయ్యల గుంతలుగా మార్చేశారు. ఇలా వేసిన రొయ్యల గుంతలను ఎకరాకు రూ.3 లక్షల 5లక్షల చొప్పున ఇతరులకు లీజుకు ఇచ్చేస్తున్నారు.

● యథేచ్ఛగా విద్యుత్ కనెక్షన్లు

ప్రభుత్వ నిబంధనలు కాలరాసిన విద్యుత్ శాఖ అధికారులు ఆక్రమిత భూములకు యథేచ్ఛగా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. ఈ మేరకు భారీగానే ముడుపులు తీసుకుని పట్టాలు ఉన్న రైతుల పేరిట స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి మరీ కనెక్షన్లు ఇచ్చారని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సముద్ర తీరం సమీపంలో మోటార్లు ఏర్పాటు చేసుకుని రొయ్యల గుంతలను ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారు.



నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

● పట్టించుకోని అధికారులు

రామతీర్థంలోని తీర ప్రాంతం కబ్జాకు గురైనందున రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, సముద్రంలో స్నానమాడిన వారికి చర్మవ్యాధులు వస్తున్నాయని రామలింగేశ్వర స్వామి భక్తజన బృందం సభ్యులు, ఇస్కపల్లికి చెందిన కొండూరు మాధవ్ గత ఏడాది నవంబరు 6న కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే సంబంధిత అధికారులు ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన రెండోవ సారి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైన సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కొరుతున్నారు.

విచారిస్తున్నాం!

రామతీర్థం తీరప్రాంతంలో ఆక్రమణకు గురైన భూములపై గతంలో ఫిర్యాదు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. అయినా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాము.

- భానుప్రకాష్, ఇన్‌చార్జి తహసీల్దారు

హైకోర్టును ఆశ్రయిస్తా...



తీరంలో ఆక్రమణలపై గతంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. భూముల ఆక్రమణ రోజురోజుకు ఎక్కువవుతోంది. దీంతో రెండోసారి కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తాను.

- కొండూరు మాధవ్, రామలింగేశ్వర స్వామి భక్తుడు

నిరుద్యోగుల వయోపరిమితి ఐదేళ్లు పెంచాలి : యూటీఎఫ్



ఉదయగిరి రూరల్: డీఎస్సీ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



సీతారామపురం : జీవో కాపీలను దహనం చేస్తున్న మండల నాయకులు



ఏఎస్ పేట: పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఎదుట సోమవారం యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు ఎడమ తిరుపతయ్య మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం రద్దయిన అప్రంటీస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. గత ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించనందున నిరుద్యోగుల వయోపరిమితి మరో ఐదేళ్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనీఫ్, ఎం ఫణిరాజు, నాయకులు సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, వెంకటరెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదురుగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్షుడు బోగ్యం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గొడ్డవేటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి తిరుపతయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పేరాల శ్రీనివాసులు, నాయకులు బాలకృష్ణారెడ్డి, అన్నంగి ప్రసాద్, సుబ్బారావు, లక్ష్మయ్య, సురేష్, డి వెంకటేశ్వర్లు, బాల గురవయ్య, ఆనందేశ్వరయ్య, శంకర్‌రెడ్డి, మహేష్, పవిత్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

ఏఎస్ పేట: సీపీఎస్ రద్దు చేయాలని మండల యుటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక జడ్పీహైస్కూల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎస్ రద్దుచేసి పాత విధానం పునరుద్ధరించాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు అన్ని పార్టీల నాయకులకు పోస్టు కార్డులను పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు మల్లికార్జునరావు, మండల గౌరవ అధ్యక్షుడు జిలాని పాషా, ప్రధాన కార్యదర్శి ఖాజా రహమతుల్లా, నాయకులు సుబ్బయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ బొమ్మతో ఇంటి పత్రం



ఉదయగిరి, ఫిబ్రవరి 12: జగనన్న ఇళ్ల పట్టాల లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం సిద్ధం చేసిన స్థలం, భూ బదలాయింపు దస్తావేజుల్లో కూడా సీఎం జగన్ ఫోటోలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే ఇంటి పట్టాల్లో పెద్దసైజు ఫోటోలను బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించేలా ముద్రించారు. దీనికితోడు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి దస్తావేజుల్లో కూడా అదేవిధంగా జగన్ ఫోటోలను ముద్రించారు. భూ బదలాయింపు దరఖాస్తులు మూడు పేజీలు ఉండగా మూడు పేజీల్లోనూ జగన్ ఫోటోలను పెద్దగా ముద్రించడం గమనార్హం.

ఉచిత వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న ప్రతినిధులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని గణేశ్వరాపురంలో సోమవారం కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, టీడీపీ నియోజకవర్గ నాయకుడు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న గ్రామంలోని 124 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షల్లో విజేతలకు అభినందనలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వింజమూరు, ఫిబ్రవరి 12: ఇటీవల అపస్, యూటీఎఫ్ నిర్వహించిన ప్రతిభా పరీక్షల్లో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వతరగతి విద్యార్థులు ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. ఆ విద్యార్థులను సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ మాల కొండయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

తప్పుల తడకగా ఓటర్ల జాబితా : టీడీపీ



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితా తప్పుల తడకగా ఉందని, కనీసం చనిపోయిన వారి పేర్లు కూడా తొలగించలేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు విమర్శించారు. ఈమేరకు సోమవారం పలువురు స్థానిక టీడీపీ నేతలు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఏళ్ల తరబడి నివాసంలేని వారి ఓట్లు సైతం జాబితాలో తొలగించలేదన్నారు. జీరో డోర్ నెంబర్లతో చాలా ఓట్లు నమోదై ఉన్నాయన్నారు. ఒకే కుటుంబాల్లోని ఓట్లు సైతం వేర్వేరు వార్డుల్లో ఉన్నాయని, అధికారులు స్పందించి ఓటర్ల జాబితాను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఖాదర్‌బాషా, టీడీపీ నేతలు చెరుకూరు తిరుపతినాయుడు, సిహెచ్ నరేష్, పి మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఇవ్వాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల వ్యవసాయ రంగానికి ఏడు గంటల విద్యుత్ సరఫరా మాత్రమే ఇస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏడు గంటల విద్యుత్ సరఫరాలో సైతం అంతరాయాలు ఏర్పడుతుండడంతో ప్రస్తుతం సాగు చేసిన, కోత దశలో ఉన్న పంటలు వాడు దశకు చేరుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా ఇవ్వాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పాఠశాల స్థలంలో రామాలయం నిర్మించొద్దు

● అధికారుల హెచ్చరిక



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మర్రిపాడు, ఫిబ్రవరి 12: ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన రామాలయ నిర్మాణం చాబోలులో అధికారులకు తలనొప్పిగా మారింది. చాబోలు ఎస్సీ కాలనీలో వున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని శిథిలా వస్థకు చేరిందనే నెపంతో దసరల సెలవుల సమయంలో నేతలు కూల్చి, భూమిని చదును చేశారు. అక్కడ చదువుతున్న విద్యార్థులకు మెయిన్ పాఠశాలలో ఉన్న అదనపు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా, చదును చేసిన ప్రాంతంలో రామాలయం నిర్మించాలని నేతలు తలపెట్టారు. సమాచారం తెలుసుకొన్న మండల విద్యాశాఖాధికారులు నజీర్ బాషా, ధనలక్ష్మి ఎంపీడీవో మనోహర్‌రాజ్‌తో కలిసి ఆప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, తమకు తెలియకుండా ఆ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని స్థానిక నేతలను హెచ్చరించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. సోమవారం మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు పరిశీలించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకున్న అంశాలను జీవో జారీచేయకుండా కాలయాపన చేస్తోందని మున్సిపల్ కార్మిక సంఘం (ఏఐటీయుసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, పట్టణ కార్యదర్శి బి హజరత్తయ్య విమర్శించారు. సోమవారం మున్సిపల్ కార్మికులతో కలిసి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ ఈవీ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక డీఈ కార్యాలయంలో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు అవగాహన కల్పించి వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయో నివేదిక సమర్పించాలన్నారు. అనంతరం తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్లు ధ్వంసం



చేజర్ల కండ్రిక రోడ్డులో కూరుకుపోయిన లారీ

చేజర్ల : భారీ వాహనాల కారణంగా మండలంలోని చేజర్లవారి కండ్రిక రహదారి ధ్వసం అవుతోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ సప్పట వద్ద కుంగిపోవడంతో గ్రామస్థులు అక్కడకు చేరుకుని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని, రహదారిని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం..

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల వసతిగృహంలో ఉండే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపికృష్ణ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల కళాశాలలో చదివే విద్యార్థులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురయ్యారనే విషయం అవాస్తమన్నారు. కొంతమంది విద్యార్థులు సాధారణ అనారోగ్య కారణాల వల్ల అస్వస్థతకు గురై చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారన్నారు. ఒకరిద్దరు విద్యార్థులు బయట తిన్న ఆహారం కారణంగా అస్వస్థతకు గురయ్యాయన్నారు. మేకపాటి కుటుంబీకుల ఆధ్వర్యంలో కళాశాల నడుస్తుందని చెప్పడం వాస్తవం కాదని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ హేమలత, వార్డెన్ వై బాలచంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 12: మండలంలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల లబ్ధిదారులకు ఈకేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం పేర్కొన్నారు. మండలంలో 5,784 ఆయుష్మాన్ భారత్, 6,890 ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ జరిగిందన్నారు. లబ్ధిదారులందరికీ సచివాలయ సిబ్బంది రెండు రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయాలని ఆమె సూచించారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సంక్షేమ పథకాలు కొనసాగుతాయి!

కావలి,ఫిబ్రవరి12: టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకు కోత వేస్తారని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని కావలి ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పాత పథకాలను కొనసాగిస్తూ సూపర్ సిక్స్ పథకాలను అందచేస్తారన్నారు. కావలి ముసునూరులోని ఆయన నివాసంలో సోమవారం పలుగ్రామాలకు చెందిన వైసీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి కావ్య పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. కావలి రూరల్ మండలం పూలదొరువుకు చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలు రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే రుద్రకోటకు చెందిన పలువురు నేతలు ముక్కు గోపాల్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కావలి ఏఎంసీ ఛైర్మన్ సన్నెబోయిన ప్రసాద్ స్వగ్రామమైన చెన్నాయపాలెం నుంచి పలువురు నేతలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సర్వాయపాలెంకు చెందిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి తన అనుచరులతో టీడీపీలో చేరారు.



టీడీపీలో చేరిన పూలదొరువు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైభవంగా గంగమ్మ మహాలక్ష్మమ్మల తిరునాళ్ల



గ్రామోత్సవంలో గంగమ్మ

అల్లూరు, ఫిబ్రవరి 12 : అల్లూరుపేట సత్రంలో వెలసి ఉన్న గంగమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల గ్రామోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆది, సోమవారాల్లో అమ్మవార్ల తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ముందుగా పోతురాజుకు చల్ది నైవేద్యం అనంతరం అమ్మవార్లకు పొంగళ్లు పొంగించారు. గంగమ్మ గ్రామోత్సవంలో గంగపెట్టె, వీరతాళ్లు, మహాలక్ష్మమ్మ గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బాణసంచా వెలుగులు, తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా కోలాటాలు, నృత్యాలు భక్తులను అలరించాయి. అమ్మవార్లను కావలి టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కందుకూరు, ఫిబ్రవరి 12: మాఘ పౌర్ణమి సందర్భంగా కందుకూరు నుంచి ఈనెల 22న అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం పెద్దన్నశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోజన వసతితో కలుపుకుని టికెట్ ధర రూ. 2,600గా నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనివేటి మండపానికి విరాళం



విరాళం అందచేస్తున్న దాతలు

కందుకూరు, ఫిబ్రవరి 12: కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన అనివేటి మండపం నిర్మాణం కోసం సోమవారం గాలి కామేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి ఇందిరాదేవి, కుమారులు గాలి వెంకటరామకృష్ణ-సుగుణ దంపతులు, గాలి వెంకటరమణకుమార్- శారద దంపతులు రూ. 50,001లు విరాళం ఇచ్చారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు మురళీమోహన్‌కు ఈ మొత్తాన్ని వారు అందజేశారు.

కలిగిరి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



రంగ సుబ్బరాయుడు

కలిగిరి, ఫిబ్రవరి 12: ఎంపీడీవోగా ఎం. రంగ సుబ్బరాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు పోలింగ్ బూత్‌ల నిర్వహణ, వసతుల కల్పనలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈవీఎంలపై అవగాహన కల్పిస్తాం..

అల్లూరు : రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర అన్నారు. సోమవారం అల్లూరు ఎంపీడీవో కార్యాలయానికి రెండు ఈవీఎంలు చేరుకున్నాయి. ఆయన వాటిని పరిశీలించి మాట్లాడారు. బూత్ లెవల్ అధికారుల ద్వారా వీటిని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఉంచి, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీ మృతికి సంతాపం

కావలిటౌన్ : ప్రభుత్వ ఖాజీ సయాద్ మౌలానా (37) మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు. సోమవారం సాయంత్రం కావలిలో అంత్యక్రియలు నిర్వహించారు.ఆయన మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. జిల్లా నుంచే కాక చైన్నై, హైదరాబాద్, బెంగళూరు నుంచి పలువురు మైనారిటీ ప్రముఖులు, మత గురువులు తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేత కావ్య కృష్ణారెడ్డి, మైనార్టీ నేత సప్తార్ కిర్మాణి, కుందుర్తి కామయ్య తదితర ప్రముఖులు సంతాపం తెలిపారు.

సెంటిమెంట్‌తో వైసీపీ నేత ప్రచారం

జలదంకి : ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం మండలంలోని జమ్మలపాలెంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గ ఈశాన్యం వైపు నుంచి సెంటిమెంట్‌తో రాజారెడ్డి జమ్మలపాలెం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు, ఎంపీపీలు, పలువురు సర్పంచులు, పార్టీ ఎన్నికల పరిశీలకుడు ధనుంజయరెడ్డి, నాయకులు పాలవల్లి మాలకొండారెడ్డి, కేతిరెడ్డి రవిరెడ్డి, సర్పంచి బుర్రి శ్రీవేణి, కేతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, మాధవ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు మున్సిపల్ కార్మికుల నిరసన



మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కావలి, ఫిబ్రవరి12: సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) పిలుపు మేరకు సోమవారం మున్సిపల్ కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పట్టణంలోని నాలుగు డివిజన్లలోని మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమ్మెకాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు విడుదల చేసిన జీవోలను అమలు చేయాలన్నారు. మిగిలిన హామీల జీవోలను విడుదల చేయాలని వారు కోరారు. హామీలు అమలయ్యే వరకు దశల వారీగా ఆందోళన చేపడతా మన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, గుంజి కిషోర్, ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, వై. రవి, గుంజి అంకయ్య, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం పోటీ చేయమంటే ఆలోచిస్తా : బీఎమ్మార్



కావలి, ఫిబ్రవరి12: రానున్న ఎన్నికల్లో కావలి నుంచి పోటీ చేయాలని అధిష్ఠానం ఆదేశిస్తే అప్పుడు ఆలోచిస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు తెలిపారు. సోమవారం కావలి మినీస్టేడియంలో వాకింగ్‌కు వచ్చిన ఆయన అక్కడున్న విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. 2028 వరకు తనకు రాజ్యసభ పదవీకాలం ఉందని, కావలిలో పోటీకి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఉన్నందున ఇక్కడ అభ్యర్థి అవసరంలేదన్నారు. మరో మూడు నెలల పాటు కావలిని వదిలిపెట్టిపోనని చెప్పారు. కాగా టీడీపీలో ఉన్నప్పుడు అనుచరులుగా కొనసాగినవారిని తన స్వగృహంలో పార్టీ కండువాలు కప్పి వైసీపీలో చేర్చుకున్నారు. కాగా మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని వాకర్లు కోరగా, స్పందించిన బీద ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు అందచేస్తానన్నారు. దశలవారీగా స్టేడియం అభివృద్ధికి కృషిచేస్తానని బీద పేర్కొన్నారు.

నీటి విడుదలకు వినతి



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి12: సంగం బ్యారేజీ వద్ద కావలి కాలువకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఆర్డీవోను కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఆర్డీవో కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరు మాల్యాద్రి మాట్లాడుతూ కావలి కాలువ మీదున్న మోటార్లను 10రోజుల్లో ఐదు రోజులపాటు ఆపగలిగితే చివరి ఆయకట్టును కాపాడుకోవచ్చన్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. కార్యక్రమంలో సంఘం నేతలు రావి మాల్యాద్రి, పేముల సీతారామయ్య, గడ్డం మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఉపాధ్యక్షుడిగా పువ్వాడి



కావలిటౌన్, ఫిబ్రవరి12: కావలి మండలం రామచంద్రాపురం ఎంపీయూపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పువ్వాడి వెంకటేశ్వర్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్రకౌన్సిల్ సమావేశాల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మంజుల, కె భాను మూర్తి, జిల్లా నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ సుశీలకు బెస్ట్ ఉమన్ సైంటిస్టు అవార్డు



ప్రిన్సిపాల్ నుంచి అవార్డు అందుకుంటున్న సుశీల

కావలి,ఫిబ్రవరి12: స్థానిక వీఎస్‌యూ జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ మీసాల సుశీలను నావల్ రీసెర్చ్ అకాడమీ వారు బెస్ట్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం వీఎస్‌యూలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అవార్డును అందచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీ. శైలజ, డాక్టర్ పీ. గోపిక్రిష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు అభినందనీయం

బిట్రగుంట, ఫిబ్రవరి 12: ఏళ్ల తరబడి వీధిదీపాలకు నోచుకోని అక్కరాజువారికండ్రిక అరుంధతీవాడకు బోగోలు మాజీ సర్పంచి బోగిరి మణెమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త బోగిరి. యోహాను వీధి దీపాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, వీధిదీపాలను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసీపీ నేత వీరరఘు, ఎమ్మార్పీఎస్ నేత జయ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జంపాలవారిపాలెంలో తాగునీటి ఇక్కట్లు

లింగసముద్రం, ఫిబ్రవరి 12 : పంచాయతీలోని జంపాలవారిపాలెం గ్రామస్థులకు తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్నారు.ఇదే పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం నీటి ట్యాంకు నుంచి ఈ గ్రామానికి నీరు వస్తోంది. రెండు రోజుల నుంచి నీరు రావడం లేదని కాలనీవాసులు చెప్పారు.ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా స్పందన లేదని చెప్పారు.

అల్లిమడుడు పీహెచ్‌సీ తనిఖీలు

బిట్రగుంట, ఫిబ్రవరి 12: బోగోలు మండలం అల్లిమడుగు పీహెచ్‌సీని సోమవారం అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, కోవూరుపల్లి వైద్యులు నిత్యప్రశాంతి, సూపర్‌వైజర్ వసంత తదితరులు ఉన్నారు.

కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించండి



ఓ వైపు పెద్ద గుంత, మరో వైపు రక్షణ గోడ లేని కల్వర్టు

లింగసముద్రం, ఫిబ్రవరి 12 : మండలంలోని పెంట్రాలలోని తాతాహోటల్ సెంటర్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కల్వర్టుకు రెండువైపులా రక్షణ గోడలు లేవు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్రఆందోళన చెందుతున్నారు.ఈ విషయాన్ని చాలాకాలం నుంచి అధికారుల దృష్టికి తీసుకెళుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కల్వర్టుకు తూర్పు వైపున పెద్ద గుంత ఉంది. ఈ గుంతను గమనించకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది.పడమర వైపున ఉన్న రోడ్డు మార్జిన్‌ను పక్కనే ఉన్న ఇంటి యజమాని ఆక్రమించాడు. దీంతో రోడ్డు కుచించుకొని పోయింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య లోపంతో వ్యాధుల భయం

వలేటివారిపాలెం : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు లేకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు వ్యాప్తి చెందాక మొక్కుబడిగా పారిశుధ్య చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడంలేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని కూనిపాలెం, పోకూరు, వలేటివారిపాలెం, రోళ్లపాడు, పోకూరు, శింగమనేనిపల్లె శాఖవరం, బంగారక్కపాలెం తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. మురుగు పోయేందుకు కాలువలు లేకపోవడంతో వానాకాలం వస్తే మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కాలువలు ఉన్న చోట చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు,పేడ దిబ్బలు ఉండడంతో రోడ్లపైకి మురుగునీరు ప్రవహిస్తున్నది. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలి.